నేటి నుంచి
కిసాన్-మజ్దూర్
జన జాగరణ్

- 26న దేశవ్యాప్తంగా ట్రాక్టర్స్ మార్చ్
- సంయుక్త కిసాన్ మోర్చా

లోపలి పేజీలో..

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupati, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 157 | విజయవాడ, బుధవారం 10 జనవరి 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 10 January 2024 | Rs



జాతీయ క్రీడా అవార్డుల ప్రదానం

- రాష్ట్రపతి భవన్‌లో అట్టహాసంగా వేడుక
- టోర్నీల కారణంగా సాత్విక్-చిరాగ్, ఈషా సింగ్ దూరం

లోపలి పేజీలో..



కోడి పందేలకు అనుమతి ఇవ్వం

- హైకోర్టుకు హోంశాఖ హామీ

ప్రజాశక్తి-అమరావతి

సంక్రాంతికి కోడి పందేల నిర్వహణకు అనుమతి ఇచ్చేది లేదని రాష్ట్ర హోం శాఖ హైకోర్టుకు హామీ ఇచ్చింది. కోడి పందేలకు అనుమతించొద్దని హైకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలను అమలు చేస్తామని హోంశాఖ తరపు న్యాయవాది (జిపి) మహేశ్వరరెడ్డి హామీ ఇచ్చారు. ఈ హామీని జస్టిస్ బిఎస్ భానుమతి మంగళవారం రికార్డుల్లో నమోదు చేసి, అందుకు అనుగుణంగా ఉత్తర్వులు జారీ చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరం మండల పరిధిలో కొణితివాడ, ఉత్తరపాలెం తదితర గ్రామాల్లో కోడి పందేలను నిలువరించాలని కోరుతూ వై ఉమాశంకరరాజు రిట్ పిటిషన్ దాఖలు చేశారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండల పరిధిలోని వాడపల్లి, మద్దూరు, చంద్రవరం, తోగుమ్మి తదితర గ్రామాల పరిధిలో సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు నిర్వహిస్తుంటే అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొంటూ జి వెంకటరత్నం సహా ముగ్గురు రిట్ పిటిషన్లు వేశారు. కోడిపందేలను అడ్డుకోవాలని హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును అధికారులు అమలు చేయడం లేదని న్యాయవాది చెప్పారు. ఆ తీర్పునకు కట్టుబడి ఉన్నామని, తీర్పును అమలు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. కోడి పందేలపై చర్యలు తీసుకోవాలని, నిర్వహణకు అనుమతివ్వొద్దని హైకోర్టు మంగళవారం మరోసారి పోలీసులను ఆదేశించింది.

సిఇసికి టిడిపి - జనసేన, వైసిపిల

పరస్పర ఫిర్యాదులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర ఎన్నికల సంఘం ముందు టిడిపి-జనసేన, వైసిపిలు పరస్పర ఫిర్యాదులకు దిగాయి. ఓటర్ల జాబితాలో అవకతవకలకు మీరు కారణమంటే మీరు కారణమని ఆరోపించుకున్నాయి. సిఇసి రాజీవ్ కుమార్ నేతృత్వంలోని ఎన్నికల కమిషనర్ల బృందం విజయవాడలో మంగళవారం రాజకీయపార్టీలతో విడివిడిగా సమావేశమైంది. ఈ సమావేశానికి హాజరైన తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు, అలయన్స్ పార్టనర్‌గా జనసేన అధినేత పవన్ కల్యాణ్, వైసిపి నుండి హాజరైన రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి పరస్పరం ఫిర్యాదులు చేశారు.

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు : చంద్రబాబు

రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని టిడిపి అధినేత చంద్రబాబునాయుడు అన్నారు. ఎన్నికల కమిషన్‌తో సమావేశానంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఎప్పుడూ లేనన్ని అవకతవకలు చోటు చేసుకున్నాయని చెప్పారు. తన సుదీర్ఘ రాజకీయ చరిత్రలో ఇటువంటి పరిస్థితి ఎన్నడూ లేదన్నారు. దేశం మొత్తంమీద ఉత్తమంగా విధులు నిర్వహించిన వారిని ఎన్నికల అధికారులుగా నియమించాలన్నారు. దేశ వ్యాప్తంగా టీచర్లు, ప్రభుత్వ అధికారులు, అనుభవం ఉన్న వారిని ఎన్నికల విధుల్లో ఉపయోగించుకుంటున్నారని, రాష్ట్రంలో ఆ పరిస్థితి లేదన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అవసరమైతే కేంద్ర పోలీసులను పంపాలని, స్పెషల్ సెల్ కూడా ఏర్పాటు చేయాలని కోరారు.

రాజ్యాంగ విరుద్ధ వ్యవస్థలతో ఎన్నికలు : పవన్‌కల్యాణ్

రాజ్యాంగ విరుద్ధ వ్యవస్థలతో రాష్ట్రంలో ఎన్నికలు నిర్వహించడానికి ప్రయత్నిస్తున్నారని జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ అన్నారు. ఇప్పటికే సచివాలయ ఉద్యోగులతో ఓటర్లజాబితాలో అవకతవకలు చేశారన్నారు. సచివాలయాల్లో పనిచేసే మహిళా పోలీసులను బిఎల్‌ఓలుగా నియమించి వైసిపి ప్రభుత్వం ఇష్టానుసారంగా ఓట్లు తొలగిస్తున్న విషయాన్ని కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదుచేశామన్నారు.

వివి ప్యాడ్ స్లిప్‌లు ఇవ్వాలి : సిపిఎం

ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న ప్రతి ఒక్కరికి వివి ప్యాడ్ రశీదు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరినట్లు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు(వైవి) తెలిపారు. ఓటర్ల తొలగింపులు, చేర్పుల విషయంలో వాలంటీర్లు జోక్యం చేసుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని, గంపగుత్తగా ఓట్ల తొలగింపులు చేస్తున్నారని, అటువంటి వారిపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసినట్లు చెప్పారు. తెలంగాణలో ఓటింగ్ ప్రక్రియ పూర్తయిందని అక్కడ ఓటు వేసిన వారు ఇక్కడ ఓటు వేసే అవకాశం ఉందని అటువంటి ప్రక్రియ జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు 3నుంచి 20 కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తోందని, అందుకనే ఎక్కడికక్కడే పోలింగ్‌బూత్‌లు ఏర్పాటు చేయాలని సిఇసి దృష్టికి తీసుకెళ్లినట్లు వైవి పేర్కొన్నారు.

ఉద్దేశపూర్వకంగానే ఆరోపణలు : విజయసాయి రెడ్డి

ఉద్దేశపూర్వకంగానే వైసిపిపై ఆరోపణలు చేస్తున్నారని వైసిపి రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి అన్నారు. ఒకవైపు తమను టార్గెట్ చేస్తూ మరోవైపు పెద్దఎత్తున దొంగ ఓట్లను చేర్పిస్తున్నారని చెప్పారు. ఎన్నికల సంఘం వద్ద గుర్తింపు లేని పార్టీ జనసేనకు సిఇసి అపాయింట్‌మెంట్ ఎలా ఇస్తారని ఆయన ప్రశ్నించారు. ఈ విషయమై ఇసి వద్ద అభ్యంతరం తెలియచేసినట్లు చెప్పారు చంద్రబాబు, లోకేష్ సిఎంపై తీవ్ర అసభ్యపదజాలం వాడుతున్నారని సిఇసి దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. రెడ్‌బుక్ పేరుతో అధికారులను లోకేశ్ బెదిరిస్తున్నారని చెప్పారు.

ఎన్నికల కమిషన్ సమీక్ష సమావేశానికి టిడిపి నుండి పయ్యావుల కేశవ్, వైసిపి నుండి రాజమండ్రి ఎంపి మార్గాని భరత్, తుమ్మల లోకేశ్వరరెడ్డి, సిపిఎం నుంచి ఆ పార్టీ రాష్ట్ర కారదర్శివర్గ సభ్యులు కిలో సురేంద్ర, రాష్ట్ర మిగతా 2లో



విజయవాడ లెనిన్ సెంటర్‌లో యుటిఎఫ్ నాయకులను ఈడ్చుకెళ్తున్న పోలీసులు

బకాయిలడిగితే నిర్బంధం

యుటిఎఫ్ ఆధ్వర్యంలో భారీ నిరసన • రాష్ట్ర వ్యాప్తంగా 2,000 మంది ఉపాధ్యాయుల అరెస్ట్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బకాయిలడిగితే రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధానికి దిగింది. న్యాయంగా తమకు రావాల్సినవి ఇవ్వాలని కోరితే గొంతు నొక్కింది. విజయవాడలో నిరసన తెలపడానికి వస్తామంటే ఎక్కడికక్కడ అడ్డుకుంది. ఊరునుండి అడుగు ముందుకు వేయనీయకుండా పోలీసులను మోహరించింది. శాంతియుతంగా దీక్షలు చేస్తామన్నా ససేమిరా అంది. అయినా, బయలుదేరితే అరెస్టులతో అడ్డుకుంది. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన 18వేల కోట్ల రూపాయల బకాయిల కోసం యుటిఎఫ్ చేపట్టిన 36 గంటల దీక్షల సందర్భంగా మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా కనిపించిన దృశ్యాలివి! ఈ మొత్తాన్ని విడుదల చేయాలని పదేపదే విజ్ఞప్తులు చేసినా ఫలితం లేకపోవడంతో ఈ కార్యక్రమానికి యుటిఎఫ్ పిలుపునిచ్చింది. న్యాయమైన ఈ డిమాండ్‌ను పరిష్కరించాల్సిన ప్రభుత్వం దానికి భిన్నంగా ఎక్కడికక్కడ అడ్డుకుంది. విజయవాడకు రాకుండా ఉపాధ్యాయులను అడ్డుకోవడమే లక్ష్యంగా అధికారయంత్రాంగం వ్యవహరించింది. రాష్ట్ర వ్యాప్తంగా 1,500 మంది ఉపాధ్యాయులను అరెస్ట్ చేయడంతోపాటు గవర్నర్‌పేటలోని యుటిఎఫ్ కార్యాలయంపైనా పోలీసులు దాడి చేశారు. కార్యాలయంలోకి చొరబడి యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్‌లను అరెస్ట్ చేశారు. నిర్బంధాన్ని ఛేదించి విజయవాడకు చేరుకున్న ఉపాధ్యాయులను మిగతా 2లో

జైల్‌భరో విజయవంతం

కార్మికుల సమస్యలకు పరిష్కారం చూపాలి • రాష్ట్రవ్యాప్తంగా పలువురి అరెస్టు, విడుదల

ప్రజాశక్తి - యంత్రాంగం

రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమ్మెపై ఎస్మా విధించడాన్ని వ్యతిరేకిస్తూ, మున్సిపల్ కార్మికులు, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెలకు పరిష్కారం చూపాలని కోరుతూ కార్మిక, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జైల్ భరో నిర్వహించారు. 'చాలీచాలని జీతాలతో ఎన్నాళ్లని అప్పుచేసి, వడ్డీలు కట్టుకుంటూ బతుకు జీవనం సాగించాలి.. మా వల్ల కాదు.. మీరు ఇచ్చిన హామీ మేరకు జీతాలైనా పెంచండి.. లేదంటే జైల్లోనైనా పెట్టండి' అంటూ కార్మిక సంఘాలన్నీ ఏకతాటిపైకొచ్చి మంగళవారం ఈ కార్యక్రమం చేపట్టాయి. రాష్ట్రవ్యాప్తంగా వందలాది మంది నాయకులను, అంగన్‌వాడీ కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం విడుదల చేశారు.



అమలాపురం కలెక్టరేట్‌ను ముట్టడించిన అంగన్‌వాడీలు

విజయవాడ లెనిన్ సెంటర్‌కు చేరుకున్న కార్మిక, ప్రజా సంఘాల నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. నాయకులను బలవంతంగా అరెస్టు చేసి వ్యాన్లలో ఎక్కించారు. అంతకముందు సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఎస్మా ప్రయోగించడం సరైందికాదని, నాయకులతో చర్చించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యదర్శి కె ధనలక్ష్మి మాట్లాడుతూ.. అంగన్‌వాడీలపై ఎస్మాను ప్రయోగించడం సాధ్యం కాదని, అయినా ప్రభుత్వం తెలివి తక్కువ తనంతో విడుదల చేసిందని పేర్కొన్నారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు మాట్లాడుతూ.. ఎందుకు ఎస్మా ప్రయోగించారో కూడా మిగతా 2లో

ఎస్మా ప్రయోగంపై దేశవ్యాప్త నిరసనలు

- అఖిల భారత అంగన్‌వాడీ పిలుపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో


సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించడం పట్ల అఖిలభారత అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఫెడరేషన్ (ఎఐఎఫ్ఎడబ్ల్యుహెచ్) ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇటువంటి నిరంకుశ చర్యలు మానుకోవాలని ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేసింది. ఎస్మాను ప్రయోగించడాన్ని నిరసిస్తూ బుధవారం నుంచి శనివారం వరకు దేశవ్యాప్త ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఈ రాష్ట్రాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు చేస్తున్న సమ్మెలను ప్రజాస్వామిక పద్ధతుల్లో చర్చించి పరిష్కరించుకోవాలని కోరింది. ఎఐఎఫ్ఎడబ్ల్యుహెచ్ ప్రధాన కార్యదర్శి ఎఆర్ సింధు మంగళవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. 'వేతనాలు పెంచాలి, గ్రాట్యుటీ ఇవ్వాలన్న సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలి తదితర డిమాండ్ల సాధన కోసం అంగన్వాడీ యూనియన్ల ఉమ్మడి వేదిక ఆధ్వర్యాన 2023 డిసెంబర్ 12 నుండి ఎపిలో లక్ష మందికి పైగా అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు సమ్మె చేస్తున్నారని ఆమె తెలిపారు. 2019 ఎన్నికల్లో తెలంగాణ కంటే రూ.1,000 ఎక్కువ వేతనం ఇస్తామన్న హామీని జగన్ ప్రభుత్వం నిలబెట్టుకోలేకపోయిందని ఆమె విమర్శించారు. ఎపి ప్రభుత్వంతోపాటు, మోడీ ప్రభుత్వంపైనా అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఎస్మాను ఉపసంహరించుకోకపోతే పోరాటం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. 'మహారాష్ట్రలోని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు కూడా 2023 డిసెంబరు 4 నుంచి ఉమ్మడి వేదిక ఆధ్వర్యంలో నిరవధిక సమ్మెలో ఉన్నారని, అక్కడి బిజెపి సంకీర్ణ ప్రభుత్వం యూనియన్‌లతో చర్చించడానికి బదులు బెదిరింపులు, అణచివేతకు పాల్పడుతోందన్నారు. అంగన్వాడీలు ఇటువంటి అదిరింపులు, బెదిరింపులకు భయపడేవారు కాదని, వీటికి దీటుగా బదులిస్తారని ఆమె అన్నారు. . 2023లో బీహార్‌లో అంగన్‌వాడీల సమ్మెలోకి వెళ్లడంతో అక్కడి ప్రభుత్వం వారి వేతనాలను పెంచిందన్నారు. 'సుప్రీంకోర్టు తీర్పులో పేర్కొన్నట్టుగా గ్రాట్యుటీని చెల్లించాలని, అంగన్‌వాడీల పని పరిస్థితులను మెరుగుపరచేందుకు తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని ఎఐఎఫ్ఎడబ్ల్యుహెచ్ డిమాండ్ చేస్తుంది. దేశవ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు ఒకే విధమైన సర్వీస్ రూల్స్, పని పరిస్థితులు ఉండేలా కేంద్ర ప్రభుత్వం చూడాలని డిమాండ్ చేస్తున్నాం' అని పేర్కొన్నారు. కార్మికులుగా తమ హక్కుల కోసం, ఐసిడిఎస్‌ను బలోపేతం చేయడం కోసం దేశవ్యాప్తంగా అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు చేస్తున్న పోరాటానికి మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరుతున్నామన్నారు.

నాలుగేళ్ల కొడుకుని చంపి... బ్యాగ్‌లో తీసుకెళ్తూ

పట్టుబడిన మహిళా సిఇఓ

- వారం రోజుల పోలీస్ కస్టడీ

శివమొగ్గ : తన నాలుగేళ్ల కుమారుడ్ని చంపి, బ్యాగ్‌లో పెట్టుకుని క్యాబ్‌లో వెళ్తున్న ఓ మహిళా సిఇఓను కర్ణాటక పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. గోవాలో ఒక హోటల్‌లో కుమారుడ్ని చంపిన ఈ మహిళా సిఇఓ ఆ మృతదేహాన్ని పెద్ద బ్యాగ్‌లో కుక్కి అక్కడి నుంచి క్యాబ్‌లో కర్ణాటకలోని చిత్రదుర్గకు వెళ్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం బెంగళూరులోని ఎఐ స్టార్టప్ సిఇఓగా పని చేస్తున్న సుచన సేథ్ గోవాలో ఆదివారం ఒక లగ్జరీ హోటల్లో దిగారు. సోమవారం తెల్లవారు జామున హోటల్ నుంచి భారీ బ్యాగ్‌తో బయటకు వచ్చారు. తనకు బెంగళూరు వరకూ క్యాబ్ కావాలని హోటల్ సిబ్బందిని కోరారు. క్యాబ్ కంటే విమాన ప్రయాణం వేగంగానూ, చవగ్గానూ ఉంటుందని సిబ్బంది తెలిపినా అమె వినిపించుకోలేదు. క్యాబ్‌లోనే బెంగళూరుకు బయలుదేరారు. ఆమె బస చేసిన రూమ్‌ను శుభ్రం చేయడానికి వెళ్లిన సిబ్బందికి అక్కడ రక్తంతో తడిసిన టవల్ కనిపించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు సిసిటివి దృశ్యాలను పరిశీలించి హోటల్‌లో దిగినప్పుడు కుమారుడితో కనిపించిన సుచన వెళ్లేటప్పుడు మిగతా 2లో



ఫిలిప్పైన్స్‌లో తీవ్ర భూకంపం

మనీలా : దక్షిణ ఫిలిప్పైన్స్ తీర ప్రాంతంలో మంగళవారం భూకంపం సంభవించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 6.7గా నమోదైంది. అయితే ఇప్పటివరకు ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం సంభవించినట్లు సమాచారం అందలేదని అధికారులు తెలిపారు. మైండ్‌నావో ద్వీపంలో సారంగాని మున్సిపాలిటీకి ఆగ్నేయంగా వంద కిలోమీటర్ల దూరంలో భూమిలో 70 కిలోమీటర్ల లోతున భూకంపం కేంద్రం వుందని అమెరికా భూగర్భ సర్వే అధికారులు తెలిపారు. సునామీ ముప్పేమీ లేదని అమెరికా సునామీ హెచ్చరికల వ్యవస్థ తెలిపింది. పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్ మీదున్న ఫిలిప్పైన్స్‌లో భూకంపాలు చాలా సర్వసాధారణం. అయితే వీటిల్లో చాలా ప్రకంపనలు ప్రజలకు తెలియకుండా చాలా బలహీనంగా నమోదవుతాయి. గత నెల్లో కూడా ఇదే దీవిలో 7.6 తీవ్రతతో భూకంపం సంభవించగా, ముగ్గురు చనిపోయారు.

నైపుణ్య ఉద్యోగ నియామకాల్లో క్షీణత

- డిసెంబర్‌లో 16 శాతం పతనం
- ఐటి, ఇతర రంగాల్లో ప్రతికూలత



ముంబయి : దేశంలో నైపుణ్యవంతుల నిరుద్యోగం పెరుగుతోంది. ఓ వైపున ఉన్న ఉద్యోగాలు ఊడుతుండగా, మరోవైపు కొత్త నియామకాలు పడిపోతున్నాయి. ఐటి, బిపిఒ, విద్య, రిటైల్, వైద్య తదితర రంగాల్లో ఉద్యోగాల సృష్టిలో మందగమనం చోటుచేసుకుంటుంది. ఏడాదికేడాదితో పోల్చితే 2023 డిసెంబర్‌లో నైపుణ్యవంతుల ఉద్యోగ (వైట్ కాలర్) నియామకాల్లో ఏకంగా 16 శాతం క్షీణత చోటుచేసుకుందని నౌక్రీ.కమ్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ పవన్ గోయల్ వెల్లడించారు. నైపుణ్యం (స్కిల్డ్), అధిక వేతనాలు, కార్యాలయాల్లో పని చేసే వారిని వైట్ కాలర్ ఉద్యోగులుగా భావిస్తారు. నౌక్రి జాబ్ స్పీక్ ఇండెక్స్‌ను పవన్ గోయల్ విశ్లేషిస్తూ.. "గతేడాది నవంబర్‌తో పోల్చితే నియామక కార్యకలాపాలు డిసెంబర్‌లో 2 శాతం పెరిగినప్పటికీ.. ఇది కూడా ఐటియేతర రంగాల నుంచి నమోదైంది. 2022 డిసెంబర్‌తో పోల్చితే గడిచిన నెలలో నియామకాలు 16 శాతం క్షీణించాయి. ఐటి నియామకాల్లో పూర్తి రికవరీ కోసం దీర్ఘకాలం వేచిచూడాల్సిందే." అని అన్నారు.

"బిపిఒ, విద్య, రిటైల్, వైద్యం వంటి రంగాల్లో నియామకాలు తగ్గాయి. ఆయా రంగాల్లో రిక్రూట్‌మెంట్స్ వరుసగా 17 శాతం, 11 శాతం, 11 శాతం, 10 శాతం క్షీణతను చవిచూశాయి. ఐటి రంగం నియామకాల్లో ఏకంగా 21 శాతం పతనం చోటు చేసుకుంది. స్టాక్ డేటా సైంటిస్ట, ఐటి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంజనీర్, ఆటోమేషన్ ఇంజనీర్ తదితర విభాగాల్లో ఆశాజనక నియామకాలు జరిగాయి. చమురు, గ్యాస్ రంగంలో పెద్దగా కొత్త ఉద్యోగాల సృష్టి చోటు చేసుకోనప్పటికీ.. 2022 నాటి స్థాయిలో ప్రతిబింబించాయి. పర్యాటకం, హోటల్ రంగంలో మాత్రం 4 శాతం వృద్ధి చోటుచేసుకుంది.

ఫార్మా రంగం రిక్రూట్‌మెంట్‌లో 2 శాతం పెరుగుదల ఉంది. గడిచిన డిసెంబర్‌లో మెట్రో నగరాలతో పోల్చితే మెట్రోయేతర నగరాల్లో ఎక్కువ నియామకాలు జరిగాయి. చెన్నయ్, బెంగళూరు, హైదరాబాద్, పూణె, కోత్‌కతా నగరాల్లో వరుసగా 24 శాతం, 23 శాతం, 23 శాతం, 17 శాతం, 16 శాతం చొప్పున నియామాకాల్లో క్షీణత చోటుచేసుకుంది." అని నౌక్రీ జాబ్ స్పీక్ ఇండెక్స్ వెల్లడించింది.

ఎస్టీ జాబితా నుంచి

కుకీల తొలగింపు!

పరిశీలించాలని మణిపూర్ ప్రభుత్వాన్ని కోరిన కేంద్రం

న్యూఢిల్లీ : షెడ్యూల్డ్ తెగల జాబితా నుంచి కుకీలు, జోమీలను తొలగించే విషయాన్ని పరిశీలించాల్సిందిగా కేంద్ర ప్రభుత్వం మణిపూర్ సర్కారును కోరింది. ఎస్టీల జాబితా నుండి కుకీ, జోమీ తెగలను తొలగించాలంటూ రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అథావలే) జాతీయ కార్యదర్శి మహేశ్వర్ తౌనావోజమ్ గత నెల 11న కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి అర్జున్ ముండాకు లేఖ రాశారు. ఎస్టీల నిర్వచనానికి స్థానికతనే ప్రామాణికంగా తీసుకోవాలని అందులో సూచించారు. ఈ అభ్యర్థనను పరిశీలించాలంటూ కేంద్రం మణిపూర్ ప్రభుత్వానికి సూచించింది.

మణిపూర్ రాష్ట్ర ఎస్టీ జాబితాలో ఎవరెవరు ఉండాలో నిర్ధారించాలని మహేశ్వర్ ఆ లేఖలో కోరారు. అయితే మైతీలను ఎస్టీల జాబితాలో చేర్చాలని ఆయన పరోక్షంగా సూచించారు. ఈ అభ్యర్థనను కేంద్రం మణిపూర్ ప్రభుత్వానికి పంపుతూ దీనిపై ఏ నిర్ణయం తీసుకోవాలన్నా రాష్ట్ర ప్రభుత్వ సిఫార్సులు అవసరమని తెలియజేసింది. కాగా గత సంవత్సరం నవంబరులో కూడా ప్రపంచ మైతీల మండలి ఇదే రకమైన అభ్యర్థన చేసింది. రాష్ట్రంలోని



మణిపూర్‌లో కుకీ తెగకు చెందిన ప్రజలు (ఫైల్)

కుకీలు మయన్మార్ నుండి వలస వచ్చి మణిపూర్‌లో నివాసం ఏర్పాటు చేసుకున్నారని, వారు స్థానికులు కారని వివరించింది. రాష్ట్ర జనాభాలో 60%గా ఉన్న మైతీలు తమను ఎస్టీల జాబితాలో చేర్చాలంటూ అనేక సంవత్సరాలుగా డిమాండ్ చేస్తున్నారు. మైతీలను ఎస్టీల జాబితాలో చేర్చాలంటూ దాఖలైన పిటిషన్‌పై సత్వర నిర్ణయం తీసుకోవాలని మణిపూర్ హైకోర్టు గత ఏప్రిల్ 19న రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయితే దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమయ్యాయి. మే 3న రాష్ట్రంలో పెద్ద ఎత్తున హింసాకాండ చెలరేగిన విషయం తెలిసిందే. అప్పటి నుండి కుకీలు, మైతీల మధ్య జరుగుతున్న ఘర్షణల్లో 200 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. అరవై వేల మంది నిరాశ్రయులయ్యారు.

అగ్రవర్ణాలతో బిసిలు పోటీ : సజ్జల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అగ్రవర్ణాలతో పోటీ పడాలన్న లక్ష్యంతో బిసిల కోసం సిఎం జగన్ ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. దేశంలో బిసిలు ముఖ్యమంత్రిగా వున్న రాష్ట్రాల్లో కూడా అమలు చేయనన్ని కార్యక్రమాలు, పథకాలను రాష్ట్రంలో అమలు చేశారని అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో రజక కార్పొరేషన్ ఛైర్మన్ మీసాల రంగయ్య అధ్యక్షతన రజకుల రాష్ట్రస్థాయి ఆత్మీయ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ.. అమలవుతున్న పథకాలను బట్టి నాలుగున్నరేళ్ల కాలంలో 18 లక్షల రజక కుటుంబాలకు మేలు జరిగిందన్నారు. రజకులకు డిబిటి ద్వారా బ్యాంకు ఖాతాల్లో రూ.5,600 కోట్లు, నాన్ డిబిటి ద్వారా రూ.17 వేల కోట్లను రజక కుటుంబాలకు ఇచ్చామన్నారు. ఏ ప్రభుత్వం ఇవ్వనన్ని నామినేటెడ్ పదవులను బిసిలకు ఇచ్చామన్నారు. గతంలో రజకులకు చంద్రబాబు కేవలం ఐరన్ బాక్సులు ఇచ్చి మభ్యపెట్టారని విమర్శించారు.

బాలికపై అత్యాచారం

ప్రజాశక్తి - కవిటి (శ్రీకాకుళం జిల్లా)

శ్రీకాకుళం జిల్లా కవిటి మండలంలోని మత్స్యకార గ్రామానికి చెందిన తొమ్మిదేళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన ఐదుగురు బాలురు అత్యాచారం చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కవిటి ఎస్ఐ కె.రాము అందించిన సమాచారం మేరకు.. మండలంలోని ఓ మత్స్యకార గ్రామానికి చెందిన బాలికపై అదే గ్రామానికి చెందిన ఐదుగురు మైనర్ బాలురు వారం రోజుల కిందట అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ విషయాన్నిబాలిక తన తల్లికి చెప్పడంతో, ఆమె మంగళవారం సాయంత్రం కవిటి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

పట్టుబడిన మహిళా సిఇఓ

(మొదటి పేజీ తరువాయి)

ఒంటరిగా వెళ్లడాన్ని గుర్తించారు. దీంతో సుచన ప్రయాణిస్తున్న క్యాబ్ డ్రైవర్‌కు ఫోన్ చేసి ఆమెతో మాట్లాడారు. హెూటల్‌లో నెత్తుటితో తడిసిన టవల్ గురించి అడగ్గా, అది పిరీడ్స్‌కు సంబంధించిన రక్తం అని చెప్పారు. కుమారుడితో వచ్చి తిరిగి ఒంటరిగా బయటకు రావడం గురించి అడగ్గా, కుమారుడు సౌత్ గోవాలోని బంధువుల ఇంటి వద్ద ఉన్నాడని చెప్పారు. ఆ అడ్రస్ తెలపమని కోరగా ఒక అడ్రస్ ఆమె ఇచ్చింది. ఆ అడ్రస్ గురించి సౌత్ గోవా పోలీసులను ఆరా తీయమని ఎస్‌పి ఆదేశించగా, ఆ అడ్రస్ ఫేక్ అని తేలింది. అప్పుడు పోలీసులు టాక్సీ డ్రైవర్‌ను కాంటాక్టు చేసి, వాహనాన్ని సమీపంలో పోలీస్‌స్టేషన్‌కు తీసుకుని వెళ్లమని సూచించారు. దీంతో హిరియూర్ తాలూకాలోని ఐమంగళ పోలీస్ స్టేషన్‌కు ఆమెను తీసుకుని వెళ్లాడు. అక్కడ చిత్రదుర్గ పోలీసులు సేథ్‌ను అదుపులోకి తీసుకున్నారు.బ్యాగ్ తెరచి చూడగా బాబు మృతదేహం కనిపించింది. దీంతో అందరూ షాక్ అయ్యారు. తరువాత ఆమెను గోవా పోలీసులు అరెస్టు చేసి మపుసా కోర్టులో హాజరుపరచగా గోవా పోలీసులు ఆమెకు ఆరు రోజుల పాటు పోలీస్ కస్టడీ విధించారు. భర్తతో విడాకులు కోరిన ఆమె, కోర్టు తీర్పుపై నిరాశతో ఈ ఘోరానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

సమస్యలు పరిష్కరించకుంటే పోరాటం ఉధృతం



నెల్లూరు శిబిరంలో కూర్చొని నినాదాలు చేస్తున్న ఉద్యోగులు


అనకాపల్లిలో వాసుదేవరావు మృతదేహాన్ని సందర్శించిన ఎస్ఎస్ఎ ఉద్యోగులు

ప్రజాశక్తి- యంత్రాంగం

ఎన్ని బెదిరింపులు బెదిరించినప్పటికీ ఎన్ని ప్రలోభాలకు గురిచేసినప్పటికీ తమ న్యాయపరమైన సమస్యలు పరిష్కరించకుంటే నిరాహారదీక్షలకూ వెనకాడబోమని సర్వ శిక్ష కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ జెఎసి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మె మంగళవారం నాటికి 21వ రోజుకు చేరుకుంది.

విజయనగరం కలెక్టరేట్ నుంచి మూడు లాంతర్లు వద్దనున్న రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఇంటి వరకు ర్యాలీ నిర్వహించి అక్కడే ధర్నా చేపట్టారు. ధర్నాను ఉద్దేశించి జెఎసి రాష్ట్ర అధ్యక్షులు బి కాంతారావు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిన తీరు బాధాకరమన్నారు. ప్రభుత్వం తమతో వెట్టి చాకిరి చేయించుకుంటోంది తప్ప తమ కష్టాన్ని గుర్తించడం లేదన్నారు. తక్షణమే ప్రభుత్వం సమస్యలుపరిష్కరించాలని డిమాండ్ చేశారు. గుంటూరులో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజనికి వినతిపత్రం అందజేశారు. సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానని మంత్రి హామీ ఇచ్చారు. పల్నాడు జిల్లాలో సమ్మెలో పాల్గొన్న వారికి డిఇఒల ద్వారా నోటీసులు అందజేశారు. శ్రీకాకుళంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఒంగోలులో 415 మంది ఎస్ఎస్ఎ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. జిల్లా డిఇఒ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ వాటిని దగ్ధం చేశారు. షోకాజ్ నోటీసులను వెంటనే ఉపసంహరించు కోవాలని జిల్లా కార్యాలయం ఎదుట నినాదాలు చేశారు. ఇంతలో అక్కడకు వచ్చిన డిఈఒ వివిఎస్ సుబ్బారావును చుట్టుముట్టి తమ న్యాయమైన డిమాండ్లలో హెచ్ఆర్ పాలసీ వెంటనే అమలు చేసే విధంగా ప్రభుత్వానికి తెలియ జేయాలని కోరారు. అన్నమయ్య జిల్లా, కర్నూలు, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా, చిత్తూరు, తిరుపతి, నంద్యాల, మచిలీపట్నం, తూర్పుగోదావరి జిల్లా, కాకినాడ, డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, పాడేరు, పార్వతీపురం మన్యం జిల్లాలో సమ్మె శిబిరాలలో నిరసనలు కొనసాగాయి.

బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన ఉద్యోగి మృతి

అనకాపల్లి డిఇఒ కార్యాలయం వద్ద ఆందోళన చేసే క్రమంలో డిసెంబర్ 23వ తేదీన బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన సర్వ శిక్ష ఉద్యోగి జడ్డు వాసుదేవరావు(34) మంగళవారం మృతి చెందారు. ఆయన మృతదేహంతో డిఇఒ కార్యాలయం వద్ద ఎస్ఎస్ఎ ఉద్యోగులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. దీంతో డిఇఒ వెంకటలక్ష్మమ్మ నేతృత్వంలో చర్చలు జరిగాయి. మృతుని కుటుంబానికి ప్రభుత్వం నుంచి రూ.పది లక్షలు ఎక్స్‌గ్రేషియా, రూ.రెండు లక్షలు తక్షణ ఆర్థిక సహాయం అందించేందుకు అంగీకరించారు.

బెదిరిస్తే బెదిరిపోం

- అంగన్‌వాడీల దీక్షలో వక్తలు
- సమస్య పరిష్కరించే వరకూ సమ్మె విరమించబోమని హెచ్చరిక

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎస్మా ప్రయోగించడం ద్వారా కార్మిక వర్గాన్ని, సమ్మెలో ఉన్నవారిని బెదిరించాలని చూస్తే బెదిరిపోబోమని, ఇలాంటి ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలు కార్మికుల్లో పట్టుదలను మరింత పెంచుతాయని వక్తలు పేర్కొన్నారు. విజయవాడ ధర్నా చౌక్‌లో జరుగుతున్న అంగన్‌వాడీ సంఘాల దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావు మాట్లాడుతూ.. కార్మిక సంఘాలు సమ్మెలకు దిగడం వారి హక్కని, వారి సమస్యలను చర్చల రూపంలో పరిష్కరించాలని కోరారు. ఎస్మా ప్రయోగిస్తాం, బెదిరిస్తాం అంటే కుదరదని అన్నారు. ఎస్మాలు ప్రయోగించడం వల్ల సమస్య పరిష్కారం కాకపోగా మరింత జఠిలం అవుతుందని పేర్కొన్నారు. గత నాలుగు దశాబ్దాల్లో ఏ ప్రభుత్వమూ ఇలాంటి మూర్ఖపు నిర్ణయాలు తీసుకోలేదని అన్నారు. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సుబ్బరావమ్మ మాట్లాడుతూ.. తామేమీ గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని, ఇచ్చిన హామీని అమలు చేయాలని మాత్రమే అడుగుతున్నామని చెప్పారు. దీన్ని కూడా సహించలేకపోతే ఎలాగని ప్రశ్నించారు. వేతనాలు పెంచబోమని సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చెబుతున్నారని, అదే జరిగితే సిఎం ఇంటి బాటపట్ట డం ఖాయమని అన్నారు. సమ్మెను రాజకీయం చేస్తున్నామని అంటు న్నారని, అంగన్‌వాడీల్లో అన్ని పార్టీలకు చెందిన మహిళలున్నారని తెలిపారు. తమ ఆందోళన న్యాయబద్ధమైందని, అందుకనే పట్టుదలతో చేస్తున్నారని అన్నారు. ఎవరి భోజనం వారు తెచ్చుకుంటున్నారని, దీనిలో రాజకీయం ఏముందో సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పాలని ప్రశ్నించారు. యూనియన్ అధ్యక్షులు బేబీరాణి మాట్లాడుతూ.. 11 సమస్యల్లో పది సమస్యలు పరిష్కరించామని చెబుతూ నాలుగు జిఓలే ఇచ్చారని, మిగిలిన ఆరు జిఓలు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కీలకమైన వేతనాల పెంపు అంశాన్ని కనీసం పరిగణనలోకి తీసుకోవడం లేదని విమర్శించారు. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలితమ్మ మాట్లాడుతూ.. సమ్మె డిమాండ్లను పరిష్కరించని అధికారులు అర్ధరాత్రులు ఫోన్లు చేసి ఒత్తిడి చేస్తున్నారని, ఇదేమి ప్రజాస్వామ్యమో అర్థం కావడం లేదని అన్నారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎన్‌సిహెచ్ సుప్రజ, సిఐటియు నాయకులు ఎంవి సుధాకర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అధికారుల తీరు వల్లే అలా మాట్లాడా.. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తన నియోజకవర్గంలో అధికారుల తీరు వల్ల విసిగిపోయి మాట్లాడితే జగన్‌మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా మాట్లాడినట్లు జరుగుతున్న ప్రచారం సరైందికాదని శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ శ్రీదేవి అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడారు. సిఎం జగన్ తనను సోదరిగా చూసుకున్నారని అన్నారు. ముఖ్య మంత్రిగా రాష్ట్రాభివృద్ధి కోసం జగన్ తపన పడుతున్నారని తెలిపారు. తన నియోజకవర్గంలో నీటి సమస్య కేవలం అధికారుల వల్లే వచ్చిందని, అందుకే అధికారులనుద్దేశించి మాట్లాడానని అన్నారు. టిడిపి తన మాటలను వక్రీకరిస్తోం దన్నారు. తన రాజకీయ భవిష్యత్తు అంతా సిఎం జగన్ చేతుల్లోనే వుందన్నారు. ఆయన పోటీ చేయాలని ఆదేశిస్తే చేస్తానని, అలా కాకుండా మరొకరికి అవకాశం ఇచ్చి పనిచేయమన్నా సంతోషంగా చేస్తానని అన్నారు.

'గుంటూరు కారం' ప్రీ రిలీజ్ ఈవెంట్ తొక్కిసలాట

- పలువురికి గాయాలు

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

సినీ నటుడు, సూపర్ స్టార్ మహేష్‌బాబు, శ్రీలీల నటించిన 'గుంటూరు కారం' చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్ మంగళవారం గుంటూరు జిల్లా నంబూరులో నిర్వహించారు. ఇందు కోసం హైదరాబాద్‌కు చెందిన శ్రేయాస్ మీడియా సంస్థ భారీగా ఏర్పాట్లు చేసింది. మహేష్‌బాబు, శ్రీలీల, దర్శకులు త్రివిక్రమ్ తదితరులు వేదికపై రాగానే ఒక్కసారిగా యువకులు ముందుకు తోసుకువచ్చారు. నిర్వాహకులు అనుకున్న దానికంటే మహేష్ అభిమానులు భారీగా తరలిరావడం.. తోపులాట జరగడంతో బారికెట్లు విరిగిపోయాయి. పలువురికి గాయాలయ్యాయి. గుంటూరుకు చెందిన ఎఎస్ఐ వెంకట్రావు తీవ్రంగా గాయపడి ఊపిరి ఆడక ఇబ్బంది పడుతుండడంతో ఆయనను గుంటూరులోని ఒక ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. ప్రాంగణంలోని ఓ షెడ్డుకూలి 20 మంది గాయపడ్డారు. అభిమానుల తాకిడిని నియంత్రించేందుకు పోలీసులు ఒక దశలో లాఠీఛార్జ్ చేశారు. నిర్వాహకులు అధికంగా పాస్‌లు జారీ చేయడం వల్ల తొక్కిసలాట జరిగిందని పోలీసు అధికారులు తెలిపారు. ఐదు వేల మంది కూర్చొనే ప్రదేశంలో 15 వేల మందికి పాస్‌లు ఇచ్చినట్లు చెప్పారు.

ప్రేక్షకులు ఆదరిస్తారని ఆశిస్తున్నా : మహేష్ బాబు

'గుంటూరు కారం' సినిమాను ప్రజలు బాగా ఆదరిస్తారని ఆశిస్తున్నట్లు సినీ నటుడు మహేష్‌బాబు అన్నారు. ఈ సినిమా ప్రివ్యూ చూసి బాగుందో... బాగాలేదో నిజాయితీగా తన తండ్రి సూపర్‌స్టార్ కృష్ణ ఉంటే ముందే చెప్పేవారని తెలిపారు. ఆ విషయాలు ఇప్పుడు మీరే చెప్పాలి అంటూ భావోద్వేగానికి గురయ్యారు. అన్ని తరగుతుల ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా సినిమా ఉంటుందని తెలిపారు.

సిఇసికి టిడిపి - జనసేన, వైసిపిల పరస్పర ఫిర్యాదులు

(మొదటి పేజీ తరువాయి)

కమిటి సభ్యులు జె.జయరామ్, హాజరయ్యారు. బిజెపి నుంచి పాకల వెంకట సత్యనారాయణ, జూపూడి రంగరాజు, మట్టా ప్రసాద్, కాంగ్రెస్ నుంచి వాలిబోయిన గురునాథం, వేముల శ్రీనివాస్, బిఎస్‌పి నుంచి బి.పుష్పరాజ్, కాకి విసిఎస్ ప్రసాద్, ఎం, వినోద్‌కుమార్, ఆమ్‌ఆద్మీపార్టీ నుంచి గుల్లాపల్లి ఫణిరాజ్, కంభంపాటి కృష్ణ, కందుల పరమేశ్వరరావు హాజరయ్యారు.

రాష్ట్ర ఎన్నికల అధికారుల తీరుపై కేంద్ర ఎన్నికల సంఘం ఆగ్రహం

రాష్ట్ర ఎన్నికల అధికారుల తీరుపై కేంద్ర ఎన్నికల సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. రాష్ట్రంలో ఏం జరుగుతుందో అన్ని వివరాలనూ తెలుసుకున్న తర్వాతే వచ్చామంటూ, విజయవాడ, తిరుపతి, అనంతపురం అధికారులపై సీరియస్ అయినట్లు తెలిసింది. ఎన్నికలకు సంబంధించిన వ్యవహారంపై సరైన చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేసింది. చంద్రగిరి నియోజకవర్గంపై అధికారులను నిలదీసింది. ఇక్కడి అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తట్టుకోలేమంటే వెంటనే తప్పుకోవాలని సూచించింది. ఇక్కడి అధికారులకు రాజకీయ పార్టీలతో అనుబంధం ఉంటే తప్పుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల తర్వాత మంచి పోస్టింగుల్లోకి రావచ్చని తెలిపింది. రాష్ట్రంలో ఏ అధికారి ఎలా ఉన్నారో తమ దగ్గర రిపోర్టు ఉందని, తమకు తెలియదనుకోవద్దని కమిషన్ హెచ్చరించింది. మద్యం, డబ్బు పంపిణీ నిరోధంపై పలు జిల్లాల్లో తీసుకున్న చర్యలపై కమిషన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్ నుంచి ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని పేర్కొంది. ఎన్నికల షెడ్యూల్ వచ్చేలోగా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. చర్చల సందర్భంగా చాలా అంశాల్లో జోక్యం చేసుకుని అధికారులను చీఫ్ కమిషనరు రాజీవ్ కుమార్ ప్రశ్నించారు. బోగస్ పేర్లు తొలగించాలని ఆయా పక్షాలు ఫిర్యాదులు ఇచ్చినా పరిశీలించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రాఫ్ట్ జాబితాలో అవే పేర్లు ఉండటం ఏమిటని ప్రశ్నించారు. ఈ సందర్భంగా జిల్లాల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు తీసుకుంటున్న చర్యల గురించి అధికారులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఎన్నికల కమిషన్ బృందానికి వివరించారు. రాష్ట్ర సరిహద్దుల్లో తీసుకొన్న చర్యలను, సమస్యాత్మక ప్రాంతాల్లో తీసుకుంటున్న జాగ్రత్తలను జిల్లా ఎస్‌పిలు వివరించారు. ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని కలెక్టర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితాపై వస్తున్న ఫిర్యాదులు, దొంగ ఓట్లు తదితర అంశాలపై అధికారులను సిఇసి అధికారులు ప్రశ్నించారు.

జైల్‌భరో విజయవంతం


విజయవాడలో ప్రదర్శనగా వెళ్తున్న కార్మిక, ప్రజాసంఘాల నాయకులు (ఇన్‌సెట్‌లో రమాదేవిని అరెస్ట్ చేస్తున్న పోలీసులు)

(మొదటి పేజీ తరువాయి)

అధికారులకు తెలియదని, కేవలం బెదిరించడం కోసమే ఇలాంటి చర్యలకు దిగుతోందని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కార్మికవర్గంపై దాడిగా ఎస్మాను అభివర్ణించారు. ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు ప్రసాద్ మాట్లాడుతూ.. సమ్మెలో ఉన్నవారితో చర్చించి సమస్యను పరిష్కరించుకో వాల్సింది పోయి 'ఎస్మా ప్రయోగిస్తాం, అరెస్టులు చేస్తాం' అంటే అది ప్రజాస్వామ్యం కాదని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, వృత్తిదారుల నాయకులు ఎం భాస్కరయ్య, సిఐటియు నాయకులు అజయ్‌కుమార్, కమల, ఐద్వా నాయకులు గాదె ఆదిలక్ష్మి, ఐఎఫ్‌టియు నాయకులు రవిచంద్ర పాల్గొన్నారు.

ఏలూరులో సమ్మె శిబిరం వద్ద ఉభయగోదావరి జిల్లా ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మద్దతునిచ్చి మాట్లాడారు. సమస్యల పరిష్కారమయ్యే వరకూ పోరాడాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీలుగా తామంతా సంపూర్ణ మద్దతిస్తున్నామని, చివర వరకూ తోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు. సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం పాల్గొని సంఘీభావం ప్రకటించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఆర్‌డిఒ శ్రీనివాసరాజు లును కార్యాలయంలోనికి వెళ్లకుండా అడ్డుకున్నారు. పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో ఆర్‌డిఒ వెనుదిరిగారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి పలువురి నాయకులను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించడంతో కార్మికులంతా స్టేషన్ వద్ద ధర్నాకు దిగారు. దీంతో పోలీసులు అరెస్ట్ చేసిన నేతలను విడుదల చేశారు.

విశాఖపట్నం ఎల్ఐసి కార్యాలయ సమీపంలోని బిఆర్ అంబేద్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్‌కు ర్యాలీగా బయలుదేరారు. బాటా జంక్షన్ వద్ద వందలాది మంది పోలీసులు మోహరించి సుమారు 300 మంది కార్మిక సంఘాల నాయకులను అరెస్టు చేశారు. అల్లూరి సీతారామ రాజు జిల్లా రాజవొమ్మంగిలో అంగన్‌వాడీలందరూ స్వచ్ఛందంగా అరెస్టయి పోలీసు స్టేషన్ వద్ద నిరసన తెలిపారు.

తిరుపతి జిల్లావ్యాప్తంగా 2,800 మందిని అరెస్టు చేసి, అనంతరం సొంతపూచీకత్తుపై విడుదల చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో పోలీసుస్టేషన్ లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. గుంటూరు, ఒంగో లులో అంగన్‌వాడీలను, నాయకులను పోలీసులు బలవం తంగా అరెస్టు చేశారు. నెల్లూరులో గాంధీబొమ్మ సెంటర్ నుంచి విఆర్‌సి సెంటర్ వరకు భారీ ప్రదర్శన చేపట్టారు.

కాకినాడలో జైల్‌భరో, తూర్పుగోదావరి రాజమహేంద్రవరంలో రాస్తారోకో, కోనసీమ జిల్లా అమలాపురంలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాలను నిర్వహించారు. కాకినాడలో 16 మంది సిపిఎం, సిఐటియు, ఇతర ప్రజాసంఘాల నాయకులు అరెస్టు చేసి రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలిం చారు. రాజమహేంద్రవరంలో రాస్తారోకో కు హాజరైన సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్‌ను అరెస్టు చేసేందుకు పోలీసు లు విఫలయత్నం చేశారు. అమలాపురం లో కలెక్టరేట్ ముట్టడిలో వందలాది మంది అంగన్‌వాడీలు పాల్గొన్నారు. శ్రీకాకుళం, అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో కార్మిక సంఘం నాయకులను అరెస్టు చేశారు. కర్నూలులో ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్‌రెడ్డి, తదితరులను అరెస్టు చేశారు. అనంతరం విడుదల చేశారు. వైఎస్ఆర్, అన్న మయ్య జిల్లాల్లోని ఐసిడిఎస్, తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల ఎదుట బైటాయించి నిరసన కొనసాగించారు.

అంగన్‌వాడీ కార్యకర్తకు అస్వస్థత

ఏలూరు స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్‌లో బైఠాయించి నిరసన తెలియజేస్తున్న సమయంలో ఏలూరు సత్యన్నారాయణ కాలనీకి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త బేబీ చిన్నారి అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మీ మద్దతు మాకొద్దు

ప్రకాశం జిల్లా గిద్దలూరులో సమ్మె శిబిరానికి బిజెపి నాయకులు రాగా ఒక్కసారిగా అంగన్‌వాడీలు 'బిజెపి నాయకులారా.. మీ మద్దతు మాకు వద్దు' అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. 'మాకు ఏమీ చెప్పవద్దు.. మేము వినం' అంటూ వెనక్కు తిరిగి చెవులు మూసుకున్నారు. దీంతో బిజెపి నాయకులుసమ్మె శిబిరం నుంచి వెనుదిరిగి వెళ్లిపోయారు.

విధులకు హాజరుకాకుంటే షోకాజ్ నోటీసులు

విధులకు హాజరుకాకుంటే షోకాజ్ నోటీసులు ఇస్తామని కంభం ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సమ్మెలో ఉన్న అంగన్‌వాడీలకు మంగళవారం ఫోన్ చేశారు. తమకు జీతాలు పెంచే వరకు విధులకు హాజరుకాబోమంటూ అంగన్‌వాడీలు తేల్చి చెప్పారు.

గిరిజన ప్రాంతాల్లో

కొత్త పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయాలి

- ఎన్నికల కమిషన్‌కు సిపిఎం రాష్ట్ర కమిటీ వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో ఇప్పటికీ చాలాచోట్ల పోలింగు బూత్‌లు లేవని, దీనివల్ల ఆ ప్రాంతాల్లో ఎక్కువ మంది ఓటు వేయలేకపోతున్నారని, వెంటనే స్పందించి అక్కడ బూత్‌లు ఏర్పాటు చేయాలని ఎన్నికల కమిషన్‌ను సిపిఎం రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు మంగళవారం విజయవాడలో కేంద్ర ఎన్నికల అధికారులకు సిపిఎం రాష్ట్ర కమిటీ తరపున రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు, కిల్లో సురేంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యులు జె జయరాం వినతిపత్రం అందజేశారు.

'పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలం ఎగులవాడ పంచాయతీలో రజ్జలి పోలింగ్ స్టేషన్ ఉంది. దీని పరిధిలో ఓటు వేయడానికి ఇప్పలగుడి, కొర్రండా గూడ, సెంట్రల్‌గూడ, బొత్తిలి గ్రామాల ప్రజలు 30 కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తోంది. ఇక్కడ 200 మంది ఓటర్లు ఉన్నారు. మధ్యలో కొండ ఉండటం వల్ల ఇంతదూరం వెళ్లి ఓటు వేయాల్సిన పరిస్థితి. అందుకని ప్రతి ఎన్నికల్లోనూ 10 శాతం మాత్రమే ఓట్లు వేస్తున్నారు. మిగిలిన 90 శాతం మంది ఓట్లు వేయలేకపోతున్నారు. పై నాలుగు గ్రామాలకు బొత్తిలిలో కొత్త పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేస్తే ఓటింగ్ శాతం పెరిగే అవకాశం ఉంది. (దీనిపై సిపిఎం జిల్లా కమిటీ కలెక్టర్‌కి 23.09.2023న వినతి ఇచ్చి ఉన్నారు. స్థానిక ఎంఆర్ఓ ఈ ప్రతిపాదన తిరస్కరించారు. వినతి కాపీ జతపరుస్తున్నాము) ఎన్నికల సంఘం స్పందించి బొత్తిలిలో పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాలి' అని పేర్కొన్నారు.

'అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు నియోజకవర్గం డుంబ్రిగుడ మండలంలో పెద్ద అంజోడ, చిన్న అంజోడ, సంతినగర్, శిమిలిగూడ, తోకవలస గ్రామాల్లో ప్రజలు సుమారు ఐదు కిలోమీటర్లు ప్రయాణం చేసి కోర్రై గ్రామంలో ఓటు వేస్తున్నారు. ఇక్కడ పోలింగ్‌శాతం తక్కువ. కాబట్టి పెద్ద అంజోడ గ్రామంలో కొత్తగా పోలింగ్ బూత్ ఏర్పాటు చేస్తే పోలింగ్ శాతం పెరుగుతుంది' అని అన్నారు.

'డుంబ్రిగుడ మండలం గసబా పంచాయతీలో కంగారుసోల, జోడిగూడ, కూడ, గారెడెలి గ్రామాల్లో 300 మందికిపైగా ఓటర్లు ఉన్నారు. వీరు 10 కిలోమీటర్ల దూరంలోని నోగెలి వచ్చి అక్కడ ఓటు వేయాల్సి వస్తోంది. వారికి కంగారుసోల గ్రామంలో కొత్తగా పోలింగ్ బూత్ పెడితే పోలింగ్ శాతం పెరిగే అవకాశం ఉంది. ముంచంగిపుట్టు మండలంలో రంగబయలు గ్రామ పంచాయతీలో గోబోర్‌పడ, జొడిగొమ్మ, కోసంపట్టు, బుద్దపనస, నువగోడ, జరెల్‌పోదర్ గ్రామాల్లో 500 మందికిపైగా ఓటర్లు ఉన్నారు. వీరు 10 కిలోమీటర్లు ప్రయాణించి లంగవపోదర్ పోలింగ్ బూత్‌లో ఓటు వేయాల్సి వస్తోంది. రంగబయలులో రెండు పోలింగ్ బూత్‌లు కొత్తగా ఏర్పాటు చేయడం ద్వారా పోలింగ్ శాతం పెరుగుతుంది. లేని పక్షంలో ఈ గ్రామాల ప్రజలకు వాహన, భోజన సౌకర్యం ఏర్పాటు చేసినా పోలింగ్ శాతం పెరుగుతుంది. ఎలక్షన్ కమిషన్ పరిశీలన చేసి సమస్యను పరిష్కరించాల్సి ఉంది. అరకు వేలి మండలం సుంకరమెట్ట పంచాయతీ కె బెడ్డగూడ, లింబగూడ, దోబురంగిని గ్రామాల్లో సుమారు 300 మందికి పైగా ఓటర్లు ఉన్నారు. వారందరూ ఏడు కిలోమీటర్ల దూరమైన సుంకరమెట్ట బూత్‌లోకి వెళ్లి ఓటు వేయాల్సి వస్తోంది. వారందరికీ దగ్గరైన బెడ్డగూడలో బూత్ ఏర్పాటు చేస్తే ఓట్ల శాతం పెరిగే అవకాశం ఉంది. అలాగే బొండంబూత్‌లో 50 మంది ఓటర్లు మూడు కిలోమీటర్ల దూరమైన ఆర్‌కె నగర్ బూత్‌లోకి వెళ్లి ఓట్లు వేస్తున్నారు. వారికి దగ్గరైన బొండం బూత్‌లో ఓట్లు వేసేలా చర్యలు తీసుకోవాలి' అని వినతిపత్రంలో పేర్కొన్నారు.

అట్టహాసంగా 'అనంత' తెలుగు భాషా వైభవ సదస్సు


జయహో శ్రీకృష్ణదేవరాయ పాత్రధారునికి జ్ఞాపికను అందిస్తున్న అతిథులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

'అనంత' తెలుగు భాషా వైభవ సదస్సు మంగళవారం అనంతపురంలోని జెఎన్‌టియు ఆడిటోరియంలో వైభవంగా జరిగింది. ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, తెలుగు భాషాభివద్ధి ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ అధ్యక్షులు పి.విజయబాబు, ఎపి సిఆర్ మీడియా అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సదస్సులో భాగంగా నిర్వహించిన "జయహో కృష్ణదేవరాయ" నృత్యరూపకం ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా తెలుగు భాషా సేవ జీవిత సాఫల్య పురస్కారాలను పది మందికి, 38 మందికి తెలుగు భాషా సేవా ప్రతిభ పురస్కారాన్ని అందజేశారు. ఉదయం నుంచి సాయంత్రం దాకా నిర్వహించిన ప్రత్యేక ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

బకాయిలడిగితే నిర్బంధం



విజయవాడ యుటిఎఫ్ కార్యాలయం వద్ద నాయకుల నిరసన

(మొదటి పేజీ తరువాయి)

బస్టాండ్, రైల్వే స్టేషన్‌లలో అడ్డుకొని అదుపులోకి తీసుకున్నారు. అయినా, లెనిన్ సెంటర్ నుండి ఉపాధ్యాయులు ర్యాలీ ప్రారంభించారు. అక్కడి నుండి జింఖానా మైదానం వైపు వెడుతున్న ప్రదర్శనను మధ్యలో అడ్డుకుని వందలాదిమందిని అరెస్ట్ చేశారు. రాష్ట్ర నాయకులు పి లక్ష్మీరాజాను కడపలోనే అరెస్ట్ చేయగా, రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె శ్రీనివాసరావు, సహ అధ్యక్షులు కె సురేష్‌కుమార్, ఎఎన్ కుసుమకుమారి, కోశాధికారి పి గోపి మూర్తి, రాష్ట్ర కార్యదర్శులు ఎస్‌పి మనోహర్ కుమార్, ఎస్ మురళీమోహన్, వి కోటేశ్వరప్ప, ఎస్ఎస్ నాయుడు, బి సుభాషిణి, కెఎ ఉమామహేశ్వరరావు, నవకోటేశ్వరరావు తదితరులను లెనిన్ సెంటర్‌లో అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన ఉపాధ్యాయులను పోలీసులు పలు ఫంక్షన్‌హాల్స్‌లో ఉంచారు. శాంతియుత పద్ధతిలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులపై పోలీసులు నిర్బంధాన్ని ప్రయోగించడాన్ని పలువురు ఖండించారు.

అనంతరం యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్-ఎస్ ప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులను శత్రువులుగా పరిగణిస్తోందన్నారు. తమకు న్యాయంగా రావాల్సిన బకాయిలను అడిగితే అక్రమంగా నిర్బంధాన్ని ప్రయోగించి అరెస్ట్‌లు చేయడమేమిటని ప్రశ్నించారు. 2023 సెప్టెంబర్ నాటికి బకాయిలను చెల్లిస్తామని జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పటిదాకా ఒక్క రూపాయి కూడా చెల్లించకపోవడం బాధ్యతారాహిత్యమని అన్నారు. తక్షణం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం ఇలాగే అప్రజాస్వామిక చర్యలకు దిగితే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. తక్షణం ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి రూ.18వేల కోట్ల బకాయిలను చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

యుటిఎఫ్‌పై నిర్బంధం తగదు : ఎపిటిఎఫ్

శాంతియుతంగా యుటిఎఫ్ ఆధ్వర్యాన నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులపై ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగించడం తగదని ఎపిటిఎఫ్ రాష్ట్ర నాయకులు జి హృదయరావు, ఎస్ చిరంజీవి అక్రమ అరెస్ట్‌లను తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని రెండేళ్లుగా ఉద్యోగుల ఆర్థిక సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నా స్పందించడం లేదని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలపై త్వరలో అన్ని సంఘాలతో ఉమ్మడి కార్యాచరణ ద్వారా ప్రభుత్వంపై పోరాటాలు ఉధృతం చేస్తామని ఒక ప్రకటనలో తెలిపారు.

అరెస్ట్‌లకు ఆప్టా ఖండన

ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆర్థికపరమైన సమస్యలను పరిష్కరించాలని, శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులను ప్రభుత్వం అరెస్ట్ చేయడం తగదని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోషియేషన్ (ఆప్టా) అక్రమ అరెస్ట్‌లను ఖండించింది. ఆప్టా రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎజిఎస్ గణపతిరావు, కె ప్రకాష్‌రావు ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు.

రాజకీయ అవినీతే అభివృద్ధికి ఆటంకం

- ఉద్యోగుల జీతభత్యాలు పెంచితేనే కొనుగోలు శక్తి పెంపు
- కార్పొరేట్ల కోసమే భూ టైటిల్ యాక్ట్
- ఏలూరు జిల్లా సమగ్రాభివృద్ధి సదస్సులో వి.శ్రీనివాసరావు


సదస్సులో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు, పక్కన నేతలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రాజకీయ అవినీతి, కార్పొరేట్ దోపిడీ అభివృద్ధికి అడ్డుగోడలుగా మారాయని, సామాన్య ప్రజానీకం ఆదాయాలు పెరిగి, భూ పంపిణీ జరిగినప్పుడే నిజమైన అభివృద్ధి జరిగినట్లని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఏలూరులో నిర్వహిస్తున్న సిపిఎం రాష్ట్రకమిటీ సమావేశాల సందర్భంగా మంగళవారం స్థానిక కాశీవిశ్వేశ్వర కల్యాణ మండపంలో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా సమగ్రాభివృద్ధిపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథులుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, జిల్లా నాయకులు పాల్గొన్నారు. ముందుగా ఏలూరు జిల్లా ప్రభుత్వాసుపత్రి మెయిన్ గేటు నుంచి ఆర్ఆర్‌పేట మీదుగా కాశీవిశ్వేశ్వర కల్యాణ మండపం వరకూ రెడ్‌షర్ట్ వలంటీర్ల కవాతు, ప్రదర్శన సాగింది. అనంతరం జరిగిన సదస్సులో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రూ.కోటి ఖర్చయ్యే రోడ్డుకు రూ.ఐదు కోట్లు కేటాయించి మంత్రులు, ఎమ్మెల్యేలు అంతా వాటాలు పంచుకుంటున్నారని ఆరోపించారు. ప్రతి దాంట్లోనూ తీవ్రమైన రాజకీయ అవినీతి జరుగుతుందని విమర్శించారు. రాష్ట్రంలోకార్పొరేట్లు రూ.లక్షల కోట్లు రుణాలుగా తీసుకుని ఎగ్గొడుతున్నారని, ఇలాంటివి అరికడితే నిజమైన ప్రజాభివృద్ధి జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానం మేరకు జీతాల పెంపు కోసం అంగన్‌వాడీలు, మున్సిపల్ కార్మికులు, సమగ్రశిక్ష ఉద్యోగులు పోరాడుతున్నారని తెలిపారు. ఉద్యోగుల జీతాలు పెంచడం ద్వారా కొనుగోలు శక్తి పెరిగి అభివృద్ధి జరుగుతుందని, ప్రభుత్వం మాత్రం ఉద్యోగులకు జీతాలు పెంచడానికి నిరాకరిస్తుందన్నారు. 60 శాతం మహిళలు రక్త హీనతతో బాధపడుతున్నారని, దీన్ని అభివృద్ధి అందామా? అంటూ ప్రశ్నించారు. జిల్లాలో అనేక రకాల భూములు లక్షల ఎకరాలు ఉన్నాయని, కుటుంబానికి 2.50 ఎకరాలు పంపిణీ చేస్తే అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. మనది ప్రజాప్రణాళిక, ప్రజల అభివృద్ధి అని, పాలకులది మాత్రం ఓట్ల ప్రణాళిక, కార్పొరేట్ల అభివృద్ధి అని అన్నారు. సాగునీటి వనరులను అభివృద్ధి చేయడం, వ్యవసాయ పంటలకు ధరలు కల్పిస్తే అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. ఫోన్‌పే మాదిరిగా డబ్బులు ట్రాన్స్‌ఫర్ అయినట్లు భూమిని ఆగమేఘాల మీద కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను ప్రభుత్వం తీసుకువచ్చిందని విమర్శించారు. ఉద్యోగాలు ఇవ్వకుండా, ధరలు అదుపు చేయకుండా మోడీ ప్రభుత్వం పిడికెడు అక్షింతలు ఇస్తుందన్నారు.

మతవిశ్వాసాలను పెంచుతూ అయోధ్యకు రావాలంటూ పిలుపు ఇస్తోందని విమర్శించారు. కమ్యూనిస్టులు తోకపార్టీలు అనేవారని, ఇప్పుడు బిజెపికి టిడిపి, వైసిపి, జనసేన తోక పార్టీలుగా మారాయన్నారు. కమ్యూనిస్టుల పేరు చెబితే ప్రభుత్వం భయపడుతుందని, మనం ప్రతిపక్షం కాదని, ప్రజాపక్షం అని తెలిపారు. ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. జిల్లా అభివృద్ధిపై పాలకులకు చిత్తశుద్ధి లేదని, ఎయిడెడ్ కాలేజీలను మూసేస్తున్నారన్నారు. ఉపాధ్యాయులకు దాదాపు రూ.19 వేల కోట్లు ఇవ్వాలని, నాలుగున్నరేళ్లలో ఒక్క డిఎస్‌సి కూడా తీయలేదని విమర్శించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ.. జిల్లా అభివృద్ధి జరగాలంటే చింతలపూడి, తాడిపూడి వంటి ఎత్తిపోతల పథకాలు పూర్తిచేసి నీటివనరులను పెంచాలన్నారు. ఆయిల్‌పామ్ సాగుపై ప్రభుత్వానికి సరైన పాలసీ లేదని విమర్శించారు. జిల్లాలో దళితులు, ఆదివాసీలు 25 శాతం జనాభా ఉన్నారని, వీరంతా ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో అభివృద్ధే ప్రధాన ఏజెండా కావాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.కిషోర్ వందన సమర్పణ చేశారు.


నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ బహిరంగసభలో గదతో విక్టరీ సింబల్‌ను చూపుతున్న చంద్రబాబు

సీమ ప్రాజెక్టులు పూర్తి చేస్తాం

- 'రా కదలి రా' సభలో చంద్రబాబు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

వైసిపి పాలనలో అన్ని రంగాలు నిర్వీర్యం అయ్యాయని, వైసిపి ప్రభుత్వ పతనం ఖాయమని టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు అన్నారు. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో మంగళవారం 'రా కదలిరా' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. వైసిపి పాలనలో రాతి యుగంలోకి వెళ్లామని, టిడిపి అధికారంలోకి రాగానే స్వర్ణయుగం తెస్తామని తెలిపారు. అంగన్‌వాడీలకు న్యాయం చేస్తామని, రాయలసీమ ప్రాజెక్టులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. వైసిపి పాలన పేదల పాలిట శాపంగా మారిందని, పేదలు నిరుపేదలుగా, యువత నిరుద్యోగులుగా మారిపోయారని విమర్శించారు. జగన్‌కు తెలిసింది కూల్చివేతలు, దాడులు మాత్రమేనని తెలిపారు.

ప్రజా వేదికను కూల్చి విధ్వంస పాలనకు తెర లేపారని, అధికార దాహంతో తనపై తప్పుడు కేసు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాయలసీమకు నీళ్ళు తేవాలని ముచ్చుమర్రి ఎత్తిపోతల తీసుకొచ్చామని, గోదావరి నీళ్ల నాగార్జున సాగర్‌కు తేవాలని టెండర్లు పిలిచామని, అవి వచ్చి ఉంటే సీమకు కరువు వచ్చేది కాదన్నారు. రాయలసీమకు నీళ్లు, యువతకు ఉద్యోగాలు, పేదలకు చదువు, ఇతర మౌలిక సదుపాయాలు వస్తే రాయలసీమ రతనాలసీమ అవుతుందని, అదే తన ధ్యేయమని చెప్పారు. కర్నూలుకు హైకోర్టు బెంచి తెస్తామని, వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేసి ఇంటింటికి నీళ్లు ఇస్తామని హామీ ఇచ్చారు. జగన్ మాయమాటలు నమ్మి మరోసారి మోసపోయేవారు ఎవరూ లేరన్నారు. సమావేశంలో టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి, నంద్యాల పార్లమెంట్ ఇన్‌ఛార్జ్ మాండ్ర శివానందరెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు భూమా అఖిలప్రియ, గౌరుచరిత, గౌరు వెంకటరెడ్డి, బిసి జనార్ధన రెడ్డి, బుడ్డా రాజశేఖర్ రెడ్డి, జనసేన నాయకులు మల్లయ్య, చింత సురేష్ బాబు పాల్గొన్నారు.

రికార్డుల ఆధునీకరణ తర్వాతే 'ల్యాండ్ టైట్లింగ్ యాక్టు' అమలు

- అన్ని వర్గాల అభిప్రాయాలు క్రోఢీకరణ
- రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సమగ్ర భూ సర్వే ద్వారా అన్ని రెవెన్యూ రికార్డులు ఆధునీకరణ చేసిన తర్వాతే దశలవారీ ఎపి ల్యాండ్ టైట్లింగ్ యాక్టు చట్టాన్ని అమలు చేస్తామని, ప్రజలు, న్యాయవాదులు ఏమాత్రం ఆందోళన చెందొద్దని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. భూ యాజమాన్య హక్కులకు పటిష్టమైన భరోసా కల్పించేందుకే ఈ చట్టాన్ని తీసుకొచ్చామన్నారు. సచివాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాలతోపాటు అందరి అభిప్రాయాలు తీసుకుని చట్టాన్ని రూపొందిస్తామన్నారు. శాటిలైట్ నిరంతరం అనుసంధానంతో అత్యుత్తమ సాంకేతిక విధానంలో ఈ సమగ్ర సర్వే అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకుని ఇప్పటికే ఎనిమిది రాష్ట్రాలు ఈ చట్టాన్ని రూపొందిస్తున్నాయన్నారు. భూ హక్కులకు ప్రభుత్వం పూర్తి భరోసానిచ్చే టైటిల్ గ్యారెంటీ వ్యవస్థ ప్రవేశపెట్టాలని ఏకసభ్య కమిషన్ సిఫార్సు చేసిందన్నారు. రెవెన్యూ రికార్డులకు గ్యారెంటీ లేకపోవడం వల్లే దేశంలో భూ వివాదాలు పెరిగిపోతున్నాయన్నారు. ఎన్‌సిఆర్‌బి రికార్డుల ప్రకారం 14 శాతం హత్యలు, 60 శాతం నేరాలు భూ వివాదాల వల్లే జరుగుతున్నాయని ధర్మాన తెలిపారు. ఈ నేపథ్యంలో ఎన్ఐఎల్ఆర్ఎంపి పథకం డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్సు మోడరైనేజేషన్ ప్రోగ్రామ్‌లో భాగంగా 2024 నాటికి దేశ వ్యాప్తంగా టైటిల్ గ్యారెంటీ వ్యవస్థ తేవడమే లక్ష్యంగా పనిచేయాలని కేంద్రం నిర్దేశించిందన్నారు. అందుకే 2019లో ముసాయిదా చట్టాన్ని రూపొందించామన్నారు. నీతి ఆయోగ్ మార్గదర్శకాలు ప్రకారం.. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని దేశంలోనే ప్రథమంగా పటిష్టమైన భూ హక్కు చట్టాన్ని రూపొందిస్తున్నామన్నారు. దశలవారీ మొత్తం 17 వేల గ్రామాల్లో ఆ సమగ్ర సర్వే కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఇప్పటి వరకు నాలుగు వేల గ్రామాల్లో సమగ్ర సర్వే కార్యక్రమం పూర్తయ్యిందని అన్నారు. న్యాయవాద సంఘాల ప్రతినిధులు వారి నిరసనను విరమించి వెంటనే విధులకు హాజరుకావాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. మీడియా సమావేశంలో అడిషనల్ సిసిఎల్ఎ ఇంతియాజ్ పాల్గొన్నారు.


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రుద్రరాజు

ఏడు గ్యారంటీలతో అధికారంలోకి వస్తాం

- పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

ఏడు గ్యారంటీలు అమలు చేసి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు చెప్పారు. కాంగ్రెస్ పార్టీ విశాఖ నగర అధ్యక్షులు గొంప గోవిందరాజు ఆధ్వర్యాన మేఘాలయ హోటల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రుద్రరాజు మాట్లాడుతూ.. రాజధాని అమరావతి, ప్రత్యేక హోదా, ఉక్కు ఫ్యాక్టరీ పరిరక్షణ, బిసిల కులగణన, క్రైస్తవుల పరిరక్షణ, విభజన చట్టంలోని హామీల అమలు తదితర అంశాలతో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొస్తామన్నారు. 22 లోక్‌సభ స్థానాలను వైసిపికి కట్టబెట్టినా ప్రత్యేక హోదా, పోలవరం సాధించలేకపోయిందని విమర్శించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోలేని పరిస్థితుల్లో ఈ ప్రభుత్వం ఉండడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి జెడి.శీలం, పిసిసి వర్కింగ్ కమిటీ సభ్యులు కొప్పుల రాజు తదితరులు పాల్గొన్నారు.

కూలిరేట్ల పెంపునకు అధికారుల హామీ

- బేవరేజస్ హమాలీ యూనియన్ (సిఐటియు)

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో బేవరేజస్ డిపోల్లో పనిచేస్తున్న హమాలీ సమస్యలను పరిష్కరించేందుకు బేవరేజస్ అధికారులు సానుకూలంగా స్పందించారని ఎపిబిసిఎల్, ఐఎంఎఫ్ఎల్ డిపోస్ హమాలీ యూనియన్ (సిఐటియు) నాయకులు తెలిపారు. ఈ మేరకు గౌరవాధ్యక్షులు కె ఉమామహేశ్వరరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్‌వి సుబ్బారెడ్డి, ఎం మదన్‌మోహన్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సమస్యలపై ఎమ్‌డి పేషీలో వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. దీనిపై స్పందించిన అధికారులు సంక్రాంతి పండగలోపు యూనిఫాం, షూ మంజూరు చేస్తామని, సంక్రాంతి తరువాత ఇన్సూరెన్స్ ఎగుమతి కూలిరేట్లు పెంచేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.


విజయవాడ ధర్నాచౌక్‌లో మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు


నంద్యాలలో నుదుటికి పంగనామాలు పెట్టుకొని సమ్మెలో పాల్గొన్న కార్మికులు

మున్సిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- 15వ రోజుకు చేరిన ఆందోళనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు వివిధ రూపాల్లో నిరసన ప్రదర్శనలు చేశారు. పాదయాత్ర సమయంలో జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేశారంటూ కార్మికులు పంగనామాలు పెట్టుకొని సమ్మెలో పాల్గొన్నారు. చెవిలో పువ్వులు పెట్టుకొని, భిక్షాటన, అర్ధనగ్న ప్రదర్శనలు చేస్తూ నిరసనలు కొనసాగించారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం 15వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం దిగొచ్చి తమ డిమాండ్లు పరిష్కరించేంత వరకూ పోరాటం సాగిస్తామని మున్సిపల్ కార్మికులు స్పష్టం చేశారు.

శ్రీకాకుళం, ఇచ్ఛాపురంలో పంగనామాలు పెట్టుకొని సమ్మెలో పాల్గొన్నారు. ఆమదాలవలసలో గడ్డిని తింటూ వినూత్నంగా నిరసన తెలిపారు. ఐలూ రాష్ట్ర కమిటీ సభ్యులు బొడ్డేపల్లి మోహనరావు సంఘీభావం తెలిపారు. విజయనగరం జిల్లాలో పంగనామాలు, చెవిలో పూలు పెట్టుకొని నిరసన తెలిపారు. విశాఖ 5, 7 వార్డుల పరిధిలోని కారుషెడ్, వాంబేకాలనీ, ఉడా కాలనీలో చెత్త తరలింపు వాహనాలను, పోటీ కార్మికులను సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు అడ్డుకున్నారు. అనకాపల్లిలో చెత్తను తరలించేందుకు వచ్చిన ప్రయివేటు ట్రాక్టర్లను అడ్డుకున్నారు. పలుచోట్ల కార్మికులు రోడ్లపై భిక్షాటన చేశారు. ఎన్‌టిఆర్ జిల్లా మైలవరం, జగ్గయ్యపేటల్లో నోటికి నల్లరిబ్బన్లు కట్టుకుని, విజయవాడ ధర్నాచౌక్‌లో మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతపురం జిల్లా రాయదుర్గంలో వేప ఆకులు కట్టుకుని నిరసన తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకులో మానవహారం, నరసాపురంలో అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. కర్నూలులో సాష్టాంగ నమస్కారం, నంద్యాల, ఏలూరు జిల్లాల్లో పంగనామాలు పెట్టుకొని నిరసన కొనసాగించారు. కడపలో నడుముకు ఆకులు కట్టుకుని అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో మోకాళ్లపైన నిలబడి, కాకినాడ జిల్లా పెద్దాపురంలో వంటా వార్పు, సామర్లకోటలో అర్ధనగ్నంగా మోకాళ్లపై నిలబడి నిరసన ప్రదర్శనలు చేపట్టారు. కోనసీమ, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, ప్రకాశం, కృష్ణా, గుంటూరు, పల్నాడు, శ్రీ సత్యసాయి జిల్లాల్లో ఆందోళనలు కొనసాగాయి.




మోడీ హఠావో - దేశ్ బచావో పోస్టరు ఆవిష్కరణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మోడీ హఠావో దేవ్ బచావో నినాదంతో జనవరి 12న విజయవాడ సిద్ధార్థ ఆడిటోరియంలో జరిగే కార్యక్రమ పోస్టరును మంగళవారం ఆవిష్కరించారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, కె విజయరావు, వి వెంకటేశ్వర్లు, జి ఓబులేసు, వై కేశవరావు, భాస్కరరావు, రిటైర్డు ఐఎఎస్ అధికారి బి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇటిఎస్‌తో ఫిజిక్స్ వాలా ఒప్పందం



హైదరాబాద్ : విదేశీ విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు సహాయపడేందుకు ఇటిఎస్ ఇండియాతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఫిజిక్స్ వాలా (పిడబ్ల్యు) తెలిపింది. దీంతో అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలలో చదువుకోవాలనుకునే విద్యార్థులకు సంపూర్ణ మార్గదర్శకత్వం, మద్దతును అందించడానికి వీలు కలుగుతుందని పేర్కొంది. అమెరికాలోని ఇటిఎస్ అనుబంధ సంస్థతో ఒప్పందం విద్యార్థుల అవసరాలను తీర్చడానికి సరైన ఛానెల్ అని తాము భావిస్తున్నామని పిడబ్ల్యు అధికార ప్రతినిధి గౌరవ్ గులారియా పేర్కొన్నారు.


పెద్దకడబూరులో గోపాల్ భార్య జయశీలమ్మకు చెక్కును అందిస్తున్న భువనేశ్వరి

మృతుల కుటుంబాలకు భువనేశ్వరి పరామర్శ

- ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల ఆర్థిక సాయం

ప్రజాశక్తి - మంత్రాలయం

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు అక్రమ అరెస్టుతో మనస్తాపానికి గురై మృతి చెందిన కుటుంబాలను చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి 'నిజం గెలవాలి' అనే కార్యక్రమం ద్వారా పరామర్శించారు. కర్నూలు జిల్లా మంత్రాలయం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పాలకుర్తి తిక్కారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మూడు కుటుంబాలను కలిసి వారి కష్ట సుఖాలను అడిగి తెలుసుకున్నారు. టిడిపిపైనా, చంద్రబాబుపైనా ఉన్న అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు. పెద్దకడుబూరులోని గోనపాడు గోపాల్ (53) భార్య జయశీలమ్మకు, కౌతాళం మండలం వల్లూరు గ్రామంలో వడ్డే ఈరమ్మ (50) భర్త వడ్డే ఈరన్నకు, మంత్రాలయంలోని మిడిగిలిదిన్నె రాఘమ్మ (30) భర్త అంజినయ్యకు ఒక్కొక్కరికి రూ.3 లక్షల చొప్పున చెక్కులు అందజేశారు. బాధిత కుటుంబాలకు టిడిపి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు బిటి.నాయుడు, ఆలూరు ఇన్‌ఛార్జ్ కోట్ల సుజాతమ్మ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామమందిరాన్ని ప్రారంభించే హక్కు బిజెపికి లేదు

- సిపిఐ నారాయణ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

అయోధ్యలోని రామాలయాన్ని ప్రారంభించే హక్కు బిజెపికి లేదని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. మహిళల రక్తమాంసాలను పిప్పిచేసినటువంటి బిజెపి నాయకుల రక్తసిక్త హస్తాలతో రామాలయాన్ని ప్రారంభించడం సిగ్గుచేటన్నారు. తిరుపతిలో ఆయన మీడియాతో ఆయన మాట్లాడుతూ..బిల్కిస్ బానో కేసులో సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని, అత్యాచార నిందితులను తిరిగి జైలుకు పంపడం హర్షనీయమన్నారు. అత్యాచార నిందితులకు బిజెపి ప్రభుత్వం క్షమాభిక్ష కింద బెయిల్ ఇచ్చిన బిజెపి నాయకులు అయోధ్యలోని రామమందిరాన్ని ప్రారంభించడాన్ని తప్పుబట్టారు. యోగ్యులు, మంచి వ్యక్తులతో రామమందిరాన్ని ప్రారంభించాలన్నారు.

చివరి త్రైమాసికంలోనూ ఓడీయే

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కొనసాగుతున్న ఆర్థిక సంవత్సరంలో చివరి త్రైమాసికం కూడా ఓవర్ డ్రాఫ్ట్‌తోనే ప్రారంభమైంది. డిసెంబరు నుంచి ప్రారంభమైన ఈ చివరి త్రైమాసికంలో తొలి ఎనిమిది రోజుల్లో ఏకంగా ఆరు రోజులపాటు రాష్ట్రం ఓడీలోనే కొనసాగడం విశేషం. మధ్యలో రెండు రోజులపాటు ఓడీ నుంచి బయటపడినప్పటికీ, తరువాత మళ్లీ ఖజానా ఓడీలోకి వెళ్లిపోయింది. ప్రస్తుతం రూ.1,695 కోట్లు వరకు ఓవర్‌డ్రాఫ్ట్‌లో ఉన్నట్లు రిజర్వ్ బ్యాంకు రాష్ట్రానికి వెల్లడించింది.

జీవిత బీమా పరిశ్రమ 44% పెరుగుదల

- ప్రీమియం వసూళ్లలో ఎల్ఐసి టాప్
- డిసెంబర్‌లో 94 శాతం వృద్ధి

ముంబయి : జీవిత బీమా నూతన ప్రీమియం వసూళ్లలో ప్రభుత్వ రంగ సంస్థ ఎల్ఐసి దూసుకుపోయింది. 2023 డిసెంబర్‌లో జీవిత బీమా పరిశ్రమ 44 శాతం పెరుగుదలను నమోదు చేయగా.. ఎల్ఐసి ఏకంగా 94 శాతం వృద్ధిని సాధించింది. దిగ్గజ ఎల్ఐసి మార్కెట్ వాటాకు గండి కొట్టాలని భావిస్తున్న ప్రయివేటు సంస్థలకు పెద్ద షాకే.. నూతన బీమా ప్రీమియం వసూళ్లలో ఎల్ఐసి దాదాపు రెట్టింపు వృద్ధిని నమోదు చేసింది. నూతన ప్రీమియం అనేది నిర్దిష్ట కాలానికి కొత్త పాలసీల నుండి పొందిన ప్రీమియంను సూచిస్తుంది. బీమా సంస్థల వృద్ధికి కీలకం. గడిచిన నెలలో జీవిత బీమా పరిశ్రమ రూ. 38,583 కోట్ల విలువైన ప్రీమియంలను సమీకరించింది.

ఇది 2022 డిసెంబర్‌లోని రూ.26,838.3 కోట్లతో పోలిస్తే 43.8 శాతం పెరిగిందని లైఫ్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. గ్రూప్ బిజినెస్‌లో అనేక రెట్లు వృద్ధి చెందడంతో ప్రభుత్వ రంగ దిగ్గజం ఎల్ఐసి ప్రీమియంలు 93.8 శాతం పెరిగి రూ.11,858.5 కోట్ల నుంచి రూ.22,981.3 కోట్లకు చేరాయి. అదే సమయంలో ప్రయివేటు బీమా సంస్థల ప్రీమియంలు 4.15 శాతం పెరిగి రూ.14,979.8 కోట్ల నుంచి రూ.15,601.8 కోట్లుగా నమోదయ్యాయి. ఎల్ఐసి గ్రూప్ సింగిల్ ప్రీమియం వ్యాపారం 195 శాతం పెరిగి రూ. 5,966.9 కోట్ల నుంచి రూ.17,601.9 కోట్లకు చేరుకుంది. ప్రయివేటు బీమా సంస్థ అయిన ఎస్‌బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రీమియంలు 20.73శాతం క్షీణించి రూ.4,606.8 కోట్లుగా నమోదయ్యాయి. హెచ్‌డిఎఫ్‌సి లైఫ్ ఇన్సూరెన్స్ ఎన్‌బిపి 3.26 శాతం పెరిగి రూ.2,842.9 కోట్లకు చేరుకుంది. మిగిలిన లిస్టెడ్ సంస్థల్లో ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ 2.89 శాతం పెరిగి రూ. 1,497.3 కోట్లకు చేరుకోగా, మాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ 17.6 శాతం వృద్ధితో రూ.1,213.9 కోట్ల ప్రీమియంలను వసూలు చేసింది.



హైబిజ్ టివి రియాల్టీ అవార్డులకు నామినేషన్లు

హైదరాబాద్ : హైబిజ్ టి కొత్తగా రియాల్టీ అవార్డ్స్ 2024ను ఇవ్వనున్నట్లు ప్రకటించింది. రియల్ ఎస్టేట్ రంగంలో రాణిస్తున్న సంస్థలకు, ప్రముఖులకు 50 కి పైగా అవార్డులను ఇవ్వనున్నట్లు హైబిజ్ టివి ఫౌండర్, ఎండి ఎం రాజగోపాల్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో పలువురు ప్రముఖులతో కలిసి ఆయన అవార్డుల నామినేషన్ల పోస్టర్‌ను ఆవిష్కరించారు. నామినేషన్ల స్వీకరణ చివరి తేదిని జనవరి 18గా నిర్ణయించామన్నారు. రియాల్టీ రంగంలో దశాబ్దాలుగా ఉత్తవ సేవలను అందిస్తున్న ప్రముఖులను సత్కరించే యోచనతో దీన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు.

సంపాదకీయం

హసీనా విజయం

ప్రపంచంలో ఎనిమిదో అతిపెద్ద జనాభా కలిగిన బంగ్లాదేశ్‌లో ప్రధాన ప్రతిపక్ష పార్టీ బిఎన్‌సి బహిష్కరణ మధ్య జరిగిన ఎన్నికల్లో అవామీలీగ్ వరుసగా నాలుగోసారి అధికారాన్ని చేజిక్కించుకుంది. 300 స్థానాలున్న పార్లమెంటులో 299 స్థానాలకు జనవరి 7న ఎన్నికలు నిర్వహించగా, 76 ఏళ్ల షేక్ హసీనా నేతృత్వంలోని లౌకిక వాద పార్టీ అవామీ లీగ్ 222 స్థానాలు గెలుచుకుని తన సత్తా చాటుకుంది. జతియా పార్టీ 11 సీట్లు, స్వతంత్రులు 62 సీట్లు, ఇతర పార్టీలకు 3 సీట్లు దక్కాయి. హింస, అక్రమాలు చోటు చేసుకున్నాయి కాబట్టి ఈ ఎన్నికల ఫలితాలను తాము గుర్తించడం లేదని, తిరిగి తాజాగా ఎన్నికలు జరపాలని బిఎన్‌సి డిమాండ్ చేసింది. ఆసియాలో వ్యూహాత్మకంగా, భౌగోళికంగా కీలకమైన 17 కోట్ల జనాభా కలిగిన బంగ్లాదేశ్‌ను తమ గుప్పెట్లో పెట్టుకోవాలని చూస్తున్న అమెరికా, బ్రిటన్ కూడా ఇదే పాట పాడుతున్నాయి. బంగ్లాదేశ్ ఎన్నికల కమిషన్ దీనిని నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది. ఎన్నికలు స్వేచ్ఛగా, శాంతియుతంగా జరిగాయని, ప్రధాన ప్రతిపక్షం ఎన్నికల రోజున చేపట్టిన దేశవ్యాపిత సమ్మె పిలుపును లెక్కచేయకుండా 40శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవడం గొప్ప విషయమని పేర్కొంది. హసీనా నేతృత్వంలో కొత్త ప్రభుత్వం గురువారం కొలువుదీరనుంది. మత ఛాందసవాద శక్తులతో కూడిన బంగ్లా నేషనల్ పార్టీ (బిఎన్‌పి) అధినేత, రెండు సార్లు ప్రధాని బేగం ఖలీదా జియా అవినీతి కేసులో శిక్ష, అనారోగ్యంతో ప్రస్తుతం గృహ నిర్బంధంలో ఉన్నారు. ఆమె కుమారుడు బిఎన్‌సి చైర్మన్ లండన్‌లో ప్రవాస జీవితం గడుపుతున్నారు. 2018లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో బిఎన్‌సి పాల్గొని ఘోర పరాజయం చవిచూసింది. 80 శాతం దాకా ఓట్లు పోలైన ఆ ఎన్నికల్లో అవామీలీగ్ అసాధారణమైన రీతిలో 288 స్థానాలను గెలుచుకోగా, బిఎన్‌పికి కేవలం అయిదు సీట్లు మాత్రమే దక్కాయి. 2014 ఎన్నికలను బిఎన్‌పి ఇప్పుడు మాదిరిగానే బహిష్కరించింది. ఎన్నికల్లో అన్ని పార్టీలకు సమ న్యాయం జరిగేలా చూసేందుకు 1991, 1996, 2001, 2008లో మాదిరిగా తటస్థ ఆపద్ధర్మ ప్రభుత్వ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించాలని, జైలులో ఉన్న బిఎన్‌పి నాయకులను, కార్యకర్తలను విడుదల జేయాలని బిఎన్‌పి డిమాండ్ చేసింది. దీనిని హసీనా ప్రభుత్వం తిరస్కరించడంతో 2014లో ఎన్నికలను బహిష్కరించింది. ఇప్పుడు అదే సాకుతో ఎన్నికలను బహిష్కరించింది. అంతర్జాతీయ, అంతర్గత కుట్రలు, కుతంత్రాలతో నలిగిపోయిన బంగ్లాదేశ్‌లో గత పదిహేనేళ్లుగా రాజకీయ సుస్థిరతను చేకూర్చడంలో బంగ బంధు షేక్ ముజిబుర్ రహ్మాన్ కుమార్తె హసీనా కొంతమేర కృతకృత్యులయ్యారు. అమెరికా, బ్రిటన్ వంటి పశ్చిమ దేశాల కుట్రలను తట్టుకుంటూ, భారత్, నేపాల్, భూటాన్‌లతోను, సోషలిస్టు చైనా, వియత్నాంలతోను చక్కటి స్నేహ సంబంధాలను కొనసాగిస్తూ వస్తున్నారు. మొత్తంగా ఐదోసారి ఆమె ప్రధాని పదవిని చేపట్టనున్నారు. 1981లో ప్రవాసం నుంచి బయటకు వచ్చి అవామీలీగ్ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన ఆమె మిలట్రీ నియంత ఎర్షాద్‌కు వ్యతిరేకంగా ఖలీదాజియాతో కలిసి ఆందోళనలు నిర్వహించారు. 1996-2001 మధ్య తొలిసారి ప్రధాని పదవిని అధిష్టించారు. 2008 నుంచి అవామీలీగ్ జైత్రయాత్ర సాగుతోంది. మత తీవ్రవాదులను అణచివేసిన నేతగా హసీనా పేరు తెచ్చుకున్నారు. 1971 యుద్ధ నేరాల కేసుల విచారణకు ఆమె 2009లో ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేశారు. మానవాభివృద్ధి సూచిలో భారత్ కన్నా మెరుగైన స్థితిలో బంగ్లాదేశ్ నిలిచిందంటే ఆ ఘనత హసీనాకే దక్కుతుంది.

హసీనా తొలిసారి అధికారంలోకి వచ్చిన రోజుల్లో ఉన్న కరెంటు కోతలు ఇప్పుడు లేవు. కోవిడ్ తరువాత ఆర్థిక వ్యవస్థ కొన్ని ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నది. చైనాకు వ్యతిరేకంగా ఇండో - పసిఫిక్ వ్యూహం (క్వాడ్)లో కలిసి రావాలని అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ ఒత్తిడి తెచ్చినా తిరస్కరించారామె. మరోవైపు భారత వేర్పాటువాదులను అణచివేయడంతోపాటు ఇంధన, వాణిజ్యరంగాల్లో పరస్పర సహకారం, చట్టోగ్రామ్ (చిట్టగాంగ్) నౌకాశ్రయంతో అనుసంధానం ద్వారా ఈశాన్య రాష్ట్రాలకు సరుకుల సరఫరా వంటి అంశాల్లో భారత్‌తో కలసి అడుగులు వేస్తున్నారు. ఎన్నికల తరువాత దేశంలో శాంతి భద్రతల పరిరక్షణ, ఆర్థిక వ్యవస్థకు తిరిగి జవసత్వాలు కల్పించడం హసీనా సర్కార్ ముందున్న ప్రధాన సవాళ్లు. ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు అన్ని రాజకీయ పార్టీలను విశ్వాసంలోకి తీసుకుని ప్రజాతంత్ర యుతంగా ముందుకు సాగాల్సిన బాధ్యత హసీనా ప్రభుత్వంపై ఉంది.

మహనీయుల మాట




శ్రామిక మహిళ విముక్తి పోరాటం అనేది... బూర్జువా మహిళలు తమ పురుషులకు వ్యతిరేకంగా చేసే పోరాటం లాంటిది కాదు. దానికి మారుగా ఆమె తన వర్గానికి చెందిన పురుషులతో కలిసి... మొత్తం పెట్టుబడిదారీ వర్గానికి వ్యతిరేకంగా ఉమ్మడి పోరాటం చేయాలి.

- క్లారా జెట్కిన్

Clara Zetkin

అచ్ఛే దిన్, వికసిత భారత్...!

విశ్లేషణ



వాజ్‌పేయి ప్రధానిగా ఉండగా బిజెపి 2004 ఎన్నికల్లో ఇచ్చిన నినాదం 'వెలిగిపోతున్న భారత్'. తరువాత అదే బిజెపి 2014లో ముందుకు తెచ్చిన నినాదం 'అచ్ఛే దిన్', తాజాగా ప్రధాని నరేంద్ర మోడీ డిసెంబరు రెండవ వారంలో 'వికసిత భారత్' ప్రభుత్వ సంకల్పమని ప్రకటించారు. మూడు నినాదాలకు తేడా ఉంది. మొదటిది తమ విఫలమైన పాలనను కప్పిపుచ్చుకొనేందుకు భారత్ వెలిగిపోతోంది అన్నారు. కాంగ్రెస్ పాలన మీద ధ్వజమెత్తేందుకు తాము అధికారానికి వస్తే అచ్ఛే దిన్ (మంచి రోజులు) తెస్తామని ఆశ చూపారు. పదేళ్ల తరువాత వాటి జాడ కనిపించటం లేదు. దీంతో మరో పాతికేళ్లలో 2047 నాటికి అభివృద్ధి చెందిన వికసిత భారత్‌గా దేశాన్ని మారుస్తామని నమ్మబలుకుతున్నారు.



ఎం. కోటేశ్వరరావు

సంకీర్ణ ప్రభుత్వాలతో మూడు దశాబ్దాల కాలం వృధా అయిందని, పాలన లేకపోవటాన్ని, సంతుష్టీకరణ రాజకీయాలను జనం చూశారని ప్రధాని నరేంద్ర మోడీ ధ్వజమెత్తారు. ఈ కారణంగానే బిజెపిని సహజ ఎంపికగా జనం పరిగణిస్తున్నారని, 2024లో తాము ఎవరి మీదా ఆధారపడని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని 'ఇండియా టుడే' మాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. పదేళ్ల క్రితంతో పోల్చితే ఇప్పుడు అన్ని రంగాలు మెరుగైన పని తీరు కనపరుస్తున్నాయని ఉద్ఘాటించారు. ఇలాంటి ముఖాముఖిలో మోడీ చెప్పింది రాసుకోవటం తప్ప విమర్శనాత్మక ప్రశ్నలు అడిగే అవకాశం ఉండదన్నది తెలిసిందే. 'మోడీ-హిజ్ మాస్టర్స్ వాయిస్' మీడియా ఆడుతున్న మైండ్ గేమ్‌లో ఇలాంటివి కొత్త కాదు. ఎప్పుడైనా విలేకర్ల సమావేశం పెట్టి ఎదురయ్యే ప్రశ్నలకు జవాబు చెబితే జనానికి నాణానికి మరోవైపు ఏముందో తెలుస్తుంది. 2014 ఎన్నికల సమయంలో సెలవిచ్చిన అచ్ఛే దిన్, నల్లధనం వెలికితీత, గుజరాత్ తరహా అభివృద్ధి వంటి అంశాలను ఏ మేరకు సాధించారో ఎక్కడా చెప్పటం లేదు. జనాలను మార్కెటింగ్ మాయాజాలంలో ముంచి తమ ఉత్పత్తులను అమ్ముకొనేందుకు వ్యాపార సంస్థలు విడుదల చేసే వాణిజ్య ప్రకటనల గురించి తెలిసిందే. దేశంలో పలు పార్టీలు ఇప్పుడు ఇస్తున్న నినాదాలు, చేసే ప్రసంగాలు, ప్రదర్శించే హావభావాల వెనుక అలాంటి మార్కెటింగ్ నిపుణులు ఉన్నారన్నది బహిరంగ రహస్యం. గతంలో ప్రజా ఉద్యమాల నుంచి నినాదాలు పుట్టేవి. ఇప్పుడు అనేక పార్టీలకు వాటితో పనిలేదు.

వాజ్‌పేయి ప్రధానిగా ఉండగా బిజెపి 2004 ఎన్నికల్లో ఇచ్చిన నినాదం "వెలిగిపోతున్న భారత్". తరువాత అదే బిజెపి 2014లో ముందుకు తెచ్చిన నినాదం "అచ్ఛే దిన్", తాజాగా ప్రధాని నరేంద్ర మోడీ డిసెంబరు రెండవ వారంలో "వికసిత భారత్" ప్రభుత్వ సంకల్పమని ప్రకటించారు. 2024లో ఎన్నికల్లోపు ఎలాంటి అనూహ్య ఉదంతాలు జరగక లేదా జరపకపోతే దాన్నే బిజెపి స్వీకరించి ఎన్నికల గోదాలోకి దిగనుంది. మూడు నినాదాలకు తేడా ఉంది. మొదటిది తమ విఫలమైన పాలనను కప్పిపుచ్చుకొనేందుకు భారత్ వెలిగిపోతోంది అన్నారు. కాంగ్రెస్ పాలన మీద ధ్వజమెత్తేందుకు తాము అధికారానికి వస్తే అచ్ఛే దిన్ (మంచి రోజులు) తెస్తామని ఆశ చూపారు. పదేళ్ల తరువాత వాటి జాడ కనిపించటం లేదు. దీంతో మరో పాతికేళ్లలో 2047 నాటికి అభివృద్ధి చెందిన వికసిత భారత్‌గా దేశాన్ని మారుస్తామని నమ్మబలుకుతున్నారు.

వికసిత భారత్ 2047 రోడ్ మాప్ ప్రకారం ఆ సంవత్సరానికి మన దేశం అభివృద్ధి చెందిన జాబితాలో చేరుతుందని చెబుతున్న దాన్ని జనం నమ్మేదెలా? అభివృద్ధి లక్షణాలలో అధిక తలసరి రాబడి ఒకటి. దాన్లో ఇప్పుడు మనం ఎక్కడున్నాం? ప్రపంచబ్యాంకు రూపొందించిన అట్లాస్ పద్ధతి ప్రకారం 2022 సంవత్సర వివరాల మేరకు 190 దేశాల జాబితాలో జిఎన్‌ఐ తలసరి ఆదాయంలో ముందున్న తొలి 59 దేశాల్లో రెండవ పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న చైనాకే చోటు లేదు. ఎగువ మధ్య తరగతి ఆదాయ జాబితాలో రెండవదిగా, మొత్తం దేశాలలో 61వ స్థానంలో ఉంది. మన దేశం దిగువ మధ్య తరగతి జాబితాలో 26వ స్థానంలో మొత్తం దేశాల్లో 140వదిగా ఉంది. సంకీర్ణ ప్రభుత్వాలతో దేశం వెనుకబడిందని మోడీ అన్నారు. జనానికి సమాచారం అందుబాటులో ఉన్నా చూసే ఓపిక, ఆసక్తి కూడా లేని బలహీనతను పాలకులు సొమ్ము చేసుకుంటున్నారు. సంకీర్ణ ప్రభుత్వం ఉన్న 2004లో భారత జిఎన్‌ఐ 600 డాలర్లు 2013 నాటికి 1,500కు చేరింది. వార్షిక సగటు రేటు 11.48 శాతం. కాగా స్థిరమైన, స్పష్టమైన విధానాలు అమలు జరిపినట్లు చెప్పుకున్న నరేంద్ర మోడీ పాలనలో 2022 నాటికి అది 2,380 డాలర్లకు, వార్షిక వృద్ధి రేటు 5.44 శాతమే పెరిగింది. సంతోష సూచికలో 146 దేశాలకు గాను మనదేశం 137వ స్థానంలో ఉంది. కొంత మంది అంగీకరించినా లేకున్నా మన కంటే ఎగువన చైనా 82, నేపాల్ 85, బంగ్లాదేశ్ 99, పాకిస్తాన్ 103, శ్రీలంక 126వ స్థానాల్లో ఉన్నాయి. అయినప్పటికీ భారత్‌ను వికసింప చేస్తామని చెప్పటం నరేంద్ర మోడీకే చెల్లింది.

భారత్ అప్పుల పాలు కానుందని సరిగ్గా వికసిత భారత్ కార్యక్రమాన్ని ప్రారంభించిన సమయంలోనే అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) రూపొందించిన నివేదిక హెచ్చరించింది. ప్రపంచంలో మన దేశ స్థానం గురించి వివిధ సంస్థలు వెల్లడిస్తున్న సూచికలను అధికార బిజెపి, అది నడుపుతున్న కేంద్ర ప్రభుత్వం కూడా అంగీకరించదు. తప్పుల తడకలని, వారికి లెక్కలు వేయటం రాదని బుకాయించటం తెలిసిందే. పోనీ వారు నమ్మే వేదగణితం ప్రకారం మనం నిజంగా ఎక్కడున్నామో, ఎలా ఉన్నామో ఎప్పుడైనా చెప్పారా? ఇప్పుడు ఐఎంఎఫ్ చెప్పిందాన్ని కూడా తాము అంగీకరించటం లేదని, అవన్నీ ఊహాగానాలు తప్ప వాస్తవం కాదని కేంద్ర ప్రభుత్వం గింజుకుంది. నెరవేరని ఐదు లక్షల కోట్ల డాలర్ల జిడిపి కబుర్లు కూడా ఊహాగానమే. వర్తమాన వికసిత భారత్ కూడా అదే, వాస్తవం కాదు. వికసిత భారత్, తమ విజయం నల్లేరు మీద బండిలా సాగుతుందని చెప్పుకుంటున్న పూర్వరంగంలో ఐఎంఎఫ్ విశ్లేషణ గొంతులో పచ్చి వెలక్కాయ వంటిదే. ఇంతకీ అదేమి చెప్పింది? ప్రతికూల దెబ్బలు తగిలితే 2028 నాటికి జిడిపి ఎంత ఉంటుందో ప్రభుత్వ అప్పు అంతకు (వంద శాతం) చేరుతుందని హెచ్చరించింది. ఒక శతాబ్దిలో ఒకసారి వచ్చే కరోనా-19 మాదిరి విపరీత పరిణామాలు సంభవిస్తే అని ఐఎంఎఫ్ చెప్పిందని, అలాంటివేమీ జరిగే అవకాశం లేదని కేంద్ర ప్రభుత్వం అన్నది.

తమ నేత అధికారానికి వచ్చిన తరువాత విదేశీ అప్పులేమీ చేయటం లేదని ప్రచారం చేస్తున్న భక్తులను సంతుష్టీకరించలేము. మాక్రో ట్రెండ్స్ నెట్ సమాచారం ప్రకారం 1970లో ఎనిమిది బిలియన్ డాలర్లుగా ఉన్న విదేశీ అప్పు నూతన ఆర్థిక విధానాలను అమల్లోకి తెచ్చిన 1990నాటికి 83కి చేరింది. తరువాత పదేళ్లకు 101, 2010 నాటికి 290, నరేంద్రమోడీ అధికారానికి వచ్చేనాటికి 457 బి.డాలర్లకు చేరింది. ఐఎంఎఫ్ తాజా విశ్లేషణ ప్రకారం 2024 మార్చి నాటికి 681, మరుసటి ఏడాది మార్చికి 748 బిలియన్ డాలర్లకు పెరుగుతుందని అంచనా వేసింది. వార్షిక అప్పు పెరుగుదల శాతాల్లో ఎగుడుదిగుళ్లు ఉండవచ్చు తప్ప మొత్తంగా చూసినపుడు పెరుగుదల ధోరణే ఉంది. ఇదే కాలంలో కేంద్ర ప్రభుత్వ దేశీయ రుణ భారం 58.6 లక్షల కోట్ల నుంచి 156.6 లక్షల కోట్లకు 174 శాతం పెరిగింది. కరోనా కారణంగా ఇంత అప్పు చేశాము, ఉచితంగా వాక్సిన్లు వేశాము అని బిజెపి పెద్దలు చెప్పవచ్చు. ఇన్ని లక్షల కోట్లు దానికే తెచ్చారా? బడ్జెట్ పత్రాల్లో పేర్కొన్నదాని ప్రకారం 2024 మార్చి నాటికి దేశీయ అప్పు రూ.164 లక్షల కోట్లు, విదేశీ అప్పు 5 లక్షల కోట్లు మొత్తం కలిపితే రూ.169 లక్షల కోట్లకు చేరనుంది.

ఐఎంఎఫ్ ఒక్క రుణం గురించి మాత్రమే చెప్పలేదు. నవంబరు 20 నాటికి సంస్థ సిబ్బంది మన దేశ ఆర్థిక అంశాల గురించి రూపొందించిన 142 పేజీల నివేదికను డిసెంబరు మూడవ వారంలో బహిర్గతం చేశారు. దానిలో గత పది సంవత్సరాల పాలన డొల్లతనం, వైఫల్యాల గురించి పేర్కొన్నారు. నివేదిక పదజాలంలో ఆ మాటలు లేకపోవచ్చు గానీ అచ్ఛే దిన్ పాలనలో అంకెలు చెబుతున్న అంశాల సారమిదే. వస్తు ఎగుమతులు 2019-20లో 320 బిలియన్ డాలర్లు ఉంటే తదుపరి రెండు సంవత్సరాల్లో వరుసగా 296, 429 బి.డాలర్లుగా ఖరారు చేసిన లెక్కలు చెబుతున్నాయి. తరువాత 2022-23లో 456, వర్తమాన సంవత్సరంలో 436, వచ్చే ఏడాది 460 బిలియన్ డాలర్ల అంచనాలుగా ఐఎంఎఫ్ పేర్కొన్నది. ఎగుమతుల ప్రోత్సాహకం పేరుతో పక్కన పెట్టిన రెండు లక్షల కోట్ల రూపాయల వలన అదనంగా పెరిగిందేముంది? మేకిన్, మేడిన్ ఇండియాల జాడ ఎక్కడ? పిఐబి 2022 జులై 29న విడుదల చేసిన సమాచారం ప్రకారం 2017-18లో జిడిపిలో వస్తు ఎగుమతుల శాతం 11.4 కాగా 2021-22లో 13.3 శాతంగా పేర్కొన్నారు. ఐదు సంవత్సరాల సగటు 11.78 శాతం ఉంది. వస్తువులు, సేవల ఎగుమతులు ఈ కాలంలోనే 18.8 శాతం నుంచి 21.4 శాతం మధ్య ఉన్నాయి. సగటు 19.5 శాతమే ఉంది. అందువలన వాటిలో కూడా పెద్దగా పెరుగుదల లేదు. మాక్రో ట్రెండ్స్ అనే పోర్టల్ నిర్వహిస్తున్న సమాచారం ప్రకారం 2004 నుంచి 2013 వరకు ఏటా సగటున 22.1 శాతం ఎగుమతులు జరిగాయి. ఈ లెక్కన మోడీ ఏలుబడిలో దిగుమతులు పడిపోయినట్లా పెరిగినట్లా? దేశ ప్రతిష్టను, మార్కెట్లను పెంచేందుకు నరేంద్ర మోడీ విదేశాలు తిరిగినట్లు, విశ్వగురువుగా మారినట్లు ఎంతగా చెప్పుకున్నా మోడీని చూసి ఎవరూ ఇబ్బడి ముబ్బడిగా దిగుమతులు చేసుకోవటం లేదు. యుపిఎ హయాంలో దేశ దిగుమతులు జిడిపిలో వార్షిక సగటు 26.4 శాతం ఉంది. నరేంద్ర మోడీ అధికారానికి వచ్చిన తరువాత తొమ్మిది సంవత్సరాలలో సగటున 22.9 శాతం చొప్పున ఉన్నాయి. మన ఎగుమతుల కంటే దిగుమతులు ఎక్కువగా ఎందుకు ఉన్నాయంటే తాము చేసిన ఆర్థికవృద్ధి కారణంగా జనంలో కొనుగోలు శక్తి పెరిగి దిగుమతులకు గిరాకీ ఏర్పడిందంటారు బిజెపి నేతలు. ఒకవేళ అదే వాస్తవమైతే జిడిపిలో దిగుమతుల శాతం యుపిఎ హయాంలోనే ఎక్కువ ఉంది, అంటే బిజెపి కంటే మెరుగైన పాలన అందించినట్లుగా భావించాలి. విదేశీ వాణిజ్యలోటు యుపిఎ పాలనా కాలంలో సగటున ఏటా జిడిపిలో 2.26 శాతం ఉంది. 2004లో 0.3 శాతం నుంచి మధ్యలో 4.8 శాతానికి పెరిగి 2013 నాటికి 1.7 శాతానికి తగ్గింది. నరేంద్ర మోడీ ఏలుబడిలో ఎనిమిది సంవత్సరాలలో వార్షిక సగటు 1.45 శాతం ఉండగా మధ్యలో ఒక ఏడాది 0.9 శాతం మిగులు ఉంది. 2014లో 1.3 శాతంగా ఉన్న లోటు 2022లో 2.6 శాతానికి పెరిగింది. సూచిక పైకి చూస్తున్నది తప్ప కిందికి రావటం లేదు. మొత్తంగా చూసినపుడు వికసిత భారత్ కనుచూపు మేరలో కనిపించకపోయినా పట్టపగలు అరుంధతి నక్షత్రాన్ని చూపిన మాదిరి చెబుతున్నారు. ఒకసారి చెప్పినదాన్ని మరొకసారి మాట్లాడకుండా కొత్త పాట అందుకుంటున్నారు, అదే బిజెపి, నరేంద్ర మోడీ ప్రత్యేకత !

ప్రమాదకర క్రిమినల్ చట్ట నిబంధనలపై పోరాడదాం

వ్యాఖ్య



మోటారు వాహనాల చట్ట సవరణ-2019 సందర్భంగా రోడ్డు ప్రమాదాలు, మరణాలు తగ్గించడమే లక్ష్యం అని ప్రభుత్వం చెప్పింది. పార్లమెంటు లోపల, బయట రవాణా శాఖామాత్యులు పదే, పదే ఈ విషయం చెప్పారు. ఆ చట్టంలోని భారీగా పెంచిన జరిమానాలు అమలులోకి వచ్చి 4 సంవత్సరాలయింది. కానీ ప్రమాదాలు తగ్గలేదు సరికదా, 2022లో పెరిగాయని ప్రభుత్వ గణాంకాలే తెలియజేస్తున్నాయి. అందుచేత ప్రమాదాలకు అసలైన కారణాలను పరిష్కరించకుండా శిక్షలు పెంచితే ప్రమాదాలు తగ్గుతాయని చెప్పటం మోసగించడమేనని అనుభవం రుజువు చేస్తున్నది.



ఆర్. లక్ష్మయ్య

ఏదైనా ఒక చట్టం చేయాలన్నా లేక ఉన్న చట్టంలో సవరణలు చేయాలన్నా ప్రభుత్వం ముందుగా లా కమిషన్ ఆఫ్ ఇండియాను సంప్రదించాలి. అలాగే ఆ చట్టం వర్తించే తరగతికి చెందిన సంస్థలు, ప్రముఖులతో సంప్రదించాలి. ప్రస్తుత కొత్త క్రిమినల్ చట్టాలు తేవడానికి ముందు ఈ సాంప్రదాయాన్నీ ఉల్లంఘించారు. కనీసం పార్లమెంటులోనైనా సవివరమైన చర్చ జరగాలి. కానీ మొత్తం ప్రతిపక్షాన్ని సభ నుండి గెంటి వేసి ఈ చట్టాలను ఆమోదింప చేసుకున్నారు. 2023 డిసెంబర్ 21న పార్లమెంటు ఆమోదం పొందగా 4 రోజుల్లోనే అంటే డిసెంబర్ 25న రాష్ట్రపతి ఆమోద ముద్ర వేశారు.

కొత్త చట్టాలు

బ్రిటిష్ కాలంనాటి చట్టాలు ఇంకానా అంటూ ఇండియన్ పీనల్ కోడ్, ఎవిడెన్స్ యాక్ట్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌ల స్థానంలో 3 కొత్త చట్టాలను కేంద్ర ప్రభుత్వం తెచ్చింది. ఒక వ్యక్తి ఉద్దేశ పూర్వకం కాని, నిర్లక్ష్యం లేదా దురుసు ప్రవర్తన వల్ల మరొకరు చనిపోతే ఇండియన్ పీనల్ కోడ్ 1860 (బ్రిటిష్ కాలం నాటి) చట్టం లోని సెక్షన్ 304 (ఏ) ప్రకారం 2 సంవత్సరాల దాకా జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండూ విధించవచ్చు. కానీ కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన భారతీయ న్యాయ సంహిత-2023 లోని సెక్షన్ 106(1) ప్రకారం 5 సంవత్సరాల దాకా జైలు శిక్ష, జరిమానా విధించవచ్చు. కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిందట. అలా వుంది నేటి భారతీయ చట్టం.

ఇక కొత్త చట్టంలోని సెక్షన్ 106(2) ప్రకారం ఒక వ్యక్తి ఉద్దేశపూర్వకంగా కాకపోయి నప్పటికీ నిర్లక్ష్యం, దురుసు చర్య వల్ల ఒక వ్యక్తి చనిపోయిన సందర్భంలో పోలీసులకు లేదా మేజిస్ట్రేట్‌కు తెలియజేయకుండా తప్పించుకుంటే (హిట్ అండ్ రన్) సదరు ముద్దాయికి 10 సంవత్సరాల దాకా జైలు శిక్ష మరియు జరిమానా విధించబడుతుంది. ఈ సెక్షన్ డ్రైవర్ల పాలిటి ఉరితాడు అని డ్రైవర్లందరూ గుర్తించడంతో ఒక్కసారిగా దేశ వ్యాపిత ఆందోళన ప్రారంభమైంది. కొత్త చట్టంలోని సెక్షన్ 106(1), (2) లలోని శిక్షలు బ్రిటిష్ కాలం నాటి చట్టం కంటే శిక్షలు అధికం. ఇదేనా భారతీయత?

అసలు రోడ్డు ప్రమాదాలు ఎందుకు జరుగుతున్నాయి?

దేశంలో జరిగే రోడ్డు ప్రమాదాలలో 90 శాతం మానవేతర కారణాలతో జరుగుతున్నాయని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి), ఢిల్లీ లోని ప్రమాదాలపై అధ్యయనం చేస్తున్న ప్రముఖ ప్రొఫెసర్ గీతం తివారి రుజువు చేశారు. వారు భారత దేశంలోనే కాక వివిధ దేశాలలో కూడా రోడ్డు ప్రమాదాలపై అనేక ప్రసంగాలు చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాలకు 3 ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు.

1. రహదారి నిర్మాణ లోపాలు: ప్రపంచంలో రోడ్డు నిర్మాణ నిబంధలకు విరుద్ధంగా మన దేశంలో రోడ్డు నిర్మాణాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారులు గ్రామాలు /పట్టణాల /జనావాసాల మధ్యలోంచి నిర్మాణం చేయడానికి వీలులేదు. కానీ మన దేశంలో అందుకు భిన్నంగా జరుగుతున్నాయి. కానీ మన దేశంలో ఇలాంటి ఉల్లంఘనలకు లెక్క లేదు. కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా రోడ్డు నిర్మాణాలు చేస్తున్నారు. ఇలాంటి ఉల్లంఘనలు కోకొల్లలు. ఉదాహరణకు కర్నూలు హైదరాబాద్ మధ్య కృష్ణా నది బ్రిడ్జి వద్ద జరిగిన జబ్బార్ ట్రావెల్స్ బస్సు ప్రమాదం. 40 మందికి పైగా సజీవ దహనం అయ్యారు. దీనిపై అధ్యయనం చేసిన ప్రభుత్వ కమిటీ నివేదికలో నిగ్గు తేలిందేమిటి? ప్రమాదం జరిగిన దగ్గర రోడ్డు వెడల్పు తగ్గింది. జాతీయ రహదారుల మధ్యలో అలా రోడ్డు ఇరుకుగా వుండకూడదు. పైగా కల్వర్టుకు కట్టిన గోడకు వాడిన ఇనుప చువ్వలు బయటకు ఉన్నాయి. దాంతో బస్సు ఆ కల్వర్టుకు గుద్దుకొని బయటకు ఉన్న ఇనుప చువ్వలకు రాసుకొని నిప్పు చెలరేగడం, బస్సు ఆయిల్ ట్యాంక్ పగిలి తగలబడటం క్షణాలలో జరిగిపోయాయి. ఆ రహదారి నిర్మించిన కాంట్రాక్టర్‌పై ఎలాంటి చర్యా లేదు. మరొక ఉదాహరణ ఏమంటే విశాఖపట్నం-శ్రీకాకుళం మధ్య జాతీయ రహదారిపై ప్రమాదంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు యర్రం నాయుడు మరణించారు. అందుకు కారణం ఆ జాతీయ రహదారిలో ఎదురుగా వస్తున్న లారీ కుడివైపుకు తిరిగి శ్రీకాకుళం వైపుకు మల్లుతున్న సమయంలో ఎర్రం నాయుడు కారు రావడంతో ప్రమాదం జరిగింది. జాతీయ రహదారులలో ఎక్కడంటే అక్కడ కుడి వైపుకు తిరగడానికి అనుమతించకూడదు. కానీ రోడ్డు నిర్మాణంలోనే చాలా చోట్ల జాతీయ రహదారులలో కుడివైపుకు తిరగడానికి ఏర్పాట్లు ఉన్నాయి. ఇలాంటి ఉదాహరణలు కోకొల్లలు. బలిపశువులయింది, అవుతున్నది డ్రైవర్లు. అన్ని రకాల, వివిధ వేగాలతో వెళ్లే వాహనాలన్నీ ఒకే రోడ్డుపై వెళ్ళాల్సి వస్తోంది. అలా కాకుండా కనీసం చిన్న వాహనాలు ఒక లైన్‌లో, పెద్ద వాహనాలు మరొక లైన్‌లో వెళ్లే ఏర్పాటు వుంటే ప్రమాదాలు కొంతవరకు తగ్గించవచ్చు. మరొక కారణం చూద్దాం. ప్రభుత్వ గణాంకాల ప్రకారమే దేశంలోని రోడ్లలో జాతీయ రహదారులు కేవలం 2 శాతం మాత్రమే. కానీ రోడ్డు ప్రమాదాలలో 62 శాతం ఈ రహదారులపైనే జరుగుతున్నాయి. నేషనల్ పర్మిట్ లారీలకు ఇద్దరు డ్రైవర్లు ఉండాలనే నిబంధనను ఈ కారణంతో ప్రభుత్వం ఇటీవల తొలగించింది. రోజుల తరబడి డ్రైవ్ చేయాల్సి రావడం ఎంత ప్రమాదకరం? కనీసం విశ్రాంతికి, అల్పాహారం/భోజనాలకు రహదారి మధ్యలో ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేయదు. ఇవి కూడా ప్రమాదాలకు కారణాలు.

జరిమానాలు/శిక్షలు భారీగా పెంచితే ప్రమాదాలు తగ్గుతాయా?

మోటారు వాహనాల చట్ట సవరణ-2019 సందర్భంగా రోడ్డు ప్రమాదాలు, మరణాలు తగ్గించడమే లక్ష్యం అని ప్రభుత్వం చెప్పింది. పార్లమెంటు లోపల, బయట రవాణా శాఖామాత్యులు పదే, పదే ఈ విషయం చెప్పారు. అంతేకాదు. ఒక సందర్భంలో పార్లమెంటులో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రమాదాలు తగ్గించి ప్రాణాలు కాపాడటానికి చట్ట సవరణ చేస్తుంటే ప్రతిపక్షాలు అడ్డుపడుతున్నాయి అంటే ప్రజల ప్రాణాలు ప్రతిపక్షాలకు పట్టదా అని ప్రశ్నించారు.

ఆ చట్టంలోని భారీగా పెంచిన జరిమానాలు అమలులోకి వచ్చి 4 సంవత్సరాలయింది. కానీ ప్రమాదాలు తగ్గలేదు సరికదా, 2022లో పెరిగాయని ప్రభుత్వ గణాంకాలే తెలియజేస్తున్నాయి. అందుచేత ప్రమాదాలకు అసలైన కారణాలను పరిష్కరించకుండా శిక్షలు పెంచితే ప్రమాదాలు తగ్గుతాయని చెప్పటం మోసగించడమేనని అనుభవం రుజువు చేస్తున్నది.

విచారణా విధానం

అమెరికా, బ్రిటన్ తదితర దేశాలలో రోడ్డు ప్రమాదాలపై ప్రాథమిక విచారణకు పోలీసులతో పాటు నిపుణుల కమిటీ ఉంటుంది. నిష్పక్షపాతంగా ప్రమాదాలకు వాస్తవ కారణాలు పరిశీలించాకే వాటి ఆధారంగా ఛార్జిషీటు దాఖలవుతుంది. కానీ మన దేశంలో పోలీసులు చెప్పిందే వేదం. గుడ్డిగా డ్రైవరే బాధ్యుడని ఛార్జిషీటు దాఖలవుతుంది. తదనుగుణంగా శిక్షలు ఉంటున్నాయి. వీటన్నిటిని వదిలివేసి కేవలం డ్రైవర్లను ముద్దాయిలను చేస్తే ప్రమాదాలు తగ్గవు. పైగా శిక్షలకు భయపడి డ్రైవర్ వృత్తికి రావడానికి అంగీకరించడం లేదు. ఇప్పటికే పెద్ద వాహనాలకు అవసరమైన డ్రైవర్లలో 30 శాతం తక్కువ డ్రైవర్లు ఉన్నారని ప్రభుత్వ గణాంకాలే తెలియజేస్తున్నాయి.

ప్రమాదాలకు అసలు కారణాలను పరిశీలించి, సమస్యను పరిష్కరించి ప్రజలలో రహదారి భద్రతా నియమాల పట్ల అవగాహన కల్పించడం మీద ప్రభుత్వం దృష్టి సారించాలి. అందుకు చైతన్యవంతమైన ప్రజలే ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి. అందుకు సిద్ధం కావాలి.

(వ్యాసకర్త ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి)

కవిత్వం



ఏం కొంటాం.. ఏమి తింటాం...!!

కొత్త బియ్యం రెక్కలు వచ్చి ఎగిరే
కందిపప్పు కనకంలా కనబడే
పప్పులు నిప్పులాగా తోస్తున్నాయి
పేదవారి బతుకులు రోట్లో రోకలి పోటులా ఉంది.
అల్లము నుంచి బెల్లం వరకు పరుగులే
కొండెక్కి కూర్చున్న కూరగాయలు
ఉప్పు పప్పు నూనెలు మండుతుంటే
అరకడుపులతో జీవితాలు సాగుతున్నాయి.
ఉల్లిగడ్డ తెల్లగడ్డ మార్కెట్లో మాయాజాలంతో
కూరగాయ సంచిలో బరువు తగ్గిపోయే
ఉత్పత్తి కొరతల్లో దళారుల దౌర్జన్యంతో
బడుగు జీవి బతుకుల్లో నిరాశ కమ్ముకొనే.
కూరగాయ దొరక్క ఊరగాయతో తింటూ
నోటి రుచికి తాళం వేసి బిగించారు
ధరల రాకెట్‌ను అందుకొనలేక పోతూ
నవ్వుల మొహాల్లో దు:ఖపు ఛాయలు కనిపించే.
ప్రకృతి అతివృష్టి అనావృష్టి చేస్తుంటే
అరకొర పంటలు పండుతుంటే
ప్రభుత్వాల కార్పొరేట్ విధానాలు ధరలు
సృష్టిస్తుంటే
సామాన్యుడి జేబులు చిల్లులు పడుతుండే.
సగటు జీవి సంసారపు చదరంగంలో
పెరుగుతున్న ఇంటి బడ్జెట్ పద్దుల చిట్టాలు
ఆదాయ వ్యయాల వ్యత్యాసాల బ్రతుకుల్లో
మధ్యతరగతి కుటుంబంలో వైకుంఠపాళి ఆటలే.

- కొప్పుల ప్రసాద్,
సెల్ : 9885066235

అమెరికా మూన్ ల్యాండర్ ప్రయోగం విఫలం



వాషింగ్టన్ : అమెరికా తాజాగా ప్రయోగించిన మూన్ ల్యాండర్ ప్రయోగం విఫలమయింది. అమెరికా ప్రైవేటు కంపెనీ ఆస్ట్రోబోటిక్ టెక్నాలజీ అభివృద్ధి చేసిన మూన్ ల్యాండర్ 'పెరిగ్రిన్'ను చంద్రునిపై ప్రయోగాలు కోసం సోమవారం ప్రయోగించారు. ఫ్లోరిడాలోని కేప్ కెనావెరల్ స్పేస్ ఫోర్స్ స్టేషన్ నుంచి సోమవారం ఉదయం జరిపిన ఈ ప్రయోగం విజయవంతం అయినప్పటికీ.. వ్యోమనౌక నుంచి విడిపోయిన కొద్దిసేపటికే 'పెరిగ్రిన్'లో సమస్యలు ప్రారంభమయ్యాయి. దీంతో చంద్రునిపై క్షేమంగా పెరిగ్రిన్ దిగలేకపోయింది. దీంతో అమెరికా నుంచి దాదాపు 50 ఏళ్ల తర్వాత చందమామపైకి ఒక ల్యాండర్ పంపాలని చేసిన ప్రయోగం విఫలమయింది. ఇంధన లీక్ కారణంగా వ్యోమనౌక కీలక ప్రొపెల్లెంట్‌ను కోల్పోయిందని ఆస్ట్రోబోటిక్ టెక్నాలజీ తెలిపింది. ఈ ల్యాండర్ కోసం 108 మిలియన్ డాలర్లకు ఆస్ట్రోబోటిక్‌తో.. అమెరికా అంతరిక్ష సంస్థ-నాసా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ వ్యోమనౌక ఎత్తు ఆరు అడుగులు. ఇందులో.. జాబిల్లిపై నీటి తీరుతెన్నులను శోధించే 'పెరిగ్రిన్ అయాన్ మాస్ స్పెక్ట్రోమీటర్' సహా పలు సైన్స్ పరికరాలు ఉన్నాయి. ఇంకా అనేక వస్తువులను భూమి నుంచి మోసుకెళ్లింది. వాటిలో.. ఎవరెస్టు పర్వతం నుంచి సేకరించిన రాతి తునక, చిన్న రోవర్లు, మెక్సికోకు చెందిన చక్రాల రోబోలు, వికీపీడియా ప్రతి, ఒక బిట్‌కాయిన్, కొన్ని ఫొటోలు, డ్రాయింగ్‌లు, ఆడియో రికార్డింగ్‌లు ఉన్నాయి. అమెరికా మాజీ అధ్యక్షులు జాన్ ఎఫ్ కెనెడీ, జార్జ్ వాషింగ్టన్, ఐజన్‌హోవర్, 'స్టార్ ట్రెక్' టీవీ ధారావాహిక సృష్టికర్త జీన్ రాడన్‌బెర్రీ, ప్రముఖ సైన్స్ కాల్పనిక సాహిత్య రచయిత ఆర్థర్ సి క్లార్క్‌కు సంబంధించిన అవశేషాలు, డీఎన్‌ఏనూ ఈ వ్యోమనౌక వెంట తీసుకెళ్లింది.

విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలి

- ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ



దీక్షలో కూర్చున్న విశాఖ స్టీల్‌ప్లాంట్ ఎంఎం, సిఆర్‌ఎంపి, సిఇడి, లూబ్రికెంట్ అండ్ హైడ్రాలిక్ విభాగ కార్మికులు

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ సభ్యులు వరసాల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన దీక్షలు మంగళవారం నాటికి 1062వ రోజుకు చేరాయి. ఈ దీక్షలో విశాఖ స్టీల్‌ప్లాంట్ ఎంఎం, సిఆర్‌ఎంపి, సిఇడి, లూబ్రికెంట్ అండ్ హైడ్రాలిక్ విభాగ కార్మికులు కూర్చున్నారు. దీక్షలనుద్దేశించి వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. జిందాల్ ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కుపై కనీసం స్పందించని రాష్ట్ర రాజకీయ పార్టీలకు వచ్చే ఎన్నికల్లో ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఉన్న శాసనసభ స్థానాల్లో రిటైర్డ్ అయిన ఉక్కు కార్మికులను పోటీ పెడతామని, ఓట్లు చీల్చడం ద్వారా ప్రధాన పార్టీలకు గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి స్పందించి విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలో కొనసాగాలే కృషిచేయాలని కోరారు.

ముందస్తు బెయిల్ కోరుతూ ఐపిఎస్ పిటిషన్

ప్రజాశక్తి-అమరావతి

గుంటూరు జిల్లా, మంగళగిరి పట్టణ పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ అదనపు డిజిపి (రహదారి భద్రత) కృపానంద్ త్రిపాఠి ఉజేలా (ఐపిఎస్) దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం హైకోర్టు విచారణ జరిపింది. పిటిషనర్ డిజిపి కాకుండా అడ్డుకునేందుకే కేసు బనాయించారని సీనియర్ న్యాయవాది బి ఆదినారాయణరావు వాదించారు. అరెస్టు చేసే అవకాశం ఉన్నందున బెయిల్ మంజూరు చేయాలని కోరారు. హోంగార్డు ఉద్యోగం ఇప్పిస్తామని మోసం చేశారనే కేసులో 8వ నిందితుడిగా పేర్కొన్నట్లు పోలీసులు కౌంటర్‌లో పేర్కొన్నారు. పోలీసుల వాదనల నిమిత్తం విచారణను బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ టి మల్లికార్జునరావు ప్రకటించారు.

ఓటర్ల లిస్టులోంచి పిటిషనర్లను తొలగించొద్దు : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గంలో ఫారం-7లు దాఖలు చేసి ఓటును తొలగించేందుకు ప్రయత్నాలను అడ్డుకోవాలంటూ దాఖలైన కేసులో హైకోర్టు స్పందించింది. తుది ఓటరు జాబితా నుంచి పిటిషనర్ల పేర్లను తొలగించొద్దని మధ్యంతర ఆదేశాలిచ్చింది. అసెంబ్లీ నియోజకవర్గం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ తీరును తప్పుపట్టింది. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 22 ప్రకారం సవరించిన ఓటర్ల లిస్ట్‌పై తేదీ లేకపోవడాన్ని ఆక్షేపించింది. విచారణను ఫిబ్రవరి 2కు వాయిదా వేస్తూ జస్టిస్ ఎన్ జయసూర్య మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పర్చూరు మండలం తిమ్మరాజుపాలెం గ్రామానికి చెందిన బి గౌతమి సహా 11 మంది రిట్లు దాఖలు చేశారు. అధికార వైసిపి చెప్పినట్లుగా ఓట్ల నమోదు జరుగుతోందని, తమ పేర్లను తొలగిస్తున్నారని పిటిషనరు వాదించారు.

ఖాళీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

- త్వరితగతిన వసతి భవనాల నిర్మాణం
- ఆర్‌జియుకెటి ఛాన్సలర్ కె.సి రెడ్డి

ప్రజాశక్తి - ఎచ్చెర్ల (శ్రీకాకుళం)

కాంట్రాక్టు పద్ధతిలో ఖాళీగా ఉన్న 190 అసిస్టెంట్ ప్రొఫెసర్లు, లెక్చరర్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆర్‌జియుకెటి ఛాన్సలర్ కె.సి రెడ్డి తెలిపారు. మండలంలోని ఎస్ఎంపురంలో గల ట్రిపుల్ ఐటిని మంగళవారం సందర్శించారు. మౌలిక సదుపాయాలను పరిశీలించి, చేపడుతున్న పనులపై ఆరా తీశారు. వసతి భవనాల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల నాణ్యతలో ఎటువంటి రాజీ పడొద్దని సూచించారు. మౌలిక వసతుల విషయంలో ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. వచ్చే ఏడాదికి మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులను నూజివీడు నుంచి శ్రీకాకుళం వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్లేస్‌మెంట్ డ్రైవ్ కోసం ఫైనల్ ఇయర్ విద్యార్థులకు శిక్షణ ఇస్తామన్నారు. నాక్ బిం గ్రేడ్ వచ్చిందని ఎ గ్రేడ్ వచ్చే విధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ట్రిపుల్ ఐటి డైరెక్టర్ కె.వెంకటగోపాల ధనబాలాజీ, ఒఎస్‌డి సుధాకర్‌బాబు, పరిపాలనాధికారి ముని రామకృష్ణ, డీన్ మోహనకృష్ణ చౌదరి, ఎఫ్ఒ అసిరినాయుడు, వెల్ఫేర్ డీన్ రవి, డిఇ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రెజిల్‌లో ఘోర ప్రమాదం

- 25 మంది మృతి

బ్రెజిలియా : బ్రెజిల్‌లో ఘోర ప్రమాదం జరిగింది. సోమవారం రాత్రి బ్రెజిల్‌లోని ఈశాన్య రాష్ట్రమైన లోతట్టు బహియాలోని నోవా ఫాతిమా గవియావో నగరాల మధ్య ఫెడరల్ రహదారిపై టూరిస్ట్ బస్సు అదుపుతప్పి ట్రక్కును ఢీకొట్టడంతో దాదాపు 25మంది మృతి చెందారు. ఈ ప్రమాదంలో మరో ఆరుగురు గాయపడినట్లు స్థానిక అధికారులు తెలిపారు. ఈ ప్రమాదం గురించి స్థానిక అగ్నిమాపక శాఖ అవుట్‌పోస్ట్ ఒక ప్రకటనలో పేర్కొంది. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రులకు తరలించినట్లు అధికారులు తెలిపారు. చాలా మంది బాధితులు మినీ బస్సులో ఉన్నారని బహియా సివిల్ పోలీసులు వెల్లడించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అటవీ హక్కుల చట్టం పకడ్బందీగా అమలు

- జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యులు అనంత నాయక్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, మెళియాపుట్టి

గిరిజన సంక్షేమానికి అంకితభావంతో పనిచేసి, వారి జీవితాల్లో వెలుగులు నింపాలని జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యులు అనంత నాయక్ అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో మంగళవారం సమీక్షించారు. అటవీ హక్కుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. గిరిజనులే అడవికి హక్కుదారులనే విషయంపై వారికి అవగాహన కల్పించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర సంక్షేమ పథకాలు, చట్టాలు, పాలసీల ద్వారా కల్పించిన హక్కులపై గిరిజనులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. గిరిజనుల సమస్యలను క్షేత్రస్థాయి సిబ్బంది తెలుసుకుని త్వరితగతిని వారికి న్యాయం చేయాలన్నారు. జిల్లాలో భూమి లేని ఎస్‌టి వ్యవసాయ కూలీల వివరాలు తమకు అందించాలని సూచించారు. గిరిజనాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ వివరించారు. సమావేశంలో ఎస్‌టి కమిషన్ డైరెక్టర్ జయంత్ జె.సరోడే, ప్రతినిధి బృందం రాధాకాంత త్రిపాఠి, గోవర్ధన్ ముండే, పి. కె.పరీదా, దీనబంధు నాయక్, సీతంపేట ఐటిడిఎ పిఒ కల్పనా కుమారి, ఎఎస్‌పి జె.తిప్పేస్వామి, ఆర్‌డిఒలు సిహెచ్.రంగయ్య, భరత్ నాయక్, ప్రత్యేక ఉప కలెక్టర్ జయదేవి, డిఆర్‌డిఎ పీడీ డి.విద్యాసాగర్, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్ తదితరులు పాల్గొన్నారు. తొలుత మెళియాపుట్టిలో నూతనంగా నిర్మిస్తున్న ఏకలవ్య పాఠశాల భవన నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు ఆలస్యం కావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నెల రోజుల్లో నిర్మాణ పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. పోలూరు వద్ద గ్రానైట్లతో పొల్యూషన్ బారిన పడుతున్నామని, గిరిజన గ్రామాల్లో రహదారులు అధ్వానంగా ఉన్నాయని గిరిజన సంఘ నాయకులు వాబ యోగి తదితరులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, తహశీల్దార్ పి.సరోజని తదితరులు పాల్గొన్నారు.

గత 24 గంటల్లో 475 కేసులు : ఆరుగురు మృతి

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా కరోనా విజృంభిస్తోంది. గడచిన 24 గంటల్లో దేశవ్యాప్తంగా 475 కొత్త కరోనా కేసులు నమోదైనట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశఖ మంగళవారం వెల్లడించింది. అత్యధికంగా కర్ణాటకలో సోమవారం 279 కరోనా కేసులు నమోదయ్యాయి. మహారాష్ట్రలో 61, కేరళలో 54 కేసులు వెలుగులోకి వచ్చినట్లు కేంద్ర ఆరోగ్యశాఖ పేర్కొంది. కరోనా వల్ల సోమవారం ఒక్కరోజే ఆరుగురు మరణించారు. కర్ణాటకలో ముగ్గురు, చత్తీస్‌గఢ్‌లో ఇద్దరు, అస్సాంలో ఒకరు కరోనా వైరస్‌కి బలయ్యారు. దీంతో కరోనా ప్రారంభం నుంచి ఇప్పటివరకు మరణించిన వారి సంఖ్య 5,33,402కి చేరింది.

వాగులో పడి ఇద్దరు డిగ్రీ విద్యార్థుల మృతి

ప్రజాశక్తి-రంపచోడవరం (అల్లూరి సీతారామరాజు జిల్లా)

అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మండలంలోని ఐ.పోలవరం గ్రామ సమీపంలోని సీతపల్లి వాగులో పడి ఇద్దరు డిగ్రీ విద్యార్థులు మృతి చెందారు. వీరు రాజమండ్రి వారుగా పోలీసులు గుర్తించారు. పోలీసుల కథనం ప్రకారం.... రాజమండ్రి ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న నలుగురు విద్యార్థులు రాజమండ్రి నుండి రంపచోడవరం మండలం ఐ.పోలవరంకు విహార యాత్రకు వచ్చారు. పోలవరం సమీపంలోని సీతపల్లి వాగు వద్ద ప్రమాదవశాత్తు మహమ్మద్ జబ్బీర్ (18) సుభర్జిని (18) వాగులో పడి గల్లంతయ్యారు. దీనిని గమనించిన మరో ఇద్దరు మిత్రులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో హుటాహుటిన సంఘటనా స్థలానికి సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యాన పోలీసులు సమీప గ్రామంలోని ఈతగాళ్ల సహాయంతో మతదేహాలను వెలికి తీసేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. కొద్దిసేపటికి ఇద్దరి మృతదేహాలను వెలికి తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తహశీల్దార్ కార్యాలయం ఎదుట మహిళా రైతు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి ముదిగుబ్బ (సత్యసాయి జిల్లా)

తనకు ప్రభుత్వం అందించిన భూమిని ఇతరుల పేరిట నమోదు చేశారని తమకు న్యాయం చేయాలని ఓ మహిళా రైతు మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చుట్టుప్రక్కల వారు సకాలంలో స్పందించి ఆమెను రక్షించారు. ఈ ఘటనకు సంబందించి బాధితులు, స్థానికులు తెలిపిన వివరాలు... ముదిగుబ్బ మండలం కొడవండ్లపల్లి గ్రామానికి చెందిన చింతలరాయుడుకు ఐదు ఎకరాల డి పట్టా భూమికి గతంలో ప్రభుత్వం పట్టా మంజూరు చేసింది. అప్పటి నుంచి ఆ కుటుంబం ఆ భూమిని సాగుచేసుకుంటూ జీవనం చేస్తోంది. కాలక్రమేణ చింతలరాయుడు కుమారుడు నారాయణస్వామి, కోడలు ఆదిలక్ష్మి ఆ భూమిని సాగు చేసుకుని జీవనం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కొన్ని సంవత్సరాల క్రితం జీవనోపాధి నిమిత్తం నారాయణస్వామి, ఆదిలక్ష్మి వలస వెళ్లారు. ఆ సమయంలో ఆ భూమిని అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తి తన పేరిట రికార్డులలో నమోదు చేయించుకున్నాడు. విషయం తెలుసుకున్న నారాయణస్వామి, ఆదిలక్ష్మి సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి తిరిగి ఆ భూమిని తమ పేరుమీద నమోదు చేయించుకున్నారు. ఇలాగే మరోసారి కూడా ఆ వ్యక్తి తన పేరిట భూమిని నమోదు చేయించుకోవటంతో తిరిగి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి ఆ పేరు తొలగింపజేయించుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం మూడవసారి తమ భూమిని అదే వ్యక్తి పేరిట నమోదు చేయడంతో బాధితులు స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి మంగళవారం వచ్చారు. ఈసందర్భంగా బాధితులు మాట్లాడుతూ ఎిక్కడి అధికారులు సక్రమంగా స్పందించకపోవడంతో తన భార్య ఆందోళనతో ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని బాధితుడు నారాయణస్వామి తెలిపారు. తాము ఫిర్యాదు చేసిన సమయంలో తొలగించడం కొద్ది కాలానికి తిరిగి నమోదు చేయడం లాంటివి చేస్తున్నారని విమర్శించారు. భూమికి సంబంధించిన అన్ని ఆధారాలు తమ వద్ద ఉన్నాయని అన్నారు. ఎలాంటి ఆధారం లేని వ్యక్తి పేరును పదేపదే రికార్డులలో నమోదు చేస్తున్నారని విమర్శించారు. సంబంధిత భూమి ఎవరికి చెందినదో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తమకు న్యాయం చేయాలని కోరారు, ఈ విషయంపై తహశీల్దార్ నాగేంద్రను వివరణ కోరగా వెంగముని అనే వ్యక్తి ఆన్లైన్లో భూమి మ్యూటేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. ఈ విషయం తమ దృష్టికి రాలేదని అన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఈ విషయమై సమగ్ర నివేదిక అందించాలని అధికారులను ఆదేశించామన్నారు. భూమి యజమానిని గుర్తించి వారికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

హిందూపురంలో రాజకీయ వేడి..!

- సమావేశాలతో మంత్రి పెద్దిరెడ్డి, ఎమ్మెల్యే బాలకృష్ణ బిజీబిజీ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురంలో రాజకీయ వేడి మొదలైంది. అధికార, ప్రతిపక్ష పార్టీలు సమావేశాలు, బహిరంగ సభలతో ఎన్నికల కాకను పుట్టిస్తున్నారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ మూడో రోజు నాడు మంగళవారం టిడిపి నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. మరో వైపు రెండో రోజు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హిందూపురం రూరల్ మండలంలోని ఏడు పంచాయతీల పరిధిలోని నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. మంత్రి పెద్దిరెడ్డి, ఎమ్మెల్యే బాలకృష్ణ ఒకే సారి హిందూపురంపై దృష్టి సారించారు. వైనాట్ హిందూపురం టార్గెట్తో పెద్దిరెడ్డి ఆపరేషన్ మొదలు పెట్టారు. మూడోసారి గెలిచి హ్యాట్రిక్ కొట్టాలన్న లక్షంతో నియోజకవర్గంలో బాలకృష్ణ పర్యటిస్తున్నారు. హిందూపురం ఉమ్మడి అనంతపురం జిల్లాలో పొలిటికల్ హాట్స్పాట్గా మారింది. నాలుగు దశాబ్దాలుగా టీడీపీకి కంచుకోటగా ఉన్న హిందూపురంలో బాలయ్యకు పోటీగా తెరపైకి దీపికా రెడ్డిని వైసిపి తీసుకొచ్చింది. తీసుకురావడమే కాదు బోణీ కొడుతామంటూ మిషన్ హిందూపూర్ పేరుతో రాజకీయ కార్యచరణ ప్రారంభించారు. సీఎం జగన్ ఆదేశాలతో మిషన్ హిందూపూర్ బాధ్యతలను మంత్రి పెద్దారెడ్డి భుజానికెత్తు కున్నారు. వ్యూహాత్మకంగా దీపికరెడ్డిని తెరపైకి తీసుకొచ్చారాయన. ఆమెతో పాటు ఇటీవల ప్రకటించిన హిందూపురం పార్లమెంట్ ఇన్ఛార్జి శాంతమ్మతో కలిసి ప్రజల్లోకి వెళ్తున్నారు. ప్రతి గ్రామ పంచాయితీకి వెళ్లి సమావేశాలను ఏర్పాటు చేసి అందరికీ వారిద్దరినీ పరిచయం చేస్తున్నారు. మరోవైపు హిందూపురంలో టీడీపీ సందడి కూడా పెరిగింది. హ్యాట్రిక్ పక్కా అన్న ధీమాతో ఆ పార్టీ నేతలు ముందుకెళ్తున్నారు. ఎమ్మెల్యే బాలయ్య హిందూపురంపై ఫోకస్ పెట్టి ఆ పార్టీ నేతలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. మరో రెండు రోజులపాటు హిందూపురంలోనే ఆయన మకాం వేయనున్నారు ఇద్దరి నేతలు సమావేశాలు నిర్వహిస్తూనే నాయకులను పక్క పార్టీ వైపు వెళ్లకుండా నిలువరించే ప్రయత్నం చేస్తున్నారు.



లండన్‌లో గాంధీజీకి రాజ్‌నాథ్ నివాళి

లండన్ : కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఇంగ్లండ్‌లో పర్యటిస్తున్నారు. మంగళవారం లండన్ చేరుకున్న ఆయన తవిస్టాక్ స్క్వేర్ వద్ద ఉన్న మహాత్మాగాంధీ విగ్రహనికి నివాళు లర్పించారు. ఇంగ్లండ్‌లో ఆయన బుధవారం కూడా పర్యటించనున్నారు. గాంధీజీకి నివాళు లర్పించిన అనంతరం రాజ్‌నాథ్ సింగ్ బ్రిటన్ రక్షణ మంత్రి గ్రాంట్ షాప్స్‌తో చర్చలు జరిపారు. క్యాడెట్ మార్పిడి కార్యక్రమం కోసం అవగాహన ఒప్పందం (ఎంఓయు)పైన, అలాగే రక్షణ పరిశోధన, అభివృద్ధికి సంబంధించిన పరస్పర సహకారానికి ఉద్దేశించిన ఒప్పందాలపైనా ఇరువురు సంతకాలు చేశారు. గ్రాంట్ షాప్స్‌తో చర్చలు ఫలవంతంగా జరిగాయని భేటీ అనంతరం రాజ్‌నాథ్ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. భారత రక్షణ మంత్రి ఇంగ్లండ్‌లో పర్యటించడం 22 ఏళ్ల తరువాత ఇదే తొలిసారి. 2002లో అప్పటి రక్షణ మంత్రి జార్జ్ ఫెర్నాండెజ్ చివరిసారిగా ఇంగ్లండ్‌లో పర్యటించారు.

రైల్వే కేసులో లాలూ కుటుంబ సభ్యులపై ఇడి చార్జిషీట్

న్యూఢిల్లీ : రైల్వే నియామకాల్లో అక్రమాలకు సంబంధించిన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) తొలి చార్జిషీట్‌ను బుధవారం కోర్టులో సమర్పించింది. ఈ కేసులో ఆర్‌జెడి చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ భార్య, బీహార్ మాజీ ముఖ్యమంత్రి రబ్రీ దేవి, కుమార్తెలు మిసా భారతి, హేమ యాదవ్, కుటుంబ సన్నిహితుడు అమిత్ కత్యాల్‌తో సహా మొత్తం ఏడుగురి పేర్లను నిందితులుగా పేర్కొంది. అనుబంధాలతో సహా 4,700 పేజీలతో ఉన్న ఈ చార్జిషీట్‌ను ఢిల్లీలోని స్పెషల్ ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్ (పిఎంఎల్ఎ) కోర్టులో బుధవారం ఇడి సమర్పించింది. ఇదే రోజున చార్జిషీట్, డ్యాక్యుమెంట్ల ఇ-కాపీని కూడా దాఖలు చేయాలని ఇడిని ప్రత్యేక జడ్జి విశాల్ గోగ్నే ఆదేశించారు. విచారణను ఈ నెల 16కు లిస్ట్ చేశారు. కాగా, ఇదే కేసులో ఇడి ఇప్పటికే గత ఏడాది నవంబర్‌లో కత్యాల్‌ను అరెస్టు చేసింది. లాలూ ప్రసాద్ యాదవ్‌కు సమన్లు పంపినా ఇంకా విచారించలేదు. అయితే లాలూ కుమారుడు తేజస్వీయాదవ్‌ను ఒకసారి విచారించింది. రబ్రీదేవి, మిసా భారతి, చాంద్ యాదవ్, రాగాణి యాదవ్‌లను కూడా విచారించింది. 2004 నుంచి 2009 వరకూ లాలూ కేంద్ర రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో ఈ స్కామ్ జరిగిందని ఇడి ఆరోపిస్తోంది. రైల్వేల్లో ఉద్యోగాల కోసం అభ్యర్థుల నుంచి లాలూ కుటుంబ సభ్యులు భూమిని డిమాండ్ చేశారని ఇడి తన చార్జిషీట్‌లో పేర్కొంది.

అప్రూవర్‌గా మారేందుకు అమిత్‌కు అనుమతి

న్యూఢిల్లీ : న్యూస్‌క్లిక్‌పై ఉపా కేసులో అప్రూవర్‌గా మారడానికి ఆ సంస్థ హెచ్ఆర్ చీఫ్ అమిత్ చక్రవర్తికి ఢిల్లీ కోర్టు మంగళవారం అనుమతించింది. అప్రూవర్‌గా మారడానికి అనుమతించాలని కోరుతూ అమిత్ చక్రవర్తి దాఖలు చేసిన పిటీషన్‌ను ప్రత్యేక కోర్టు జడ్జి హర్దీప్ కౌర్ విచారించారు. చక్రవర్తికి అనుమతి ఇచ్చారు. ఈ కేసులో న్యూస్‌క్లిక్ ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థను, అమిత్ చక్రవర్తిని అక్టోబర్ 3న ఢిల్లీ పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం వీరిద్దరూ జ్యూడిషియల్ కస్టడీలో ఉన్నారు.

ఖైదీల ములాఖత్‌పై పరిమితిని సమర్థించిన సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ : కారాగాల్లో శిక్ష లేదా రిమాండ్ కోసం బంధీగా ఉన్న ఖైదీలను కలవడం (ములాఖత్)పై పరిమితి విధిస్తూ ఢిల్లీ హైకోర్టు గతేడాది ఫిబ్రవరి 16న తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. ఖైదీలతో మాట్లాడేందుకు పరిమితులు లేకుండా ములాఖత్‌కు అవకాశం కల్పించాలని, ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులను కొట్టివేయాలని కోరుతూ న్యాయవాది జై అనంత్ దేహద్రాయ్ దాఖలు చేసిన పిటిషన్‌లో సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. జైళ్లలో ఉన్న ఖైదీలను వారి కుటుంబ సభ్యులు, స్నేహితులు, న్యాయ సలహాదారులు వారానికి రెండుసార్లు మించి కలవరాదంటూ ఇటీవల ఢిల్లీ హైకోర్టు నిర్ణయాన్ని వెలువరించింది. ఇది విధానపరమైన నిర్ణయమైనందన దీంట్లో తాము జోక్యం చేసుకోవాలనుకోవడం లేదని జస్టిస్ బెలా ఎం త్రివేది, జస్టిస్ పంకజ్ మిథాల్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం మంగళవారం స్పష్టం చేసింది. జైళ్లలోని ఖైదీల సంఖ్యను, సౌకర్యాలను పరిగణనలోకి తీసుకునే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోందని, ఇది ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయం కాదని, వేధింపుల కింద కూడా పరిగణించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

నేటి నుంచి కిసాన్-మజ్దూర్ జన జాగరణ్

- 26న దేశవ్యాప్తంగా ట్రాక్టర్స్ మార్చ్
- సంయుక్త కిసాన్ మోర్చా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కిసాన్-మజ్దూర్ జన జాగరణ్ ప్రచారానికి రైతు కార్మిక సంఘాల ఐక్య వేదిక సిద్ధమైంది. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) జన జాగరణ్ ప్రచారానికి కరపత్రాన్ని మంగళవారం నాడిక్కడ విడుదల చేసింది. జన జాగరణ్ క్యాంపెయిన్ దేశవ్యాప్తంగా అన్ని ఎస్‌కెఎం సంఘాలతో బుధవారం ప్రారంభమవుతుంది. ఈ నెల 20 వరకు కొనసాగనుంది. కరపత్రం, బుక్లెట్ అన్ని ప్రాంతీయ భాషల్లోకి అనువధించనున్నట్లు ఎస్‌కెఎం నేతలు తెలిపారు.

'దేశంలో కొనసాగుతున్న వ్యవసాయ సంక్షోభం రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు, యువతను ఎలా ప్రభావితం చేస్తుందో ప్రచారంలో వివరిస్తుంది. వ్యవసాయ సంక్షోభాన్ని అధిగమించడానికి, రైతులు, కార్మికులకు మరింత ఆదాయం, స్థిరమైన ఉపాధిని నిర్ధారించడానికి, కార్పొరేట్ లాభదాయకత, దోపిడీని నిరోధించడానికి ఉపాధి, కనీస వేతనంతో కార్మికులకు తగిన ఆదాయం, రైతులకు కనీస మద్దతు కోసం ప్రత్యామ్నాయ అభివృద్ధి విధానాన్ని అవలంభించడం వంటి ప్రాముఖ్యతను ప్రచారం వివరిస్తుంది' అని తెలిపారు.

'ఎస్‌కెఎం కార్యకర్తలు గ్రామాలు, పట్టణాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచార ప్రతులను పంపిణీ చేస్తారు. మొట్టమొదటి అఖిల భారత సదస్సులో ఆమోదించిన డిమాండ్ల చార్టర్‌లో రైతులు, కార్మికుల కాంక్రీట్ డిమాండ్ల సాధన కోసం జరిగే పోరాటంలో భారీ మద్దతు, భాగస్వామ్యాన్ని కోరుతారు. దేశంలోని 30.4 కోట్ల కుటుంబాల్లో 40 శాతం మందిని కవర్ చేయాలనే లక్ష్యంతో ఈ ప్రచారం ఉంది. కార్పొరేట్ ఆధారిత అభివృద్ధి, తలసరి ఆదాయం క్షీణించడం, పెరుగుతున్న ఆదాయ అసమానతలు, రైతులకు కనీస మద్దతు ధర, కార్మికులకు కనీస వేతనం వంటి వాటితోపాటు ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలు, దోపిడీ గురించి మోడీ ప్రభుత్వాల కథనాన్ని ఈ ప్రచారం బహిర్గతం చేస్తుంది' అని తెలిపారు.

'జన జాగరణ్ క్యాంపెయిన్‌లో చేరాలని ఎస్‌కెఎం, కేంద్ర కార్మిక సంఘాలు నిర్ణయించాయి. ప్రచారాన్ని సిద్ధం చేసేందుకు రాష్ట్ర స్థాయి సమన్వయ కమిటీ సమావేశాలు జరుగుతున్నాయి. ఈ ప్రచారం జనవరి 26న దేశ వ్యాప్తంగా జిల్లా స్థాయిలో జరిగే ట్రాక్టర్/వాహన కవాతులో కుటుంబ సభ్యులతోపాటు రైతులు, కార్మికులు పాల్గొనేలా చేస్తుంది' అని పేర్కొన్నారు.

ఎంత ధైర్యం ?

- మోడీపై పూరీ శంకరాచార్య ఆగ్రహం
- రాముడిని ఆయన తాకడం చూడలేను
- అయోధ్యకు వెళ్లను

రత్లాం : పూరీ శంకరాచార్య స్వామి నిశ్చలానంద సరస్వతి ప్రధాని నరేంద్ర మోడీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయోధ్యలో రామమందిర ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించడానికి ఆయనకు ఎంత ధైర్యమని నిలదీశారు. అసలు రాముడిని తాకే అధికారం మోడీకి లేదని స్పష్టం చేశారు. తన వంటి ఆధ్యాత్మిక గురువుకే ఆ అధికారం ఉంటుందని తెలిపారు. ప్రాణప్రతిష్ట కార్యక్రమానికి హాజరయ్యే ఆహ్వానితుల సంఖ్యపై పరిమితులు విధించడాన్ని ఆయన తప్పుపట్టారు.

'నేను, నాతో పాటు మరో సహాయకుడు మాత్రమే రావాలని ఆహ్వానించారు. అంతకుమించి మమ్మల్ని ఎవరూ వ్యక్తిగతంగా సంప్రదించలేదు. అందుకే నేను ఈ కార్యక్రమానికి హాజరు కావడం లేదు' అని శంకరాచార్య తెలిపారు. 'నేను రామమందిరానికి వెళ్లడం లేదు. ఆ కార్యక్రమంలో భాగస్వామిని కావాలని కూడా అనుకోవడం లేదు. రాముడి విగ్రహాన్ని మోడీ తాకుతుంటే నేను ఎందుకు కరతాళధ్వనులు చేయాలి? జై జై అంటూ నినాదాలు చేయాలి? అలాంటి కార్యక్రమాలకు నేను ఎందుకు పోవాలి?' అని ప్రశ్నించారు. దేశంలో ప్రస్తుత రాజకీయాలు సరిగా లేవని పూరీ శంకరాచార్య వ్యాఖ్యానించారు.



పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగస్వామికి వినతి పత్రం అందచేస్తున్న సిపిఎం నాయకులు

ప్రీ పెయిడ్ మీటర్లు వద్దు

- విద్యుత్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పుదుచ్చేరిలో భారీ ర్యాలీ

పుదుచ్చేరి : విద్యుత్ వినియోగానికి ప్రీ పెయిడ్ మీటర్లను పెట్టాలని పుదుచ్చేరి ప్రభుత్వం చేస్తున్న కసరత్తును వ్యతిరేకిస్తూ 'చలో సెక్రటేరియట్' పేరుతో సిపిఎం సోమవారం భారీ ర్యాలీ చేపట్టింది. సిపిఎం పుదుచ్చేరి రాష్ట్ర కార్యదర్శి రాజనగం ఈ ర్యాలీకి నేతృత్వం వహించగా, పొలిట్‌బ్యూరో సభ్యులు జి రామకృష్ణ, కన్నూర్ జిల్లా కార్యదర్శి ఎంవి జయరాజన్ తదితర నాయకులు పాల్గొన్నారు. విద్యుత్ రంగంలో ప్రయివేటీకరణ చర్యలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి ముఖ్యమంత్రి ఎన్ రంగస్వామిని కలిసి వినతిపత్రం అందజేశారు. తక్షణమే ప్రీ పెయిడ్ మీటర్ల ప్రణాళికలను విరమించుకోవాలని, విద్యుత్ ప్రయివేటీకరణ చర్యలు మానుకోవాలని కోరారు. పుదుచ్చేరి, మహే, కారైక్కల్, యానాం ప్రజలకు అందుబాటులో రేషన్ దుకాణాలు తెరవాలని, సబ్సీడీపై ఆహారాన్ని అందించాలని కోరారు.

ఫ్రాన్స్ కొత్త ప్రధానిగా గాబ్రియెల్



పారిస్ : ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్ 34 ఏళ్ల విద్యా శాఖ మంత్రి గాబ్రియెల్ అట్టల్ ను దేశ కొత్త ప్రధానిగా నియమించారు. జూన్‌లో యూరోపియన్ యూనియన్ పార్లమెంటు ఎన్నికలు జరగనున్న తరుణంలో ఆయన ఈ చర్య తీసుకోవడం గమనార్హం. మాక్రాన్ ప్రభుత్వం తీసుకొచ్చిన వివాదాస్పదమైన కొత్త పింఛను విధానం, వలస వ్యతిరేక చట్టాలపై ఫ్రెంచి ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ వీధుల్లోకి వచ్చారు. మాక్రాన్ ప్రభుత్వం ఎంతగా అప్రతిష్టపాలవ్వాలో అంతగా అయింది. మాక్రాన్ ప్రభుత్వంపై వ్యతిరేకతను సొమ్ము చేసుకుని పచ్చి మితవాద మెరిలిన్ లీపెన్స్ పార్టీ ముందుకొస్తున్నది. ఇటీవల నిర్వహించిన ఒక సర్వేలో లీపెన్స్ పార్టీ కన్నా మాక్రాన్ పార్టీ 10 పాయింట్ల తేడాతో వెనకబడి ఉంది. మాక్రాన్‌కు సన్నిహితుడైన అట్టల్ కోవిడ్ సమయంలో ప్రభుత్వ ప్రతినిధిగా వ్యవహరించారు. ఆ రకంగా దేశమంతా ఇంటింట చిరపరిచితమైన యువ నేత. పదవి నుండి వైదొలగుతున్న ఎలిజబెత్ బార్న్ స్థానంలో బాధ్యతలు చేపట్టనున్నారు.. ప్రధానిని మార్చడం వల్ల పెద్దగా మాక్రాన్ గ్రాఫ్ పెరిగే పరిస్థితి ఏమీ లేదని ప్రతిపక్షాలు వ్యాఖ్యానించాయి. బార్న్ అయినా అట్టల్ అయినా దొందూ దొందేనని పేర్కొన్నాయి.


శివసేన (యుటిబి) ఎమ్మెల్యే నివాసంపై ఇడి దాడులు

ముంబయి : శివసేన (యుబిటి) ఎమ్మెల్యే రవీంద్ర వైకర్, అనుబంధ సంస్థలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) దాడులు జరిపింది. మంగళవారం ఉదయం నుండి ముంబయిలోని ఏడు ప్రాంతాల్లో సోదాలు చేపట్టింది. జోగేశ్వరీ ప్రాంతంలో లగ్జరీ హోటల్ నిర్మాణంలో అక్రమాలకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఈ దాడులు జరుగుతున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. ఉద్ధవ్ బాలాసాహెబ్ థాకరే వర్గానికి చెందిన శివసేన ఎమ్మెల్యే, మహారాష్ట్ర అసెంబ్లీలో జోగేశ్వరి తూర్పు నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

హసీనాకు అభినందనల వెల్లువ

- ఆసియన్, ఆఫ్రికన్, లాటిన్ అమెరికన్ నేతల సౌహార్ధ సందేశాలు
- ఎన్నికల్లో అక్రమాలు జరిగాయంటూ అమెరికా, బ్రిటన్ యాగీ

ఢాకా: బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాని షేక్ హసీనా నాల్గోసారి ఘన విజయం సాధించినందుకు అమెను ఆసియన్, ఆఫ్రికన్, లాటిన్ అమెరికా దేశాల అధినేతలు అభినందనలు తెలిపారు. హసీనా విజయాన్ని జీర్ణించుకోలేని అమెరికా, బ్రిటన్ దేశాలు ఈ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయంటూ యాగీ చేయడం మొదలెట్టాయి. ప్రజాస్వామ్యాన్ని, మానవ హక్కులను పరిరక్షించేందుకు ప్రభుత్వం నిబద్ధతతో వ్యవహరించాలని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల చీఫ్ వోల్కర్ టర్క్ కొత్త ప్రభుత్వాన్ని కోరారు. అమెరికా విదేశాంగ శాఖ మంగళవారం ఒక ప్రకటన చేస్తూ, వేలాదిమంది ప్రతిపక్ష సభ్యులను అరెస్టు చేశారని, ఎన్నికల రోజున పెద్ద ఎత్తున అవకతవకలు జరిగినట్లు వార్తలందాయని ఆందోళన వ్యక్తం చేసింది. అన్ని పక్షాలు ఎన్నికల ప్రక్రియలో పాల్గొననందున ఈ ఎన్నికలు సక్రమంగా జరగలేదని ఆ ప్రకటనలో పేర్కొంది. హింస, అవకతవకల వార్తలపై బంగ్లాదేశ్ ప్రభుత్వం దర్యాప్తు జరిపించాలని, బాధ్యులను జవాబుదారీ చేయాలని కోరింది. బిఎన్‌పి నేత బేగం ఖలీదా జియా కుమారునికి ఆశ్రయం కల్పిస్తున్న బ్రిటన్ కూడా ఇదే పాట పాడింది.



షేక్ హసినాకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందలు తెలుపుతున్న భారత హైకమిషనర్ ప్రణయ్ వర్మ

ఇమ్రాన్ ఖాన్ మరోసారి అరెస్టు



ఇస్లామాబాద్ : ఇప్పటికే జైలులో ఉన్న పాకిస్తాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్‌ఖాన్ ను పోలీసులు మంగళవారం మరోసారి అరెస్టు చేశారు. సైఫర్ కేసులో ఇమ్రాన్ ఖాన్‌కు రిలీజ్ వారెంట్ జారీ అయ్యింది. ఆ తరువాత కొన్ని గంటల వ్యవధిలోనే గత ఏడాది రావల్పిండిలోని ఆర్మీ ప్రధాన కార్యాలయంపై దాడి కేసులో ఇమ్రాన్‌ఖాన్‌ను అరెస్టు చేశారు. ఆర్మీ ప్రధాన కార్యాలయంపై దాడి కేసులో మంగళవారం నాడు ఉగ్రవాద నిరోధక కోర్టు (ఎటిసి) సమన్లు జారీ చేసింది. భద్రతా కారణాల రీత్యా ఇమ్రాన్‌ఖాన్‌ను వీడియో లింక్ ద్వారా కోర్టు ముందు విచారణకు జైలు అధికారులు హాజరుపర్చారు. అడియాలా జైలులో ఇమ్రాన్‌ఖాన్‌ను విచారించాలని జడ్జి పోలీసుల్ని ఆదేశించారు. సైఫర్ కేసులో ఇమ్రాన్ ఖాన్‌కు రిలీజ్ వారెంట్‌ను సోమవారం ప్రత్యేక కోర్టు జారీ చేసింది. అయితే అప్పటికి కూడా తోషఖ్కా, 190 మిలియన్ పౌండ్ల అల్ ఖాదిర్ ట్రస్టు కేసులో ఇమ్రాన్ ఖాన్ జైలులో ఉన్నారు.

ఉత్తర గాజాలో వైద్య సంక్షోభం

- 12 రోజులుగా ఆస్పత్రులకు అందని వైద్య సరఫరాలు !
- డబ్ల్యుహెచ్ఓ ఆందోళన



ఉత్తర గాజా ఆసుపత్రుల్లో కిక్కిరిసిన ఇజ్రాయిల్ యుద్ధోన్మాద బాధితులు

గాజా : ఉత్తర గాజాలో వైద్య సేవలు పూర్తిగా స్థంభించాయి. ఇజ్రాయిల్ యుద్ధోన్మాదంతో పెను సంక్షోభం నెలకొంది. ఈ ప్రాంతంలో భద్రతాపరమైన హామీలు సరిగా లేకపోవడంతో ఉత్తర గాజాలోని వైద్య సరఫరాల మిషన్‌ను నాల్గోసారి రద్దు చేయాల్సి వచ్చిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) ఆందోళన వ్యక్తం చేసింది. ఇజ్రాయిల్ దాడుల కారణంగా గత 12 రోజులుగా ఉత్తర గాజాలోని ఆస్పత్రులకు వైద్య సరఫరాలను అందచేయలేకపోయామని డబ్ల్యుహెచ్ఓ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అదనామ్ గెబ్రియెసెస్ చెప్పారు. అత్యవసరంగా, సురక్షితమైన, ఎలాంటి ఆటంకాలు లేని రీతిలో రవాణాకు హామీ కల్పించడం అవశ్యంగా వుందన్నారు. అల్ అవదా ఆస్పత్రికి, ఉత్తర గాజాలోని సెంట్రల్ ఫార్మసీకి ఔషధాలు అందచేయాల్సి వుందని, కానీ జరగలేదని, డిసెంబరు 26 నుండి ఇలా జరగడం ఇది నాల్గోసారని అన్నారు. ఘర్షణలను నివారించి, భద్రత కల్పిస్తామంటూ తమకు ఎలాంటి హామీలు రాలేదని చెప్పారు. దాడుల్లో గాయపడిన రోగులకు వైద్య సేవలు అందించడానికి ఈ సరఫరాలు చాలా కీలకమని అయినా వాటిని అందచేయలేకపోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. భారీగా కొనసాగుతున్న దాడులు, రవాణా, కమ్యూనికేషన్ సదుపాయాలు సరిగా లేకపోవడంతో ఉత్తర ప్రాంతంలో వైద్య సరఫఋాల రవాణా చాలా క్లిష్టంగా మారింది. పైగా ఆస్పత్రుల్లో ఆరోగ్య సిబ్బంది కూడా కొరతగానే వుందని డబ్ల్యుహెచ్ఓ తెలిపింది. ఇప్పటివరకు ఇజ్రాయిల్ దాడుల్లో 22,830 మంది మరణించగా, 58,400 మంది గాయపడ్డారని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది.

బ్లాక్ నజరీన్ గౌరవార్థం జనసంద్రమైన మనీలా !

మనీలా : ఫిలిప్పైన్స్ రాజధాని మనీలా నగరం లక్షలాదిమంది కేథలియన్లతో ఎరుపు, పసుపు రంగు సముద్రాన్ని తలపించింది. బ్లాక్ నజరీన్ గౌరవార్థం ఈ ఏడాది జరిగిన బ్రహ్మాండమైన ప్రదర్శనకు 60 లక్షల మందికి పైగా కేథలిక్కులు హాజరయ్యారు. జీసెస్ క్రీస్ట్ నల్ల చెక్క విగ్రహానికి నివాళి ఘటించడం శతాబ్దాల నాటి నుంచి ఇక్కడ సాంప్రదాయంగా వస్తోంది. ఆ విగ్రహానికి రోగాలను నయం చేసే శక్తులు వున్నాయని స్థానికులు విశ్వసిస్తారు. గత మూడేళ్లుగా కోవిడ్ కారణంగా రద్దు చేస్తూ వస్తున్న ప్రదర్శన ఈ ఏడాది జరగడంతో ప్రజలు లక్షలాదిగా తరలివచ్చారు. తెల్లవారు జామునకే 8,30,000 మంది వచ్చారని పోలీసులు తెలిపారు. ఆ తర్వాత 6 కిలోమీటర్ల పొడవునా సాగిన ప్రదర్శనలో 65 లక్షల మంది పాల్గొన్నారు. మెక్సికోలో రూపు దిద్దుకున్న ఈ విగ్రహాన్ని 17వ శతాబ్దం ఆరంభంలో ఫిలిప్పైన్స్‌కి తీసుకుచ్చారు. క్రీస్తు శిలువను మోస్తున్నట్లు ఈ విగ్రహం వుంటుంది. 15 గంటల పాటు కొనసాగిన ఈ ప్రదర్శన ఆద్యంతం శాంతియుతంగానే కొనసాగడం విశేషం.



మాల్దీవుల అధ్యక్షుడు రాజీనామా చేయాలి

- భారత్‌పై వ్యాఖ్యలు పలువురి ఖండన

మాలె : కొత్తగా ఎన్నికైన మాల్దీవుల అధ్యక్షుడు మహ్మద్ ముయిజు పదవి నుండి వైదొలగాలని, ఆయన ప్రభుత్వం రాజీనామా చేయాలని మాల్దీవులకు చెందిన పలువురు ప్రతిపక్ష నేతలు డిమాండ్ చేస్తున్నారు. భారత ప్రధాని నరేంద్ర మోడీపై అవమానకరమైన వ్యాఖ్యలు చేసినందుకు తక్షణమే ముయిజు రాజీనామా చేయాలంటూ తాజాగా పార్లమెంట్ సభ్యునిగా ఎన్నికైన అజిమ్ అలీ డిమాండ్ చేశారు. మాల్దీవుల ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు తక్షణమే అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించాలంటూ ఆయన ప్రతిపక్ష నేతలను కోరారు. ప్రజాస్వామ్యవాదులుగా దేశ విదేశాంగ విధానం సుస్థిరతను పరిరక్షించడానికి తాము అంకితమయ్యామని, ఏ పొరుగు దేశాన్నీ కూడా ఏకాకిని చేయడానికి తాము వ్యతిరేకమని ఆజం అలీ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. తక్షణమే భారతీయులకు క్షమాపణలు చెబుతూ మాల్దీవుల ప్రభుత్వం ప్రకటన చేయాలన్నారు. మాల్దీవుల మాజీ అధ్యక్షుడు ఇబ్రహ్రం సోలీ మాట్లాడుతూ, మంత్రులు చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా ఖండించదగ్గవన్నారు.

చట్టం ముందు అందరూ సమానమే

- న్యాయ ప్రక్రియపై విశ్వాసం కల్పించే తీర్పు
- మద్దతుగా నిలిచిన ప్రజానీకానికి కృతజ్ఞతలు
- సుప్రీం తీర్పు పట్ల బిల్కిస్ బానో స్పందన



న్యూఢిల్లీ : చట్టం ముందు అందరూ సమానమే..సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు న్యాయ వ్యవస్థపై ఆశను చిగురింపజేసింది..నాకు మద్దతుగా నిలిచిన వేలాది ప్రజానీకానికి కృతజ్ఞతలు..నేడు కొండంత బరువును దించుకున్నట్లుగా ఉంది..ఉపశమనంతో కన్నీళ్లు పెట్టుకున్నాను..ఇది సుప్రీం తీర్పుపై బిల్కిస్ బానో స్పందన. గుజరాత్ మారణకాండ నేపథ్యంలో ఆమె కుటుంబం కాషాయ గూండాల నుంచి తీవ్ర దాడులను ఎదుర్కొంది. నాటి కేసుల్లో శిక్ష పడిన 11 మంది సంఘ్ పరివార్ గూండాలకు జైలు శిక్ష తగ్గించి గుజరాత్ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసింది. గుజరాత్ తీసుకున్న నిర్ణయాన్ని కొట్టివేసి..ఆ 11 మంది దుండగులు తిరిగి జైలుకు రావాలని జస్టిస్ బివి నాగరత్న, జస్టిస్ ఉజ్వల్ భుయాన్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం సోమవారం నాడు తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. ఈ తీర్పుపై బిల్కిస్ బానో తన మనస్సులోని మాటను దేశ ప్రజలందరితో పంచుకుంటూ ఒక ప్రకటన చేశారు. బిల్కిస్ తరపున ఆమె న్యాయవాది శోభా గుప్తా జారీ చేసిన ఆ ప్రకటన ఇలా ఉంది..

'నేడు నిజంగా నాకు నూతన సంవత్సరం. ఉపశమనంతో నేను కన్నీళ్ళు పెట్టుకున్నాను. ఏడాదిన్నర కాలంలో మొదటిసారిగా నవ్వాను. నా పిల్లలను ఆలింగనం చేసుకున్నాను. నా ఛాతీపై నుండి పెద్ద కొండంత భారాన్ని దింపుకున్నట్లు అనిపించింది. తిరిగి ఊపిరి పీల్చుకోగలుగుతున్నాను. జరిగిన న్యాయం నాకు అలా అనిపించేలా చేసింది. ఈ నిరూపణను, అందరికీ సమాన న్యాయం అందిస్తామన్న హామీపై ఆశను నాకు, నా పిల్లలకు, మహిళలందరికీ అందించినందుకు భారత సుప్రీం కోర్టుకు కృతజ్ఞతలు.

నేను ఇంతకుముందు చెప్పాను, ఈనాడు మళ్లీ చెబుతున్నాను, నేను చేసినటువంటి ఈ ప్రయాణాలు ఎవరూ, ఎన్నడూ ఒంటరిగా చేయలేరు. నా వెనుకనే, నాకు అండగా నా భర్త, నా పిల్లలు వున్నారు. నాకు నా స్నేహితులు వున్నారు. ఇటువంటి విద్వేషం నెలకొన్న సమయంలో వారు నాకు ఎంతగానో ప్రేమను అందించారు. ప్రతి క్లిష్టమైన మలుపులో వారు నా చేయి పట్టుకున్నారు. అసాధారణమైన న్యాయవాది శోభా గుప్తా నాతో వున్నారు. 20ఏళ్ల సుదీర్ఘ కాలం ఆమె నాతోనే పయనం సాగించారు. న్యాయం అందించే ప్రక్రియ పట్ల ఆశావాదాన్ని కోల్పోవడానికి ఆమె ఎన్నడూ అనుమతించలేదు.

ఏడాదిన్నర క్రితం, 2022 ఆగస్టు 15న, నా కుటుంబాన్ని ధ్వంసం చేసిన, నా ఉనికినే భయకంపితంగా చేసిన వారిని త్వరగా విడుదల చేశారు. అది వినగానే నేను కుప్పకూలిపోయాను. నా ధైర్యమంతా ఆవిరి అయిపోయినట్లు అనిపించింది. లక్షలాదిగా సంఘీభావ సందేశాలు నాకు వచ్చాయి. వేలాదిమంది సామాన్య ప్రజానీకం, మహిళలు ముందుకొచ్చారు. వారు నాకు అండగా నిలిచారు. నాతో మాట్లాడారు. సుప్రీం కోర్టులో పిల్ పిటిషన్లు వేశారు. దేశవ్యాప్తంగా 6 వేలు, ముంబయికి చెందినవారే 8500 మంది రాతపూర్వక అప్పీళ్లు పంపించారు. 10 వేల మంది బహిరంగ లేఖ రాశారు. కర్ణాటకలోని 29 జిల్లాలకు చెందిన 40 వేల మంది కూడా అలాగే లేఖ రాశారు. వీరిలో ప్రతి ఒక్కరికీ, వారి అమూల్యమైన సంఘీభావం, బలాన్ని అందించినందుకు నా కృతజ్ఞతలు. కేవలం నా కోసమే కాదు, భారత్‌లోని ప్రతి ఒక్క మహిళ కోసం న్యాయం యొక్క ఆలోచనను రక్షించడానికి పోరాడాలనే సంకల్పాన్ని మీరు నాకిచ్చారు. అందుకు నేను మీకు కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాను.

ఈ తీర్పు యొక్క పూర్తి అర్థాన్ని నా జీవితానికి, నా పిల్లల జీవితాలకు అన్వయించుకుని, అవగాహన చేసుకున్నప్పటికీ, నేడు నా హృదయం నుండి వెలువడే ప్రార్ధన అనేది చాలా సింపుల్‌గా వుంటుంది. - చట్టబద్ధ పాలన అన్నిటికీ అతీతం, చట్టం ముందు అందరూ సమానమే.'

- బిల్కిస్ బానో
జనవరి 8, 2024



మీ కోసం

తేనె శుభ్రంగా నిల్వ ఉండాలంటే.. మంచి సీసాలో పోసి అందులో రెండు, మూడు లవంగాలు వెయ్యాలి.

జీవన సారథం

ప్రతి అవకాశంలోనూ కొన్ని అడ్డంకులు, ప్రతి అడ్డంకి వెనుకా కొన్ని అవకాశాలు ఉంటాయి.

కథ చెపుతాను ఊ కొడతావా!



పిల్లలంతా బయట గోల గోలగా ఆడుకుంటున్నారు. రుద్ర బుంగమూతి పెట్టుకుని వచ్చి పేదరాసి పెద్దమ్మ గుమ్మంలో కూర్చున్నాడు. "నువ్వెందుకు ఆడుకోడానికి వెళ్ళలేదు?" అంది పెద్దమ్మ. 'నాకు ఆడుకోవాలని లేదు' అన్నాడు రుద్ర. 'ఎందుకని?' అడిగింది పెద్దమ్మ.

'చెప్పిన మాట వినడం లేదని అమ్మ నన్ను తిట్టింది. అందుకే అలిగేను' అని చెప్పాడు రుద్ర. ఇంట్లో వాళ్ల మాట వినకుండా ఎదురుచెప్పడం, చీటికీ మాటికీ విసుక్కోవడం, అలగడం రుద్రకి అలవాటని పెద్దమ్మకి తెలుసు. ఈ రోజు ఎలాగైనా రుద్రలో మార్పు తేవాలని మనసులో అనుకుంది పెద్దమ్మ.

బుంగమూతి పెట్టుకుని కూర్చొన్న రుద్రతో 'పెద్దవాళ్ళు ఏం చెప్పినా మన మంచికే. సరే రా! నీకో కథ చెప్తాను' అంది పెద్దమ్మ. 'పెద్దమ్మా కథ వింటే ఏమొస్తుంది?' అన్నాడు అమాయకంగా. 'కథ మన తెలివిని పెంచుతుంది. ఎవరితో ఎలా మెలగాలో చెప్తుంది' అంటూ కథ చెప్పడం ప్రారంభించింది ఆమె.

చామలాపల్లి గ్రామంలో వరహాలు అనే వ్యాపారి ఉండేవాడు. అతడికి ఇద్దరు కొడుకులు. పెద్దవాడు కాంతయ్య, రెండోవాడు కనకయ్య. పెద్దవాడు తండ్రికి చేదోడు వాదోడుగా ఉండేవాడు. రెండోవాడు తండ్రి చేసే కిరాణా వ్యాపారం కాకుండా పట్నం వెళ్లి ఏదైనా కొత్త వ్యాపారం చేసి సొమ్ము గడించాలని ఆలోచించేవాడు. తండ్రి ఒకరోజు చిన్నకొడుకుని పిలిచి 'నాయనా నామాట విను. తెలిసిన దారిలో వెళితే సుఖంగా గమ్యాన్ని చేరుకుంటాం, లేదంటే రాళ్ళు ముళ్ళు గుచ్చుకుని కష్టాలు పాలు అవకతప్పదు' అని చెప్పాడు. తండ్రిమాట కనకయ్య చెవికెక్కలేదు. తన వాటా డబ్బు పట్టుకుని పట్నం వెళ్ళి వ్యాపారం ప్రారంభించాడు. ఖాతాదారులను ఆకట్టుకునే ప్రయత్నం చేశాడు. ఆకర్షణీయమైన పథకాలు పెట్టాడు. అయినా ఫలితం లేక పోయింది. వ్యాపారం దివాలా తీసింది. చేసేదేమీ లేక తండ్రి పంచన చేరాడు.

నష్టపోయి ఇంటికొచ్చిన కొడుకుని దగ్గరకు తీసుకుని ధైర్యం చెప్పాడు తండ్రి. 'ఎగిరే గాలిపటానికి దారం ఆధారం అయినట్లు మా అనుభవాలు, ఆలోచనలే మీ పురోగతికి ఆధారం' అని హితవు పలికాడు. తండ్రి మాటల్లోని మర్మం గ్రహించి అన్నకి చేదోడుగా ఉంటూ వ్యాపారాన్ని అభివృద్ధి చేశాడు' అని పెద్దమ్మ కథ ముగించింది.

పెద్దమ్మ కథలో నీతి రుద్రకు అర్థం కాకపోయినా, పెద్ద వాళ్ల మాట వినాలని మాత్రం మనసులో గట్టిగా నాటుకుపోయింది. ఆ రోజు నుండి ఇంట్లో అమ్మానాన్నకు ఎదురుచెప్పకుండా వాళ్ల మాటవింటూ బుద్ధిమంతుడిలా ఉన్నాడు.

- కాశీ విశ్వనాథం పట్రాయుడు,
94945 24445.

నేను గీసిన బొమ్మ





శీల, భావన తరణి,
6వ తరగతి,
ఎస్‌కెపివివి హిందూ హైస్కూల్, విజయవాడ.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

నేను మళ్లీ ఊపిరి పీల్చుకుంటున్నాను...

"ఈ రోజు.. నాకు నిజమైన కొత్త సంవత్సరం. ఏడాదిన్నర తరువాత మొదటిసారి చిరునవ్వు నవ్వాను. నా హృదయం మీద పెద్ద పర్వత మంత బాధ దూదిపింజలా ఎగిరి పోయిన భావం కలుగుతోంది. నేను ఈ రోజు మళ్లీ ఊపిరి పీల్చుకుంటున్నాను. నేను కోరుకున్న న్యాయం జరిగింది. నాకే కాదు, నా పిల్లలకు, మహిళలందరికీ ఈ తీర్పు గొప్ప ధైర్యాన్ని ఇచ్చింది. న్యాయం అందరికీ సమానమనే నమ్మకాన్ని కలిగించింది."
ఇదీ, గుజరాత్ అమానుష కాండలో అత్యాచారానికి గురైన బిల్కిస్ బానో స్పందన. ఆమెపై అమానుషానికి పాల్పడ్డ వారికి గుజరాత్ ప్రభుత్వమూ, హైకోర్టూ క్షమాబిక్ష పెట్టి, విడుదలచేయటాన్ని సుప్రీంకోర్టు తప్పు పట్టింది. రెండు వారాల్లో దోషులను జైలుకు పంపాలని తీర్పు చెప్పింది. ఈ నేపథ్యంలో బిల్కిస్ తన అంతరంగాన్ని ఇలా వ్యక్తం చేశారు.



నేను ఇంతకు ముందూ చెప్పాను. ఇప్పుడూ చెబుతున్నాను. నాలాంటి వారి ప్రయాణం ఒంటరిగా ఉండదు. నాకు భర్త, పిల్లలు తోడున్నారు. స్నేహితులు అండగా నిలబడ్డారు. ప్రత్యర్థులు నాపై ద్వేషం చిమ్ముతున్న వేళ నాకు కోట్లాది మంది అండగా నిలబడ్డారు. కష్టం ఎదురైన ప్రతిసారీ నా చేయి పట్టుకుని నడిపించారు. నా న్యాయవాది శోభా గుప్తా 20 ఏళ్లగా నాతో పాటు ప్రయాణించారు. న్యాయం పట్ల ఎప్పుడూ నిరాశపడకుండా ఆమె నన్ను ముందుకు నడిపించారు.

నా కుటుంబాన్ని నాశనం చేసి, నా ఉనికిని భయభ్రాంతులకు గురిచేసిన వారిని ఏడాదిన్నర క్రితం 2022 ఆగష్టు 15న విడుదల చేసినప్పుడు కుప్పకూలిపోయాను. ఇన్నేళ్ల పాటు ధైర్యంతో పోరాడిన నేను ఆ క్షణం భయంతో వణికిపోయాను. నిరాశతో కుదేలైన నాకు అండగా దేశ నలుమూలల నుండి అసంఖ్యాక జన సమూహాలు కదిలాయి. నాకు సంఘీభావంగా నిలబడ్డాయి. సాధారణ ప్రజలు, మహిళలు నా తరపున తమ గొంతుకలు వినిపించారు. నాకు న్యాయం జరగాలని సుప్రీంకోర్టులో దరఖాస్తులు చేశారు. దేశం మొత్తం మీద 6000, ముంబయి నుండి 8500 పిల్స్ సుప్రీంలో నమోదయ్యాయి. 10 వేల మంది బహిరంగ లేఖలు రాశారు. 40 వేల మంది నాకు మద్దతుగా ఉత్తరాలు రాశారు. మీ విలువైన సంఘీభావం తెలిపిన ప్రతి ఒక్కరికీ నా కృతజ్ఞతలు. మీరు చూపించిన ఈ మద్దతు నాలాంటి ఎంతోమందికి, ముఖ్యంగా బాధిత స్త్రీలకి ఎన్ని కష్టాలు ఎదురైనా న్యాయం పొందేవరకు పోరాడాలనే సంకల్పాన్ని ఇచ్చింది.

ఈ తీర్పులో నా జీవితం, నా పిల్లల జీవితాల సంపూర్ణ అర్థాన్ని గ్రహిస్తున్నాను. ఆ ఆలోచనలలోనే బతుకుతున్న నాకు ఈ తీర్పు గొప్ప ఊరట నిస్తుంది. న్యాయం ముందు అందరూ సమానమని ఈ తీర్పు చాటిచెబుతోంది."

75వ స్వాతంత్ర్య దినోత్సవం రోజున, ఎర్రకోటపై ప్రధానమంత్రి మహిళల గురించి గొప్పగా మాట్లాడుతున్న వేళ, క్షమాభిక్ష పేరుతో, బ్రాహ్మణులు తప్పులు చేయరన్న నెపంతో, ఊరిపెద్ద ఆడవాళ్లను అగౌరవ పర్చరన్న అభిప్రాయంతో, ఇలా ఒక్కొక్కరూ ఒక్కో కారణంగా బిల్కిస్ కేసులో శిక్ష అనుభవిస్తున్న మొత్తం నిందితులు జైలు నుండి బయటికి వచ్చేశారు. ఆ రోజుతో బిల్కిస్ కథ ముగిసిందని ఆ దుర్మార్గులు భావించి ఉంటారు. కానీ, బిల్కిస్ మళ్లీ లేచి నిలబడింది. న్యాయం అర్థిస్తూ సుప్రీం గడప తొక్కింది.

ఆమె ఒంటరి కాదని, అశేష భారతావని ఆమెకు అండగా నిలబడింది. దోషుల విడుదలలో అన్యాయాన్ని సుప్రీంకోర్టు గ్రహించింది. గుజరాత్ హైకోర్టు తీర్పు చెల్లదని సుప్రీం తాజా తీర్పు వెలువరించింది. ఈ సందర్భంగానే బిల్కిస్ పైవిధంగా తన సంతోషాన్ని పంచుకున్నారు. ఆమె న్యాయవాది శోభా గుప్తా బిల్కిస్ రాసిన ఈ లేఖను బాహ్య ప్రపంచానికి చూపించారు.

ఒక అసహాయ మహిళకు మేమున్నామని అండగా నిలబడిన ప్రతి ఒక్కరికీ బిల్కిస్ ఈ లేఖలో కన్నీటితో కృతజ్ఞతలు తెలిపింది. ఈ దేశంలో బిల్కిస్ లాంటి మహిళలు నిత్యం న్యాయం కోసం పోరాడుతున్నారు. బిల్కిస్ విషయంలో జరిగిన న్యాయమే బాధిత మహిళలందరూ పొందాలంటే ప్రశ్నించే గొంతుకలు, మద్దతు నిచ్చే లేఖలు, చేయి చేయి కలిపి నడిచే చేతులు ఎన్నో, మరెన్నో బయటికి రావాలి. ఆ రోజులు త్వరలోనే రావాలని ఆశిస్తూ...

అసలేం జరిగింది?


2002 గుజరాత్ అల్లర్లలో అత్యంత పాశవికంగా అత్యాచారానికి గురైంది బిల్కిస్‌బాను. ఆమె ఉదంతం ఎప్పుడు గుర్తుకు తెచ్చుకున్నా ప్రతి మహిళా ఉలిక్కిపడుతుంది. అంతలా ఆమెకు అన్యాయం జరిగింది. ఆ దారుణ ఘటనలో కళ్లముందే కన్నబిడ్డను, కుటుంబసభ్యులను కోల్పోయింది. గర్భిణీ అని చూడకుండా పదే పదే అత్యాచారానికి గురైంది.

గుజరాత్ కోర్టులో తనకు న్యాయం జరగదని సుప్రీంకోర్టును ఆశ్రయించిన బిల్కిస్ కేసు ముంబయికి బదిలీ చేశారు. కోర్టులో కేసు నడుస్తుండగానే బెదిరింపులు వల్ల 10 సార్లు ఇంటి అడ్రెస్‌లు మార్చుకోవాల్సివచ్చింది. గుజరాత్ నుంచి బయటికి వచ్చేసి సంచార కుటుంబాల మాదిరి ఊళ్లు తిరిగింది ఆ కుటుంబం. ఎట్టకేలకు 2017లో ముంబయి హైకోర్టు 11 మంది నిందితులపై జీవితఖైదు విధించింది.

అయితే 2022 మే నాటికి 11 మంది నిందితుల్లో ఒకరికి 15 ఏళ్లు జైలుశిక్ష పూర్తయిన సందర్భంగా క్షమాభిక్ష పెట్టమని సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేయాల్సిందిగా గుజరాత్ ప్రభుత్వాన్ని సుప్రీం కోరడమూ.. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఓ కమిటీ వేయడం.. సదరు కమిటీ ఆ ఒక్క నిందితుడికే కాక మిగిలిన పది మందికీ అంటే మొత్తం 11 మంది నిందితులను విడుదల చేయాలంటూ నివేదిక అందించడం మూడు నెలల్లోనే జరిగిపోయింది. 2022 ఆగష్టు 15న నిందితులు విడుదలయ్యారు. పూలదండలతో, బాజా భజంత్రీలతో బిజెపి నేతలు వారికి ఘనంగా స్వాగతాలు పలికారు. న్యాయం కోసం పోరాడిన బిల్కిస్‌పై నిప్పులు చెరిగారు.

ఆ రోజు.. నిందితులంతా బయటకు వచ్చారన్న వార్త వినగానే బిల్కిస్ నిలువెల్లా కంపించిపోయింది. 'ఈ తీర్పుతో ఏం చెప్పాలనుకుంటున్నారు? ఏ స్త్రీకైనా న్యాయం ఇలా ముగుస్తుందా? మన దేశంలోని న్యాయవ్యవస్థను నేను ఎంతో విశ్వసించాను. నా జీవితంలో జరిగిన గాయం ప్రతిరోజూ నన్ను వెంటాడుతుంది. మా భవిష్యత్తు ప్రశ్నార్థకమైంది. నా దు:ఖం, నా విశ్వాసం నాకు మాత్రమే సంబంధించినది కాదు. నాలాగే న్యాయం కోసం పోరాడుతున్న ఎంతోమంది మహిళలది' అంటూ ఆవేదన చెందింది. ఆ తరువాత గుజరాత్ తీర్పును సవాల్ చేస్తూ సుప్రీం కోర్టును ఆశ్రయించింది.

రంగవల్లి





పి. సాయి పల్లవి,
8వ తరగతి,
నారాయణ స్కూల్,
పెనుబల్లి గ్రామం, నెల్లూరు జిల్లా.

9 నుండి 5 చుక్కలు (మధ్య చుక్క)

ముగ్గులు పంపవల్సిన మా చిరునామా :
మెయిల్ ఐడి : jeevanapageps@ gmail.com
వాట్సాప్ : 83329 25496

'నా సామి రంగ' ట్రైలర్



నాగార్జున నటిస్తోన్న తాజా చిత్రం 'నా సామి రంగ'. విజయ్ బిన్ని తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో ఆషికా రంగనాథ్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. అల్లరి నరేశ్, రాజ్ తరుణ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. జనవరి 14న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం ప్రమోషన్స్ వేగం పెంచింది. తాజాగా నా సామి రంగ ట్రైలర్‌ను లాంఛ్ చేశారు. 'కిష్టయ్యను కొట్టే మగాడెవడైనా ఉన్నాడా.. అసలు' అంటూ నాగార్జున పోషిస్తున్న రోల్‌ను పరిచయం చేస్తూ.. అల్లరి నరేశ్ వాయిస్ ఓవర్‌తో ట్రైలర్ ప్రారంభమైంది. పవన్ కుమార్ సమర్పణలో వస్తోన్న ఈ చిత్రానికి ప్రసన్నకుమార్ బెజవాడ కథ అందిస్తున్నారు. కీరవాణి సంగీతం అందిస్తున్నారు. శ్రీనివాసా చిట్టూరి నిర్మాణం వహిస్తున్నారు.



గుంటూరు కారం టికెట్ ధరల పెంపు

మహేష్‌బాబు కథానాయకుడిగా నటించిన గుంటూరు కారం సినిమా టిక్కెట్ ధరల పెంపునకు తెలంగాణా ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఉన్న టికెట్లకు అదనంగా సింగిల్ స్క్రీన్లలో రూ.65, మల్టీప్లెక్స్ థియేటర్లలో రూ.100 పెంచేందుకు వెసులుబాటు కల్పించింది. మహేష్ అభిమానులను దృష్టిలో పెట్టుకుని బెనిఫిట్ షోల ప్రదర్శనకు కూడా అంగీకరించింది. రాష్ట్రంలో 23 చోట్ల ఈనెల 12న అర్ధరాత్రి 1 గంట షో ప్రదర్శించనున్నారు. పండుగ సందర్భంగా గుంటూరుకారం ఆరో షో ప్రదర్శనకు కూడా అనుమతించింది. 12 నుంచి 18 వరకూ ఉదయం షోలను ప్రదర్శించనున్నారు. త్రివిక్రమ్ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రంలో శ్రీలీల, మీనాక్షి చౌదరి కథానాయకులు. రమ్యకృష్ణ, ప్రకాష్‌రాజ్; జగపతిబాబు కీలకపాత్రలు పోషించారు.




'12th ఫెయిల్' రికార్డు

విధు వినోద్ చోప్రా దర్శకత్వంలో విక్రాంత్ మస్సే ప్రధానపాత్రలో నటించిన చిత్రం 12త్ ఫెయిల్. విమర్శకుల నుంచి ప్రశంసలు అందుకున్న ఈ చిత్రం అరుదైన ఘనత సాధించింది. ఇంటర్నెట్ మూవీ డేటాబేస్ (ఐఎండీబీ)లో అత్యధిక రేటింగ్ పొందిన ఇండియన్ సినిమాగా రికార్డు నెలకొల్పింది. గతేడాది విడుదలైన హాలీవుడ్ చిత్రాలకంటే దీని రేటింగ్ ఎక్కువగా ఉండటం విశేషం. తాజాగా గోల్డెన్ గ్లోబ్ అవార్డుల్లో సత్తా చాటిన 'ఓపెన్‌హైమర్' (8.4), బాక్సాఫీసు వద్ద వసూళ్ల వర్షం కురిపించిన 'స్పైడర్ మ్యాన్: అక్రాస్‌ది స్పైడర్ వెర్స్' (8.6) సినిమాల రేటింగ్స్‌ను దాటి 12త్ ఫెయిల్ 9.2 సాధించింది. 12వ తరగతి ఫెయిలైన మనోజ్‌కుమార్ అనే వ్యక్తి ఐపిఎస్ ఎలా అయ్యాడనే కథతో ఈ సినిమాను తీసిన విషయం తెలిసిందే. ఆస్కార్‌కు జనరల్ కేటగిరీలో ఇండిపెండెంట్‌గా చిత్ర బృందం నామినేషన్ వేసింది.



'కన్యాకుమారి' టీజర్

రాడికల్ పిక్చర్స్ బ్యానర్‌పై దర్శక నిర్మాతగా 'కన్యాకుమారి' సినిమాను దామోదర తెరకెక్కిస్తున్నారు. గీత్ సైని, శ్రీచరణ్ రాచకొండ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమా షూటింగ్ కంప్లీట్ చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. చిత్ర టీజర్‌ను హీరో విజయ్ దేవరకొండ రిలీజ్ చేశారు. ఆనంద్ దేవరకొండ హీరోగా 'పుష్పక విమానం' సినిమాతో దామోదర వెండితెరకు పరిచయం అయ్యారు. ప్రస్తుత చిత్రం ఆయన సెకండ్ ప్రాజెక్ట్‌గా రానుంది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాక ఈ సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటించనున్నారు.



సంగీత దర్శకుడు రషీద్‌ఖాన్ మృతి

బాలీవుడ్‌కు చెందిన ప్రముఖ సంగీత దర్శకుడు రషీద్‌ఖాన్ (55) అనారోగ్యంతో కోల్‌కతాలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో మంగళవారం తుదిశ్వాస విడిచారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయన్ను కుటుంబ సభ్యులు గత నెలలో ఆసుపత్రిలో చేర్పించారు. రషీద్‌ఖాన్ మృతికి పలువురు సినీ ప్రముఖులు తీవ్ర సంతాపం తెలిపారు. 'జబ్ వి మెట్' అనే చిత్రంలో 'ఆవోగే జబ్‌తుమ్' అనే పాటతో ఆయనకు మంచి గుర్తింపు వచ్చింది. కళారంగంలో ఆయన చేసిన సేవలకుగాను కేంద్రప్రభుత్వం పద్మశ్రీ, 2006లో సంగీత నాటక అకాడమీ పురస్కారం లభించింది. 2022లో పద్మభూషణ్ అవార్డును ప్రధానం చేసింది.

'శ్రీకాకుళం షెర్లాక్ హెూమ్స్' ఫస్ట్ లుక్



వెన్నెల కిషోర్ హీరోగా 'శ్రీకాకుళం షెర్లాక్ హెూమ్స్' పేరుతో ఓ చిత్రం తెరకెక్కుతోంది. క్రైమ్ కామెడీ థ్రిల్లర్‌గా తెరకెక్కుతోన్న ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను తాజాగా 24 మంది టాలీవుడ్ డైరెక్టర్లు ఒకేసారి రిలీజ్ చేశారు. ఈ సినిమాకి రైటర్ మోహన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాతోనే ఆయన టాలీవుడ్‌కి పరిచయం అవుతున్నారు. అనన్య నాగళ్ల హీరోయిన్‌గా నటిస్తున్నారు. షెర్ అంటే షర్మిలమ్మ, లోక్ అంటే లోక్‌నాథం, హెూమ్ అంటే ఓం ప్రకాష్. ఈ మూడు పాత్రల చుట్టే కథ సాగుతుందని డైరెక్టర్ తెలిపారు. ఈ చిత్రంలో కొత్త వైబ్ కనిపిస్తోందని, ఫస్ట్ లుక్ చూస్తుంటే మంచి వినోదం ఉంటుదనే నమ్మకం కలుగుతుందని ఈ సందర్భంగా దిల్ రాజు అన్నారు. ఈ సినిమాకి సునీల్ కశ్యప్ సంగీతం అందిస్తున్నారు.

జాతీయ క్రీడా అవార్డుల ప్రదానం

రాష్ట్రపతి భవన్‌లో అట్టహాసంగా వేడుక • టోర్నీల కారణంగా సాత్విక్-చిరాగ్, ఈషా సింగ్ దూరం



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా అర్జున అవార్డులు అందుకుంటున్న షమీ, హుసాముద్దీన్, షీతల్‌దేవి(పారా ఆర్చరీ)

న్యూఢిల్లీ: 2023 ఏడాదికి క్రీడల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన ఆటగాళ్లకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గ్రహీతలకు అవార్డులు ప్రదానం చేశారు. ప్రతి ఏడాది ఆగస్టు 29న హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం జరగాల్సి ఉన్నా.. గత ఏడాది సెప్టెంబర్ 23 నుంచి అక్టోబర్ 8వరకు హాంగ్జౌలో ఆసియా క్రీడల దృష్ట్యా అవార్డుల ప్రదానం వాయిదాపడింది. ఈ నేపథ్యం లో మంగళవారం రాష్ట్రపతి భవన్‌లో అవార్డుల ప్రదానోత్స వ కార్యక్రమంగా అట్టహాసంగా జరిగింది. బ్యాడ్మింటన్ స్టార్ డబుల్స్ జోడీ రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టికి దేశ అత్యున్నత క్రీడా పురస్కారం ఖేల్‌రత్న పురస్కారాన్ని ప్రకటించినా.. వీరు ప్రస్తుతం మలేషియా ఓపెన్ సూపర్-100 టోర్నీలో ఉన్న కారణంగా వీరు పురస్కారాన్ని అందుకోలేదు. అలాగే హైదరాబాద్ షూటర్ ఈషా సింగ్ కూడా జకార్తా వేదికగా జరుగుతున్న ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఉన్న కారణంగా ఆమె కూడా తనకు దక్కిన అర్జున అవార్డును అందుకోలేక పోయింది. ఇక టీమిండియా పేసర్ మహ్మద్ షమి.. దేశ రెండో అత్యున్నత క్రీడా పురస్కారం అర్జున అవార్డును అందుకున్నాడు. 2023 ఏడాది 26మందికి అర్జున అవార్డులు వరించాయి. తెలుగు రాష్ట్రాల నుంచి ఈషా సింగ్(షూటింగ్), మహ్మద్ హుసాముద్దీన్(బాక్సింగ్), అజయ్‌కుమార్ రెడ్డి(అంధుల క్రికెట్)లకు అర్జున అవార్డులు వరించాయి. ఖేల్‌రత్న గ్రహీత రూ.25లక్షలు, అర్జున అవార్డు గ్రహీతలు రూ.15లక్షల నగదు అందుకున్నారు.

అర్జున అవార్డు ప్రదాన గ్రహీతలు..

1. ఓజాస్ ప్రవీణ్ ధోతలే : ఆర్చరీ
2. అదితి గోపీచంద్ స్వామి : ఆర్చరీ
3. మురళీ శ్రీశంకరన్ : అథ్లెటిక్స్
4. పారుల్ చౌదరి : అథ్లెటిక్స్
5. మహ్మద్ హుసాముద్దీన్ : బాక్సింగ్
6. ఆర్. వైశాలి : చెస్
7. మహ్మద్ షమీ : క్రికెట్
8. అనూష్ అగర్వాలియా : ఈక్వెస్ట్రియన్
9. దివ్యకృతి సింగ్ : ఈక్వెస్ట్రియన్ డ్రెస్సెజ్
10. దీక్షా దగర్ : గోల్ఫ్
11. క్రిషన్ బహదూర్ పాఠక్: హాకీ
12. సుశీలా ఛాను : హాకీ
13. పవన్ కుమార్ : కబడ్డీ
14. రీతు నేగి : కబడ్డీ
15. నస్రీన్ : ఖో-ఖో
16. పింకి : లాన్ బౌల్స్
17. ఐశ్వరీ ప్రతాప్ సింగ్ థోమర్ : షూటింగ్
18. ఈషా సింగ్ : షూటింగ్
19. హరిందర్ పాల్ సింగ్ సంధు : స్క్వాష్
20. ఐహికా ముఖర్జీ : టేబుల్ టెన్నిస్
21. సునీల్ కుమార్ : రెజ్లింగ్
22. అంతిమ్ పంగల్ : రెజ్లింగ్
23. రోషిబినా దేవి : వుషూ
24. షీతల్ దేవి : పారా ఆర్చరీ
25. అజయ్‌కుమార్ రెడ్డి : అంధుల క్రికెట్
26. ప్రాచీ యాదవ్ : పారా కనోయింగ్

టి20 సిరీస్‌లోనూ నిరాశే..

చివరి మ్యాచ్‌లో ఆస్ట్రేలియా మహిళల చేతిలో 7వికెట్ల తేడాతో ఓటమి



ముంబయి: భారత్, ఆస్ట్రేలియా మహిళా క్రికెట్ జట్ల మధ్య మంగళవారం జరిగిన మూడో టి20లో ఆసీస్ జట్టు ఎనిమిది బంతులు మిగిలి ఉండగానే ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. భారత్ నిర్దేశించిన 148 పరుగుల విజయ లక్ష్యాన్ని ఆసీస్ 18.4ఓవర్లలో 3వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్, కెప్టెన్ అల్యేసా హీలే 55 పరుగులు చేసి దీప్తి శర్మ బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యూ అయ్యింది. ఆమె స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన తహిలా మైక్ గ్రాత్ కూడా 20 పరుగులకు పూజా వస్త్రాకర్ బౌలింగ్‌లో దీప్తి శర్మకు క్యాచ్ ఇచ్చి పెవిలియన్‌కు చేరింది. అలేస్యా హీలేతో ఓపెనింగ్ బ్యాటర్‌గా వచ్చిన బెత్ మూనీ 52 పరుగులతో నాటౌట్‌గా నిలిచింది. దీంతో ఆస్ట్రేలియా 18.4ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 149 పరుగులు విజయం సాధించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌ను వికెట్ కీపర్ రీచా ఘోష్ ఆదుకుంది. టాపార్డర్ బ్యాటర్స్ స్మృతి మంధాన(29), షెఫాలీ వర్మ(26) తొలి వికెట్‌కు 39పరుగులు జతచేశారు. ఆ తర్వాత రోడ్రిగ్స్(2), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(3) వెంట వెంటనే ఔటవ్వడంతో భారత్ 66పరుగులకే 4వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో రీచా ఘోష్(34; 28బంతుల్లో 2ఫోర్లు, 3సిక్సర్లు) ధాటిగా ఆడింది. అంతకుముందు బ్యాటింగ్ చేసిన భారత్ మహిళల జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 147 పరుగులు చేసింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గా అన్నాబెల్ సదర్లాండ్, ప్లేయర్ ఆఫ్ సిరీస్ అల్యేషా హీలే ఎంపికయ్యారు. తొలి టి20లో భారత్ 9వికెట్ల తేడాతో నెగ్గినా.. 2, 3 టి20ల్లో ఓడి సిరీస్‌ను చేజార్చుకుంది. ఏకైక టెస్ట్‌లో భారత్ గెలిస్తే... వన్డే, టి20 సిరీస్‌ను ఆసీస్ కైవసం చేసుకొని తిరుగు పయనమైంది.

19నుంచి కుర్రాళ్ల కేక..

అండర్-19 పురుషుల వన్డే ప్రపంచకప్ షెడ్యూల్ విడుదల

దుబాయ్: దక్షిణాఫ్రికా వేదికగా ఈనెల 19నుంచి జరగనున్న ఐసిసి అండర్-19 వన్డే ప్రపంచకప్‌కు సర్వం సిద్ధమైంది. 16జట్ల మధ్య ఐదు వేదికల్లో 41మ్యాచ్‌లు జరగనున్నాయి. 16జట్లను నాలుగు గ్రూపులుగా విభజించగా.. ఒక్కో గ్రూప్‌లో నాలుగు జట్లు ఉన్నాయి. గ్రూప్ స్టేజ్‌లో ప్రతి జట్టు మిగిలిన మూడు జట్లతో ఒక్కో మ్యాచ్‌లో తలపడనుంది. ప్రతి గ్రూప్‌లో టాప్-3లో ఉన్న జట్లు సూపర్-6కు చేరనున్నాయి. 12జట్లను రెండు గ్రూప్‌లు విభజించి సూపర్-6 పోటీలు ముగిసిన తర్వాత టాప్-2జట్లు సెమీస్‌కు చేరనున్నాయి. జనవరి 19నుంచి ఫిబ్రవరి 11వరకు ఈ టోర్నమెంట్ జరగనుంది. గ్రూప్-ఎలో డిఫెండింగ్ ఛాంపియన్ భారత్‌తోపాటు 2020 ఛాంపియన్ బంగ్లాదేశ్, ఐర్లాండ్, అమెరికా జట్లు ఉన్నాయి. జనవరి 19న ఐర్లాండ్-అమెరికా జట్ల మధ్య ఓవల్‌లో జరిగే మ్యాచ్‌తో టోర్నమెంట్ ప్రారంభం కానుంది. 19నుంచి 28వరకు గ్రూప్ స్టేజ్ పోటీలు 30నుంచి సూపర్-6, ఫిబ్రరి 6, 8న సెమీఫైనల్ జరగనుండగా.. 11న ఫైనల్ మ్యాచ్ జరగనుంది.

గ్రూప్-ఎ : భారత్, బంగ్లాదేశ్, ఐర్లాండ్, అమెరికా
గ్రూప్-బి : ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, స్కాట్లాండ్
గ్రూప్-సి : ఆస్ట్రేలియా, శ్రీలంక, జింబాబ్వే, నమీబియా
గ్రూప్-డి : ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్, న్యూజిలాండ్, నేపాల్.

గ్రూప్ స్టేజ్ భారత్ మ్యాచ్‌ల షెడ్యూల్..

జనవరి 20 : భారత్ × బంగ్లాదేశ్
జనవరి 25 : భారత్ × ఐర్లాండ్
జనవరి 28 : భారత్ × అమెరికా

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68